UNIVERSAL LIBRARY
OU_204006
UNIVERSAL LIBRARY

OUP—552—7-7-66—10,000

**OSMANIA UNIVERSITY LIBRARY**

Call No. T83/S55K Accession No. T1704

Author శివశంకరశాస్త్రి

Title కాంచనమాలు

This book should be returned on or before the date last marked below.

అంకితము.

సుహృద్రత్నము, సుగుణఖని, కవి, కథకుఁడు

ధీశాలి, ఉపాధ్యాయశ్రేష్ఠుఁడు, సాహితీసమితిసభ్యుఁడు

శ్రీ చింతా దీక్షితులకు

# కాంచనమాల.

## పరిచ్ఛేదము ౧

### ౧

రెండుపుష్పములు. సమానముగా వికసించినవి. సమానముగా వెలుగొందుచు నలుదెసలం బరిమళము వెదజల్లుచున్నవి. పరస్పర వికాసము ప్రకటించి ప్రకటించి యామోదము విస్తరించి సంతోషభరమున నీవైపునకు నావైపునకు శిరముల నోరగిలవేయుచున్నవి. ఒకసారి పాపట దీర్చినట్లు విడివడి యింకొకసారి చిక్కుపడుచున్నవి. మందానిలము వానికిం బరస్పరాలింగనము ఘటించుచున్నది. మలయానిల మాగినప్పుడుకూడ నవి యన్యోన్యకాంతిములను బెనవైచుకొని విడివడుచున్నవి. ఎంత మనోహరము! ఇట్లు సమవికసితములు సమసురభిళములు సమవికాసశీలములు నగు సమానపుష్పముల పరస్పరసమ్మేళన మెంత మనోహరము! రెండు శకుంతములు. సుందరములు సుకంఠములు సుపుష్టములు సుహృష్టములు. యౌవనపారవశ్యమునం గ్రీడించునప్పుడవి యెంత మనోహరముగ నుండును! అవి యెగురుచుం గ్రిందికి వ్రాలుచు మరల నెగురుచు నొండొంటిం గానక కరుణాపూర్ణస్వరంబులతో వనమెల్ల నిండునట్లు కూజితములు సేయుచు మరల నొండొంటిం గాంచి చంచువులతో నంద

ముగాఁ బొడిచికొనుచున్న దెంత మనోజ్ఞము! అట్టి శకుంత ములు రెండిటికి సమ్మేళనము కలిగిన నెంత హృదయంగమము! ప్రణయ సమ్మేళనము శకుంత సమ్మేళనము మనోహరముగా నుండు ననుట నిజమే. కాని యీరీతి సమవయస్సుగల మానవవ్యక్తులు సమానముగా యౌవనప్రాదుర్భావము నొంది పరస్పరకోమలభావములతో సమ్మేళన మొందిరేని వారికన్న మనోజ్ఞవస్తువులు ప్రపంచమునం దేవి యుండును! సౌందర్యము కలిగి యౌవనస్ఫూర్తి కలిగి తేజస్సు కలిగి సుశిక్ష నొంది సద్వంశమున జనించి కలావైశద్యము గాంచిన యువపురుషుల సమాగమము గలుగుచో వారు కన్నులకు మిగుల శోభనీయు లగుదురు. సమవయస్సు గలిగి సమాన యౌవనస్ఫూర్తి గలవారలహృదయములు పవిత్రప్రేమబంధమున మేళవించెనేని స్వర్గమునుండి దేవతలుగూడ వారిని విలోకింతురు!

అట్టి సమ్మేళన మెవ్వరైన నెక్కడనైనఁ జూచియున్నారా? అట్టి ప్రేమానుబంధ సంబద్ధము లగుహృదయములను గాంచియున్నారా? పరస్పరావలోకనము కంతరాయ మొదవినపుడు వారిహృదయతంత్రులు ఛిన్నభిన్న మగుట కనుఁగొన్నారా? చూడ్కు లేకమైనపుడు వారిప్రాణములు లేచివచ్చుట గ్రహించినారా? చూపులు కలిసినప్పుడు వారి వాక్శక్తి లోపించుట పరికించినారా? పరస్పరావలోకనము లేనప్పుడు వారికి సర్వము నంధకారమయ మగుట చూచి

నారా? నయనములందు శరజ్జ్యోత్స్నయు కర్ణములందు సుధా
ధారలను వర్షనముఁ జన్మతిసరస్సును హృదయములందు
మహానురాగమును గలిగిన వారిసమ్మేళనము నవలోకించి
యున్నారా? అపారము నగాధము ననంతము ప్రశాంతము
నిర్మలము నగు జలరాశితో నపారము నగాధము ననంతము
ప్రశాంతము నిర్మలము నగు నీలాంబరము మేలవించుట గ
నుఁగొంటిరా? అంత యపారము నగాధము ననంతము ప్ర
శాంతము నిర్మలము నగు ప్రేమరాశితో నపారము నగాధ
ము ననంతము ప్రశాంతము నిర్మలము నగు ప్రేమరాశిస
మ్మేళనము విలోకించియున్నారా? ఎప్పుడైన నట్టి యగాధ
ము ననంతము నిర్మలము నగు రెండు ప్రేమాంబుధులు పర
స్పరసంఘాతముచే సంక్షోభము నొందదేని నాయపారసము
ద్రములందు గగనోత్తుంగ తరంగము లుప్పతిల్లుట వీక్షించి
తిరా? ఎప్పుడైన వియోగము తటస్థించినచో క్షీణపరిభం
జనము నేగి యనంతము లగు నంబరాంబుధు లఖండితముగాఁ
గలిసిపోవుట కంటిరా?

ఎచటఁ గనఁబడును! వివేకవిహీనులు మోహజ్వాలలచేఁ
గళవళ పడుచుందురు. ఇట్టి దుర్లభ మగుప్రేమరాశి దొరుచ
ట లభ్య మగును? ప్రపంచము నం దట్టి యపారము నగా
ధము ననంతము ప్రశాంతము నిర్మలము నగు ప్రేమాంబు
ధులు రెండు వెచ్చటనైన నెన్నఁడైన మేళన మొందుచుండు
నని కవులు వ్రాయుదురే. కాని యిట్టిది దుర్ఘటము!

ఇట్టి వొక్కనాఁటి కలిసినవి. పూర్వము పాటలీపుత్రనగరమున నొక్కనాఁటి యిట్టి హృదయములు కలిసికొన్నవి. ఒకానొక సాయంసమయమున గంగాతీరమున అశోకమహారాజుగారి ప్రమోదవనమున నిట్టిహృదయములు మేళవించినవి!

౨

ఒకనాఁటి దినమున, సాండవయనెడు దినమునాఁడు. ఇరువురు నిలుచుండి పూలచెండులు గ్రుచ్చుచుండిరి. ఇరుప్రక్కలనునుండు సుగంధపుష్పరాశి: మల్లిక మాలతి జాజి శేఫాలిక మొదలగు కుసుమములరాశి కుభయపార్శ్వముల నిలిచి వారు పుష్పమాలికలు గ్రుచ్చుచుండిరి. వారిసౌందర్యము ప్రసూనరాశియందును ప్రసూనరాశిసౌందర్యము కమనీయమగు వారి తనుచ్ఛాయలయందును ప్రతిఫలించుచున్నది. పండువెన్నెలవంటి పువ్వుల ప్రోవుపైఁ బడి యాదంపతుల లావణ్యకాంతము ది స్వచ్ఛమై స్వచ్ఛతరమై స్వచ్ఛతమమై యందుఁ గలిసిపోవుచున్నది; తరళదీప్తిపైఁ దరళదీప్తి దానిపైఁ దరళదీప్తి ప్రసరించి మిళితమై తరళతరము తరళతమము నగుచున్నది. ఉజ్జ్వలములు శ్యామలములు దీర్ఘములు నాకర్ణాంత విశ్రాంతములు నగు తరుణుని నేత్రము లొకసారి ప్రసవమాలమీఁదను వేఱొకసారి యువతివదనముమీఁదను వ్రాలుచున్నవి. అతని నయనము లొకప్పుడలసములు, వేఱొకప్పుడు చంచలములు; అలసము లయినను మధురములు,

చంచలము లయినను మధురములు, సామాన్యముగా నున్న
ను మధురములే! ఆతనిదృష్టి యలసము వలితము ముగ్ధము
స్నిగ్ధము నిష్పందము మందము; అలసమైనను మధురము;
వలితమై కుంచితమైనను మధురము; ముగ్ధమై మోహావ్యం
జకమైనను మధురము; స్నిగ్ధమై నిష్పందమై మందమై ధీర
మైనను మధురమే. ఆతని విశాలాక్షులలో నాథనీలము లగు
కనీనికలను జేసి యొక్కొకమాఱు విద్యుల్లతలు మెఱయు
చుండును. ఆతని ప్రతి దృక్పాతముకూడఁ బ్రణయినిపైఁ
గల యనురాగమును మమత్వమును వెల్లివిరియించు చుండు
ను. ఆతనిహృదయము ప్రదీభూతమై నయనమార్గమునఁబ
యలు వెడలి మాటిమాటికిని హృదయేశ్వరిని జలక సూచిం
చుచున్న ట్లుండును.

యువతి ముగ్ధ, సుందరి. ఆలోచిన విధముగా వంత ప్రసు
చ్చుచు నామె లోలోపల నేమో భావించుచున్నది. ప్రాణ
నాథునకుఁ దనపైఁ గల యపరిమేయము నత్యుత్తము నగు
ప్రేమాతిశయమును గుఱించి తలపోయుచుండ వచ్చును.
కానున్న మసృణములు కోమలములు నిర్మలములు నమూ
ల్యములునగు వండితములు నగు నామెకపోలములమీఁద
నమమనకుకు రక్తిమ గోచరించుచున్న దేల? ఒక్కొకసారి
యామెచిప్రియునివంకఁ జూచుచున్న దేల? ఆమెదృష్టి మిక్కి
లిచమత్కారమైనది. ఆమె చంచలసుందరివలెఁ జూచుట
లేదు; ఒకసారి చూడఁ దొడఁగెనేని దృష్టి మరల్పదు.

చూచునంతనే యామె విశాలోజ్జ్వలములగు నేత్రములను మేలవించి వీక్షించుచుండెను. అప్పు డామె యోష్ఠాగ్రతలో దనసయుగ పుటోష్ఠములందుఁ బ్రియనవనసుధాధారలను మన నాఁడు నోచుకొనుచున్న ట్లుండెను.

నాయు త్వరితాగతిని గంటలు గుర్తించుటను బట్టి మాయా వాఁడు కేశవ్ తొందరపడియున్నట్లు తోఁచుచున్నది. మాయా చూడఁ బుష్పహారి నగ మాయిపోయినది. తెలియఁజేయఁగలఁ దనచేత నున్న పుష్పమాలికలను యువతి కంఠమునను తన మునందునను కలకరించెను. యువతియుఁ దనకంఠమునందలి పుష్పమాలికలఁ దీనాతని కంఠమున కిడుచును నలంకరించెను. ఆనమస్కారము చేయునప్పు డాతఁ డామె ముఖక మున స్త్రీ ముఖమువంకఁ జూచెను. యువతి యాననముఁ జంద్రబింబ మనిపించెను. భూమిమీఁదనే చంద్రబింబ మున్న యుండె ననిపయస్థుఁడనుకొనెను. పరస్పరము చూచుకొని వారు ముగ్ధు లయిరి. ఎంత విలోకించు కొనుచున్నను వారికిఁ దనివితీర లేదు. వయస్థుఁడు మోము నంచుకొను చుండ యువతి తటాలున మొగము ద్రిప్పుకొని "ఆకాశ మువంకఁ జూచినారా! ఇఁక వేళ లేదు. గంటలు గుర్తిచ్చి శీఘ్రముగాఁ దీసికొనిపోవలయు" ననెను. అతఁడ తే కాని మ్మనిపలికి యామెను కౌగిలించుకొని బింబనిందకము కోమలము మసృణము రసమయ మగు నామె యధరమ్ము పై బింబనిందకమ్ము కోమలము మసృణము రసమయ మగు తన

యధరము నుంచి ముద్దాడెను. తరువాత నతఁ డామెను విడిచి దండలు గ్రుచ్చ నారంభించెను. యువతి యించుక యప్రతిభయై మరల దండలు గ్రుచ్చ సాగెను.

3

మాలలు కూర్చుచుండిరి. ఒకచేతిలో సూది దారము నింకొకచేతిలోఁ బుష్పములు. చకచక గ్రుచ్చుచు నేపుష్పముపై నేపుష్ప ముండవలెనో దేనితరువాత నేది యున్న నందముగ నుండునో యట్లే వారు కూర్చుచుండిరి. ఇట్లుపుష్ప దండలు గ్రుచ్చిరి. పూవులు మిగుల లేవు. ఒకటి సన్నజాజి పూదండ యింకొకటి స్థూలమైన మల్లికాదామము. మఱియొకటి సన్నని కుందకుసుమ మాలిక. ఒకదండలో రెండు రకముల పూవులు రెండవదానిలో మూఁడురకములపూవులు మూఁడవదానిలో నాలుగు రకముల పూవులు! ఎఱ్ఱపూలు నల్లపూలు పచ్చపూలు క్రమముగా మాలికలు కాసాగినవి. యువకుని శిరస్సున జాజిపూదండ యుండెను. కర్ణములనుండి వ్రేలాడు చిన్నిచిన్ని పూదండలలోని మొల్లసంపెంగపూలతావి పార్శ్వమున మెఱయుచుండెను. అతఁ డెన్నిసారులు చేతులు కదలించిన నన్నిసార్లు సంపెంగ లతని నాసికకుఁ బసి చల్లఁదన మిచ్చుచుండెను.

రమణీయవయవములందును బుష్పాభరణములే. పుష్పకంకణములు పుష్పహారము పుష్పగ్రైవేయము పుష్పాంగద

ములు పుష్పమకుటము! ఆమెకంఠమలు గ్రుచ్చుచుండ మా
లిక లన్నియు సుందరముగాఁ గదలుచుఁ దళతళలాడుచుం
డెను. పూవు లయిపోవుచున్నకొలఁది వారు ముందునకు
జరుగుచు దగ్గఱకుఁ జేరుచుండిరి. ఒక్కొక పుష్పహారము
సంసిద్ధము కాఁగనే వారు పరస్పర మలంకరించుకొని మా
చుకొనుచుండిరి. అన్యోన్యవీక్షణమున వారికి నూతనశోభ
కానవచ్చుచుండెను. క్రొత్తయలంకారములు ధరించినపు
డెల్ల నొకరి కొకరు క్రొత్తగాఁ గానఁబడుచుండిరి. సమస్త
పుష్పాభరణములు పూర్తి కాఁగానే కొంతసేపు కథలు చె
ప్పుకొన వలె నని వారనుకొనిరి. పుష్పాభరణములు పెట్టుకొని
యొక్కసారి మొత్తుకొని కూర్చుండి వృక్షములు వనములు సర
స్సులు ఆహారము నిద్ర మొదలగు భౌతికవిషయములను విస్మ
రించిస్వర్గముపై స్వర్గము దానిపై స్వర్గము దానిపై స్వర్గములో
నుండువానివలెఁ బ్రేమచేతను సుఖముచేతను మోహినీశక్తి
చేతను బారవశ్యము నంది మానవజీవనమున దుష్ప్రాప్య
మగు సుఖస్వప్నావస్థయందుండి వారు మృదుమధురాలా
పము లాడుచుండిరి. అతఁడు అశోకమహారాజునకుఁ బ్రియ
పుత్త్రుఁడు ప్రధానసేనాని యద్వితీయ విద్వాంసుఁడు ధర్మా
నురాగి యగు కుణాలుఁడు. ఆమె రమణీకులలలామ విదుషి
నిర్మల ప్రణయశాలిని యగు కాంచనమాల. వారు సంసి
ద్ధము చేయవలసిన పుష్పధనుస్సు కాని కుసుమశరములుకాని
యింకను సిద్ధముకాలేదు. కాంచనమాల మకుటమునందలి

పుష్పగుచ్ఛ మింకను సిద్ధము కాలేదు. పుష్పము లయిపో యినవి!

౪

సాయంకాల మయినది. సూర్యుడు రక్తకాంతి వహించెను. కాని యస్తమించలేదు. ఆందోళితగంగాతరంగములతో మందపవనము క్రీడించుచుండెను. పుష్పము లయిపోయినవి. సంధ్యాసమయమున కించుకపూర్వమే తూర్యములు మ్రోగినవి. అందఱును సంసిద్ధులై "లలితవిస్తరము" అభినయమునకుఁ బోవలెను. కాని యింతవఱకును వారు సంసిద్ధులుకాలేదు. పుష్పములుగూడ నయిపోయినవి. దండలు గుచ్చుటకే వనములోని విచ్చీవిచ్చని మొగ్గలుకూడఁ గోసిరి. ఇఁక నుద్యానములోఁ బూవులు లేవు. కుణాలుఁడు కాంచనమాలయు నలుదెసలఁ జూచుచుండిరి. అచటిభూతలము దూర్వామయమగు సమతలము. గడ్డిపూవులు సుధాధవళకాంతితోఁ దళతళలాడుచు నేలకు వంగుచుండెను. అశోక కింశుక వకుళ నాగ పున్నాగాదివృక్షములు వాయువుతోఁ గూడి నృత్యము చేయుచుండెను. దేవదారు ప్రముఖభూరుహములు స్వనితములు చేయుచుండెను. ఛాయాకాశమును ధరించిన గంగావక్షము ప్రేమభరమున విరాజిల్లుచుండెను. గంగాతరంగిణీ వక్షముపై నౌకాసమూహము పంక్తులు దీరి పిపీలికములవలెఁ బోవుచుండెను. నావికులు

మనసార సంగీతములు పాడుచుండిరి. సంగీతతరంగములు గంగాసమీరణముచే శీతలములై మృదులముగా వినవచ్చుచుండెను. కాంచన కుణాలు లీపదుత్కంఠ జెందియుండుటచే నాగానము వారి హృదయముల నాకర్షింపలేకుండెను. శీఘ్రగమనమున వారలు లతలను కుంజములను నికుంజములను బుష్పవృక్షాదులను వెదకుచుండిరి. పూవు లెచ్చటను లభింపలేదు. కాలము గడచిపోవుచున్నకొలఁదిని వారి యుత్కంఠ హెచ్చుచుండెను. తొందరకూడ వృద్ధియగుచుండెను. అప్పుడు వారు తమశరీరములందలి పుష్పహారములను దీసివైచి చంద్రకాంతశిలానిర్మిత మగు నచ్చటి వేదికపై నుంచిరి. కుణాలుఁడు తనపుష్పమాలికలను దక్షిణపార్శ్వమునను కాంచనమాల తనకుసుమభూషణములను వామపార్శ్వమునను నుంచిరి. తరువాత వారిరువురు నుత్తరాభిముఖులై పోయిరి. సమీపమున నున్న కృతకాద్రిపై వారిదృష్టులు వ్రాలినవి.

"పుష్పములు సంగ్రహించినవా రొక్కయుపవనములోని పుష్పములనే కోసినారు. దురారోహమని కాఁబోలు నీకృత్రిమ శైలాగ్రమందలి వృక్షములనుండి పూవులుకోసినారు కారు. ఈకొండపైకిఁ బోయినయెడల నిశ్చయముగా మనకుఁ బూవులు దొరకును" అని కాంచనమాల పలుకగా కుణాలుఁ డందులకు సమ్మతించెను. అంత నిరువురు శైలారోహణ మారంభించిరి.

కృతకాద్రి నెక్కుటకు రెండుమార్గములున్నవి. వానిలో నొకమార్గము పొదవృసను వస మున్నది. అందుఁ బచ్చికతీఁగెలు పూలచెట్లు మొదలగునవి దట్టముగాఁ బెరిగియున్నవి. సాంద్రముగాఁ బెరిగియుండుటచే నడుమగునదే మున్నదియుఁ గానవచ్చుట లేదు. ఈత్రోవ కొంచెమేటవాలు. కాలయాపనము కాకుండ నీబాటవెంటఁ బై కెక్కవచ్చును. వారిరువురు నీత్రోవవెంట బయలుదేఱిరి. ఒకటిరెండు పదములు వేసిరో లేదో పాముబుసవలె ధ్వని వినవచ్చెను. వారు త్వరితముగాఁ బోవుచుండుటచే లక్ష్యము చేయలేదు. కొంతదూరము పోయిచూడ నొకచోట నాకులు త్రెంపి యున్నవి. ఇంకొకచోట వృక్షశాఖ విఱిగియుండెను. మఱియొకచోటఁ బుష్పములు రాలియుండెను. కాంచనమాల యవి చూచి "ఇంతనఱకుమాత్ర మెవరో వచ్చినట్లున్నది" అని పలికెను. మఱికొంతదూర మేగి చూడ నొకానొకచెట్టు కొమ్మ కాకులే లేవు. "ఆ వచ్చినవా రిచట నిలుచుండిగాని కూర్చుండిగాని యుండవలెను" అని కుణాలుఁ డనెను.

మఱికొంతదూరము పోయిచూడ కాంచనమాల మాటలు యథార్థము లయ్యెను. పుష్పములు కోయవచ్చిన వాడు శైలోపరిభాగమునకు రాలేదు. కుసుమము లచ్చట విచ్చల విడిగాఁ బుష్పించి దిగంతములకు సౌరభమును వెదఁజల్లుచుండెను. కాంచనమాల తనచీరెచెఱఁగులోనికిని కుణాలుఁడు తన యుత్తరీయాంచలములోనికిని బూవులను జకచక

గోసి వేసికొనుచుండిరి. పుష్పాపచయము కష్టముగా లేదు. పట్టుకొని తుంప నక్కఱయే లేక ముట్టుకొన్న మాత్రమున నవి రాలుచుండెను. అపూవు ఈపూవు అపూవు అని వారు జరిగి జరిగి పోవుచుండిరి. కొండనెత్తము మీఁదను బార్శ్వమునను లోయలోను వారు పూవులు కోయుచుండిరి.

పుష్పాపచయము చేయుచుఁ గ్రమముగా వారు మరలఁ బర్వతశిఖర మెక్కిరి. కాంచనమాల యప్సరసవలెను కుణాలుఁడు దేవతవలెను నుండిరి. విశ్రాంతికొఱకు చలువరాతి మంటప మొకటి యచటఁ గలదు. అందుఁ గూర్చుండి పుష్పము లన్నియు బయటికిఁ దీసి వారు ఘనస్థానములు సిద్ధముచేయ నారంభించిరి. గగన మండలమునుండి సుధాకరబింబము దుగ్ధఫేన ధవళకాంతులతో వసుధాతలమును పరుపుచుండెను. శైత్యమాంద్య సౌరభ్యములు గల మలయసమీరము దక్షిణ దిశనుండి గంగమీఁదుగా నేతెంచి వారికి శీతల భావము కలిగించు చుండెను.

"కాంచనా, నే నీశైలాగ్రమునకు వచ్చినప్పుడెల్ల నాకా నాఁటి సంగతులు జ్ఞప్తికి వచ్చుచుండు" నని కుణాలుఁడు పలికెను.

"మీ రిఁక న న్నిచటికిఁ దీసికొని రాకుండుట కుపాయ మాలోచించుచున్నాను."

"కాంచనా, యిచటికి వచ్చినచో నానాఁటిసంగతులు జ్ఞప్తికి వచ్చును. అనాఁడు గయాశీర్షపర్వతమునకు వేఁటకు

బోయి——"

"చెవిలో నేను వ్రేళ్లు పెట్టుకొన్నాను. ఆసంగతి వినను!"

"ఎందుచేత కాంచనా? ఏనాఁడు నే నీధర్మము నవలంబించితినో యేనాఁడు నాకుఁ బ్రాణము లభించినదో యేనాఁడు నాకు నీతోఁ బ్రిథమసమాగమము కలిగినదో యానాఁటి సంగతులు వినుటకు నీ కిష్టము లే దేమి కాంచనా?"

మృణాలకోమల మగు తనబాహుయుగళమును కుణాలుని కంఠమునకుఁ బెనవైచి యామె విహ్వాలభావముతో నిట్లనెను: "నాకంఠరత్నమా, మీకు సంతోషము కలుగుదానిని వినుట నా కిష్టము కాదా? అయితే——"

"అయితే నీపరిశంస యున్నదాని వినుట కిష్టములేదు."

"కాదు."

"మఱి యేమి?"

"నన్నుగుఱించి మీ రేల చెప్పవలెను? మీసంగతిమీరు చెప్పుఁడు!"

"అదిమాత్రమే మగును కాంచనా? ఆనాఁటినుండి నాకథ చెప్పిన నది నీకథకూడ నగును. నీకథ చెప్పిన నాకథ——"

"అయినఁ గానిండు. మీరు చెప్పునది చెప్పుఁడు. తరువాత నాకథ నేను జెప్పెదను."

"బాగున్నది. రమారమి యెనిమిదిసంవత్సరములక్రిందట ఫాల్గునపూర్ణిమనాఁడు విహారమునకు బయలుదేఱి గ

యాశీర్షపర్వతాగ్ర మెక్కితిని. అచ్చట నొకచో వ్యాఘ్రసంపత్తులు కానఁబడ గుల్మముపైనుండియే వాని నెదుర్కొంటిని. కొంచెము పోరుజరిగిన తరువాత వ్యాఘ్రనఖ ప్రహారములచే స్మృతి తప్పి పడిపోతిని. తరువాత వృద్ధఋషియానతిచొప్పునఁ బులులు మచ్చిక పడిన కుక్కలవలె నాయనకంపితము కౌఁగిలించినవి. అప్సరసల రూపలావణ్యముల నధఃకరించు కన్యను నాయుపచారమునకై యాయన నియోగించెను. ఆ దేవకన్య నన్ను మెల్లమెల్లగా గొప్పవటవృక్షము చెంతకుఁ గొనిపోయి తత్పాదమునఁ బరుండఁ బెట్టెను. వటవృక్షముక్రింద రూపవతియును, రక్తాంబరధారి శ్వేతశ్మశ్రువగు వృద్ధఋషియుఁ గాన్పించిరి. వ్యాఘ్రము లాయనకిరుపార్శ్వములఁ బరుండి యున్నవి. ఆయన యేదో స్తవము చేయుచుండెను. దానిచే నామనస్సు ద్రవింపఁజొచ్చెను. నేను వారి గృహమున నుంటిని. ఆహా! ఆసుఖదినములు మరల వచ్చునా? తరువాత నొకనాఁడు గయాశీర్షమం దున్నయాపర్వతమున కా దేవకన్య వెంట నరిగితిని. ఆమె యేమేమో మాటలాడినది. దినమెల్ల విహరించుచుంటిని. ఋషిప్రవర్తనమందును దేవకన్యా ప్రలోచనమందును నామనఃపరిభ్రమణమునందును నైహికముకన్న భిన్నమైన పదార్థము కలదని మొదటనే తెలిసికొనఁ గలిగితిని. క్రమముగా ఋషిదయవలన నాకు "త్రిరత్నములు" లభించినవి. తరువాతఁ జతుర్థరత్న మగునీవు లభించితివి!"

"ఇం కెంత చెప్పెదరు?"

"మీమ్మొటఁ బూర్వమతమును బరిత్యజించుటవలన నాయనగారు నన్ను దేశమునుండి వెడలనడిచిరి. ఎన్నో యవస్థలకు లోనై యెన్నో ప్రదేశములు తిరిగితిని. ఇంటిలోఁగాని యడవిలోఁగాని వృక్షతలమునఁగాని శయ్యపైఁగాని సర్వావస్థలయందును నీవు సమీపముగానే యుంటివి!"

"ఎవరిగుణ మది? మీఁదా నాదా?"

"నేఁడీకొండ యెక్కగానే వెనుకటి వృత్తాంత మంతయు జ్ఞప్తికి వచ్చినది. ఏనాఁడు నాకు త్రిరత్నములు ప్రాప్తించినవో యేనాఁడు నీవు నాకు లభించితివో యేనాఁ డైహిక పారలౌకిక సుఖములకు బీజము నాఁటుకొనెనో యానాఁటి వృత్తాంతము నేఁడు జ్ఞప్తికి వచ్చుచున్నది. అది యంతయు నొకవిధము, ఇది యంతయు నింకొకవిధము. కాంచనా, యిందు నీ కేది బాగున్నదో చెప్పు, చూతము!"

"ప్రతిదిన మరణ్యములోను బర్వతముమీఁదను మిమ్ముఁ జూచుచుంటిని. మీరు పులివేటకుఁ బోయి పులిపీఁపున బల్లెము గ్రుచ్చి యొక పర్వతశిఖరమునుండి యింకొక పర్వతశిఖరము మీఁదికిఁ బోవుచుండునపుడు మిమ్ముఁ జూచితిని. అప్పటినుండి నాయనగారితోపాటు సద్ధర్మ మనుష్ఠించుటయందు వేఱయిపోతిని. ఆనాఁటివృత్తాంతము జ్ఞప్తికి వచ్చినను నా కానందము కలుగును. మీ రపుడు నాయం దెంతదయతో నుండెడివారో చెప్పలేను. కాని బోధివృక్షము చెంతకు

వచ్చినప్పుడు నాతో నాకట రెండుగడియలు మాటలాడనిది యే వెడలువాడు కాదు. అదియంతయు నొక్క దినమువలె నున్నది? ఏనాటి వృత్తాంతము చెప్పుటకు మీ కింత యుత్సాహముగా నున్నదో యానాడు మాతండ్రిగారు వచ్చి పులిగోటి దెబ్బలతో బాధపడుచున్న మిమ్ము నుద్ధరించినారు. ఆనాటి మీవ్యథ చూడ నా కెంతసంతాపము కలిగినదో యెట్లు చెప్ప నగును! అటుపిమ్మట మిమ్ము బోధివృక్షము చెంతకుఁ దీసికొనిపోతిని. అప్పుడు నాకెంతో యానందము కలిగినది, కాని బోధిద్రుమ మాకస్మికముగా ముకుళించుకొని పోయినది. అదివఱకది యెంత పరిశుద్ధమై శోభావంతమై యుండెడిదో నాకు బాగుగాఁ దెలియును. నాఁడది యట్లు లేదు. నాయనగారు దానిని జూచి "ఈరాకుమారునివలన సద్ధర్మము వృద్ధియగును." అని వచించిరి. అంతకు ముందుగనే మీయెడ నా కనురాగము కలిగినది. మీరు నాయెడ విముఖులుగా లేరు. కేవల భోగమే పర్యవసానముగాఁ గల ప్రణయమునందు నా కంత ప్రవృత్తి లేదు. చిరకాలమునుండి నే నభిలషించు సద్ధర్మము మీవలన వృద్ధి నొందు నని యెప్పుడు వింటినో, "అహింసా పరమో ధర్మః" అను వాక్యము మీరు ప్రచారము చేయుదు రనియు సర్వప్రాణులయెడ సమభావము వృద్ధిచేయుదురనియుఁ దెలిసినపుడు మీతోఁ గూడియుండవలె (వివాహమై) ననుకోరిక యతిశయించినది. నాయనగారి యనుగ్రహము వలనను త్రి

రత్నముల ప్రసాదమువలనను మీదయకుఁ బాత్రమునైతిని. మీతోడిసహవాసము నా కెన్నఁడు కష్టముగా లేదు. ఇప్పుడు సద్ధర్మప్రచరము హెచ్చినకొలఁది నాయానంద మతిశయించుచున్నది. కాని సత్యము చెప్పుచున్నాను. సద్ధర్మాభివృద్ధిని నిరుపమాన మగుమీప్రేమ యందును నిమగ్ననై యన్యచింత లేకుంటిని !"

ఈరీతిగాఁ బ్రణయపూర్ణము హృదయోన్మాదకరము నను వాక్యలహరిని సృజించుకొని వారు పరస్పరము ముగ్ధలయిరి. పర్వతాగ్రమున మందానిలము వీచుచుండెను. నిర్మలాకాశమున నక్షత్రములు ప్రకాశించుచుండెను. అగాధము నపారము ననంతము ప్రశాంతము నగు వారి ప్రణయమునకు జగత్తు ప్రతిబింబమువలె నుండెను. నిర్ఝరధ్వానము వారి ప్రణయ పూర్ణస్వరలహరికిఁ బ్రతిధ్వనించు చున్నట్లుండెను.

౫

వా రిరువురు సంభాషించుచుండిరి. సంభాషణములో వారి హృదయము లున్మత్తము లగుచుండెను. వారి మానసములు మర్త్యలోకము వీడి స్వర్లోకముఁ జొచ్చి యందు భువర్లోక మహర్లోక జనలోక తపోలోకము లాదిగాగల పదునేడు స్వర్గముల నతిక్రమించి సూక్ష్మము నవ్యక్తము సుధామయము ప్రేమమయము నగుదివ్యధామమున కెగిరిపోవుచుండెను.

సామాన్యలోకము వారి స్మృతిపథమునుండి జాఱిపోయినది. శరీరము లున్నవో లేవో జ్ఞాన మున్నదో లేదో వారికిఁ దెలియదు. మూడుపదార్థములుమాత్రమున్నవి: సుధామయము సుఖమయము ప్రేమమయము ననిర్వాచ్యము నగు స్వరలహరియుఁ దత్తుల్యము లయిన యాత్మలును గలవు.

అట్టిసమయమున దూరమునుండి వాద్యము మ్రోగెను. అది యభినయారంభ సూచకధ్వని. అపుడు వారి కస్తిత్వ జ్ఞానము కలిగినది. అప్పుడు వారు మందానిలస్పర్శను చంద్రకాంత శిలాస్పర్శను ననుభవించిరి. అకస్మికముగా స్వర్గమునుండి భ్రంశ మొందినట్లు శోచించెనో మఱేమోకాని కాంచనమాల మిగుల నుత్కంఠిత యయ్యెను. తోడనే యామె మన స్సేమో యయ్యెను. తనవస్తు వేదో పోఁగొట్టుకొన్నట్లును దనకాంక్ష యేదియో పూర్తి కానట్లును నామెకుఁ దోఁచెను. ఇంతవఱకుఁ దాను నిమగ్నయై యున్నసుఖ మింత నిహజన్మమునఁ గలుగదని స్ఫురించెను. తా నే యే యాశలతో నింతవఱ కువిళ్లూరుచుండెనో యవియన్నియు స్వప్నసదృశములనియు నెన్నటికిని నెఱవేఱ వనియు ననిపించెను. అంతట నామె భర్తను జూచి "నామన స్సుద్విగ్న మయినదేలనో, చెప్పుఁ" డనెను.

"మన మాత్మచింతలయందు మునిఁగి యుంటిమి. ఉన్నట్లుండి నూతనచింత కలుగుటచే నామనసుకూడ నుద్విగ్న మయినది."

"కాదు. ఇది యట్టి యుద్వేగము కాదు. త్వరలో నేదో యాపద రానున్న దని తోఁచుచున్నది."

ఇట్లు సంభాషించుచు వా రిరువురు శైలశిఖరమునుండి సత్వరముగాఁ గ్రిందికి దిగి వచ్చిరి.

---

## పరిచ్ఛేదము ౨

### ౧

కుణాలుఁడు దిగి వచ్చి చూడ కాంచనమాల యుద్విగ్న యగుటకుఁ గారణము తెలిసినది. కుణాలుని పుష్పాభరణము లున్నవి, గాని కాంచనమాలవి లేవు. ఎవరు తీసికొని పోయినారు? రాత్రివేళ నచటి కెవ్వరు వత్తు రనుకొనుటకును వీలు లేదు. వెదకుటకు వేళ లేదు. తోడనే యభినయ మారంభ మగును. లలితవిస్తరములోని తృతీయాధ్యాయము ప్రారంభము కాగానే కాంచనకుణాలులు రతిమన్మథ వేషములు ధరించి బుద్ధదేవుని ధ్యానభంగమునకుఁ బోవలెను. ఇఱువురు మిక్కిలి వ్యాకుల పడిరి. ఏమి చేయవలెను? కాంచనమాల సంక్షోభముచే మూర్ఛ నొందున ట్లుండెను. ఆమె నోదార్పవలె ననుకొన్నను కుణాలునకు సాధ్యము కాలేదు. మరలఁ దూర్యధ్వని యయ్యెను. ప్రస్తావన ముగిసినది. పాత్రప్రవేశ మవసరము. "కాంచనా, నీవీలాగుననే రమ్ము. ఆభర

ణములు లేకున్నను నీవు రతీదేవి సౌందర్యము నధఃకరింపఁ గల" నని కునాలుఁడు పలికెను.

కాంచనమాల ప్రత్యుత్తర మీయ లేదు. ఆమె యుత్కంఠవృద్ధి యయ్యెను. మనోవ్యథచే నామె కునాలుని మాటలకు బదులు పలుక లేదు. అతనిపల్కు లన్నియు నామెకు వినఁబడెనో లేదో.

"మారపత్నీ పాత్రము నాటకములో లేనే లేదు. నీకు మోదము గూర్చుటకై రతీదేవి పాత్రమును బ్రవేశ పెట్టితిని. అభినయములోనికి నీవు రాకున్నను నేను వెళ్ళవలెను. వెళ్ళనియెడల నాటకమునకు విఘాతము కలుగును" అనుచు కునాలుఁడు వేగముగా నభినయశాలకుఁ బోయెను.

"నాయమునగళ్లఁ మింతటితో విరమించునా?" యని కాంచనమాల తలపోసెను.

౨

కునాలుఁ డరుగునప్పటి కంతయు సిద్ధముగా నుండెను. నేపథ్యగృహమున నందఱు నతనికోసము వ్యగ్రభావముతో నెదురు చూచుచుండిరి. అతనిని వెదకుటకు మనుష్యులను కూడఁ బంపిరి. ఇంతలో నతఁడు నేపథ్యశాలలోని కరిగి వృథావాక్యవ్యయము చేయక రంగస్థలమునఁ బ్రవేశించి నా సేనాపతులు, నాపుత్రికలు నెచట నున్నా" రనెను.

అపుడు రతీదేవిపాత్రము ప్రవేశించి "నాథా! అందఱు

సిద్ధముగా నున్నారు. వసంతుఁడు కోకిల కుహూరవములు ఆమ్రముకుళములు దక్షిణానిలము మొదలగు సైన్యమంత యు సిద్ధముగా నున్నది” అని పలికెను.

కుణాలుఁడు మిక్కిలి వ్యాకుల మొందెను. ఈరతీదేవి పాత్రము ధరించినవా రెవరు? ముఖము చూచుటకు వీలు లేదు—ముసుఁగిడి యున్నది. కంఠస్వరమును బట్టి చూడ కాంచనమాల కాదు. కాని యెంత యాశ్చర్యము! కాంచనమాల కూర్చిన పుష్పాలంకారముల నీమె మొదలి కలంకరించుకొన్నది. ఈయలంకారముల నీమె యెచటినుండి గ్రహించినది? కుణాలుఁ డీసంగతు లాలోచించుచు నన్యమనస్కుఁ డయ్యెను. రతీదేవివేషము ధరించిన రసికురాలు ప్రత్యుత్పన్నమతి. అప్పు డామె యిట్లనెను: “నాథా, ఇంత చింతించు టెందులకు? కృతయుగమున విశ్వామిత్రాది మహర్షుల తపోభంగము చేసినమీరు కలియుగమున సామాన్య రాజకుమారుని తపోభంగము చేయలేరా?”

“ఇది బహుకళలప్రదేశము!” అని కుణాలుఁడు భయవిస్మయసూచక కంఠస్వరముతో ననెను. అతని భావప్రదర్శన మతిమధురముగా నుండెను. “బాగుగా నున్నాఁడు, బాగుగా నున్నాఁడు!” అని సభ్యులెల్లరు నతని నభినందించిరి. కుణాలునివిస్మయజడిమ కొంచెము తగ్గినది. అటుపిమ్మట నతఁడు సందర్భానుసారముగా నభినయింపసాగెను. రతీవేషధారిణి హావభావములచేఁ దనమనస్సును మఱపింప

యత్నించుచున్న ట్లతఁడు తెలిసికొనెను. ఆమె యెవరో గ్రహింపవలె నని యతనికుతూహలము మెండగు చుండెను. ఈవిధముగాఁ గౌతూహలవిస్మయములు పెనగొన్న యతని యభినయము నేఁ డితరసమయములకన్న నెక్కువ హృద్యరంజకముగా నుండెను. సభలోనివా రెల్లరు నతని యభినయ కౌశలమును బ్రశంసించిరి. అభినయమున నేర్పుగల కుమారుఁడు నేఁడు పాండిత్యముచేఁ గాక తత్స్వభావముచే జనరంజనము చేసినాఁడు. అతనియభినయ మేల కమనీయముగా నుండెనో సభ్యులకుఁ దెలియదు; వా రేల ప్రశంసించుచున్నారో యతనికిఁ దెలియదు!

ఈరమణి యెవరు? ఈమె కాంచనమాల పుష్పదామములను హరించినదా? నిజముగా నీమె హరించినది! కాకున్న కుమారుఁడు స్వహస్తములతో గుచ్చినవి దేవదుర్లభములయినవియు నగుకుసుమాభరణము లీమె కెక్కడ లభించును? ఈవేషధారిణి కిరీటమునకుఁ గుచ్చు లేదు. కుచ్చ కూర్చుటకుఁ గావలసిన పూవుల కొఱకే కొండయెక్కి యమాయకురా లగు కాంచనమాల నేఁడు మనస్తాపము నొందవలసి వచ్చెను. ఈమె యెవరో? పట్టుపడుదు నన్నభయము కూడ లేదు. పైగా నెవరిపుష్పాలంకారములు హరించినదో వారి యెదుటనే వానితోఁ దొంగకు బెదురు లేకుండ నిర్దోషురాలివలె మాటలాడుచున్నది! ఎంత సాహసము! ఈమె సామాన్యురాలుకాదు. దొంగిలించినవస్తువులు ధరిం

చి రాజసభ కేలవచ్చినదో? ఈమెవైఖరి చూడ ననుమా
నము కలుగు చున్నది.

ఈమె జరిగి కుణాలునిచెంతకు వచ్చి నిలుచుచున్నది. పలుకునపు డెల్లఁ గంఠస్వరము చలించుటచే నీమెభావభంగి తెలియుట లేదా? ఎంత బాగున్నది! మంచియుపాయము! కుణాలుఁడు తప్పఁ బ్రేక్షకు లందఱు నీమె కాంచనమాల యనియే తలఁచుచున్నారు. పాపము? కాంచనమాల హతాశయై యభినయము చూచుటకైన రాలేదు. ఈబుద్ధి మంతురాలు రతీపాత్రమును కాంచనమాలా పాత్రము నొక్కసారిగా ధరించి యభినయించుచున్నది.

మొట్టమొదట కుణాలుఁ డనుమానించి యన్యమనస్కుఁ డయ్యెను. తరువాత నతఁడు సందర్భానుసారముగా నభిన యింపసాగెను. ఈదుర్మార్గురాలు వెంటనే యేలబయటికిఁ బోవదని సూచించున ట్లామెపై దృష్టినిగిడ్చెను. కుణాలుఁ డు మాటిమాటికిఁ దనవంకఁ జూచుచుండుటచే మృగము వలలోఁ బడినదని యామెతలఁచెను. అప్పు డామె రతీదేవి చేయవలసినపనులు చేయసాగెను. అశోకుని దీక్షాగురువు బౌద్ధధర్మమునకు మూలభిత్తియు నగు శ్రీ ఉపగుప్తుఁడు బుద్ధవేషముధరించి కనులు మూసికొని యెదుట బోధిద్రు మముక్రింద ధ్యానము చేయుచుండెను. ప్రశాంతమూర్తి స్థూలకాయుఁడు ముండితశిరస్కుఁడు రక్తవర్ణకౌపీనమాత్ర పరిధానుఁడు నగు ఉపగుప్తుఁడు నిష్కంపముగాఁ గూర్చుం

డియుండెను. అతనిని బ్రలోభపెట్టుటకే రతిమన్మథులు వసంతుఁడు మొదలగు సేనలను మారపుత్రికాదులను వెంటఁగొని వచ్చిరి. మన్మథపత్ని నృత్యము చేయసాగెను.

అకస్మికముగా సమస్తము నిశ్శబ్దమైనది. ఒకవైపున రాజపరివారము నమమ అశోకమహారాజు నింకొకవైపున సామంతప్రభువులు రాజమిత్రులు నమమ మంత్రులు ప్రాడ్వివాకులు మొదలగువారు కూర్చుండియుండిరి. ప్రక్కన స్త్రీలు నిశ్శబ్దముగా నుండిరి. అందఱు నేకాగ్రచిత్తముతో బుద్ధదేవునివంకఁ జూచుచుండిరి. అర్హత్శ్రేష్ఠుఁడగు ఉపగుప్తుఁడు ధ్యానభంగము కాగా మాటలాడుచుండెను. మారపుత్రిక లతనిని లోభపెట్టుచుండిరి. వారి కతఁడు ప్రత్యుత్తరమిచ్చుచుండెను. ఏమి యాగంభీరభావము! ఏమి యాగంభీరస్వరము! దేవాసుర యక్షరాక్షస కిన్నరులకు సద్ధర్మవ్యాఖ్యానము చేయు కంఠస్వరమున ఉపగుప్తుఁడు మన్మథపుత్రికలతో నిట్లనెను. "మీ రెల్లఱు నాకు నిర్వాణమార్గము చూపఁగలరేనిఁ జూపుఁడు. మీభోగాశలకు నామనస్సు లోనుగాదు. మీరు వెడలి పొండు! అసంఖ్యాకు లగుప్రాణులు జరాదుఃఖాదులచే నలువంకల మరణించుచున్నారు. చూచుచు నే నాదుఃఖముల కెట్లు పాలు కాఁగలను? ప్రాణత్యాగ మయినను జేసి యసంఖ్యాకులగు నిజీవులకు మోక్షోపాయము చూపెదను. నన్ను మీరు భ్రమపెట్టఁ దలఁచుకొన్నారా?"

ప్రేక్షకు లెల్లరు స్తంభీభూతులై తా మువాసించు దేవ తనోటినుండి వచనామృతము నాస్వాదించి తమజీవనములు ధన్య మయిన ట్లెంచిరి. కుణాలుని నేత్రము లానంద బాష్ప పూరితము లయ్యెను.

చోరుని మానసము వంచనముతోడనే యుండెను. ఆ రమణి కుణాలుని వెనువెంటనే చనుచు నభినయించుచుండెను. ఉపగుప్తుని యుపన్యాసమునకు సభాస్తారు లెల్లరు సమ్ముగ్ధు లయిరి. ఆమె మాత్ర మాతని మాటలు చెవిఁ బెట్టక కుణాలునితో కామోద్దీపక మగు మాట లేవియో యనుచుండెను. కాని ధర్మబుద్ధి యగు కుణాలుఁడు ఉపగుప్తుని యుపన్యాసమునకు ముగ్ధుఁడై కన్నులవెంట నానంద బాష్పములు రాల్చుచుండెను.

ఆమెప్రవర్తన మంతకంతకు కుణాలునకు దుస్సహాము కాఁజొచ్చెను. అతఁడు తొలఁగి పోయి ఉపగుప్తునకు దూరముగా నిలుచుండెను. ఇంతలో ఉపగుప్తుఁడు మారప్రతిక్రికల ప్రలోభము నతిక్రమించి మరల ధ్యానమగ్నుఁ డయ్యెను. వేషధారులు రంగస్థలము విడిచి యెవరి తావులకు వారు పోయిరి. బయటికి వచ్చి కుణాలుఁడు రతీపాత్రధారిణిని వెదకెను. ఆమె యతనికిఁ గనఁబడలేదు. అంత నతఁడు కాంచనమాల నోదార్చుటకును నీయద్భుతవిషయమును గ్రహించుటకును త్వరితముగా కాంచనపురాభిముఖుఁడై పోయెను. నాటకాంతమున దేవదంపతుల వేషము వేసికొని అశోకమ

హారాజు నాశీర్వదించుటకై మరల రావలసియుండెను. ఈ సారి నిరాభరణ యగు కాంచనమాలను వెంటఁ గొనిపో వలెనని యతఁడు స్థిరపఱచుకొనెను.

3

త్వరితముగాఁ బోవుచు నతఁ డిట్లనుకొనెను: "ఇంతవఱకు కాంచన యెంత మనస్తాపము నొందినదో కదా! పాప మామె యభినయమునఁ బ్రోగ్రాసు నుత్సాహముతో నుండె ను. ఏ మొగము పెట్టుకొని యామెను జూచెదను! ప్రియ శయ్యమంచముపైఁ బండుకొని యుండి నాకొఱకా మె యెదు రుచూచుచుండును; కాకున్న గృహకృత్యములందు నిమగ్న యై యుండును. అట్లును గాకున్న గవాక్షముచెంత నిలు చుండి త్రోవవెంటఁ జూచుచుండనచ్చును. అప్రియమూ ర్తి జ్యోత్స్నవగాహము చేయుచు వెన్నెలలోఁ గలిసి యుండును!"

ఇట్లు తలపోయుచు నతఁడు మిక్కిలి త్వరితముగా నడ చిపోవుచుండెను. అట్టియెడ రాజసౌధమునుండి యొకానొక పరిచారిక యెదుపడి "మీ పుష్పాలంకారములను హరిం చినవారిని జూడ నెంచెదరా?" యనెను.

"అవును. చూచెదను."

"అట్లయిన నా నికుంజములోనికిఁ బొండు."

"ఒంటిగాఁ బొదరింటిలో నున్న స్త్రీ చెంతకుఁ బోవుట

యుచితమా? కాని పుష్పమాలికను హరించిన దెవరు? హరించుటలో నామెయభిప్రాయ మేమో?" యనుకొని యతఁడు తద్విషయములను దెలిసికొని కాంచనమాలకుఁ దెలుపవచ్చు ననుకొనెను. ఆయాశయే యతని యుత్సాహమునకుఁ గారణము. కొంచె మాలోచించి యాతఁ డాపొదరింటిలోని కేగుటకు నిశ్చయించుకొనెను.

## ౪

ఆమె యేమార్గమున వచ్చినదో తెలియదు. వచ్చి యామె పొదరింటఁ బ్రవేశించినది. లతాకుంజము నానావిధపరిమళద్రవ్యములతోడను వివిధవిలాస సామగ్రులతోడను నిండి యుండెను. ఒకచోట సుగంధ జలము మఱియొకచోట స్వాదుజలము వేఱొకచోట రుచ్యములగు భోజనపదార్థములును విరాజిల్లుచుండెను.

"ఎన్నిరోజులనుండియో కుమారునిఁ గన్నులారఁ జూడవలె నని యభిలాష. అతఁడు మహారాజుసౌధమున నాకంటఁ బడిననాఁటనుండియు రాజపరివారమున నతఁడుతప్ప నాకు వేఱుగతి లేదని తెలిసినది. అతనిని జూడ వలె నని యెన్ని ప్రయత్నములు చేసినను చూచుటకు వీలు కాలేదు. ఎన్ని దినములు సంజ్ఞలు చేసి పరిజనులచేత కబురు పంపినను బదులు వచ్చినదికాదు. నేఁ డతఁడు కొండపై నుండఁ గనివి తీరఁజూచితిని! అతఁడు మరలివచ్చుసమయమునఁ బూలదం

డలు పొంగిలించుట మే లయ్యెను! రంగస్థలమున నే నెవ్వ
రో యెవ్వరును గుర్తింప లేదు. నాజీవనసర్వస్వము నతనికి
మనసార నర్పించితిని. అతనిని నాథాయని సంబోధించితిని.
కొన్నిమాటలు పలికితిని, కొన్నికటాక్షములు ప్రసాదించితి
ని. కుణాలుఁడును గొంచెము చలించినట్లు తోఁచుచున్నది.
చలించుట లేదా? ఇంకను సందేహమా? మాటిమాటికిని
జెంతకు వచ్చి నన్నుఁ జూచినాఁడు? ఏల చలింపకుండును?
ఏ దెట్లయినను నేఁటిసుదినము! నే ననుకొన్నది నెఱవేఱిన
ది. చూచెదను. మనసారఁ జూచెదను! పట్టుకొంటిని పట్టు
కొంటిని! రంగస్థలమున నతనిచెంత నతనిభార్యవేషము వేసి
కొని నిలుచుండుమని కాఁబోలు విధాత యీపుష్పాలంకా
రములు నామార్గమునఁ ద్రోసెను! తరువాత రంగమునఁ
గాంచినదానినిబట్టి విధాత దయార్ద్రహృదయుఁ డనితోఁచు
చున్నది. ఏమి కన్నుల పండువు! అట్టి నేత్రములు నే నెచ్చ
టను జూచియుండ లేదు. అబ్బా! ప్రాణములు పోవుచున్న
వి! అతని కటాక్షపాతముచే నాహృదయము బలవంతముగా
నాకృష్ట మయినది. ఆకన్నులే నన్నింత మోహపెట్టినవి;
ఆకన్నులే నాకీకళంకము దెచ్చిపెట్టినవి. కళంకము మాత్ర
మే మున్నది? ఈసంగతి యెవ్వరును గ్రహింపలేదు. ఒకవేళ
నెవరి కయినను దెలిసినను వృద్ధరసికుఁ డెన్నటికిని విశ్వసిం
పఁడు! లోకులుమాత్రము రొద చేయుదురు? కాని యీక్రొ
త్తవల పన్నికూర్చుంటిని. ఇంతవఱకు దీనివలన నేమియుఁ

గాలేదు."

ఇట్లు తలపోయుచు నాయువతి యాకులపాటుతోఁ గొంత సేపు వెలుపలఁ జూచుచు నిలుచుండెను. అప్పటికిని కుణాలుఁ డటునిటు నాలోచించుచుండెను. పిమ్మట నతఁడు వెడలిపోవ నిశ్చయించుకొన్నప్పుడు లతాకుంజములో నతని సవతితల్లి యగు తిష్యరక్షా దేవి యావిషయముగాఁ జింతాకులితయై యున్నది.

౫

క్రమముగా కుణాలుఁడు దగ్గఱకు వచ్చుచున్న కొలఁదిని తిష్యరక్షా దేవి సంతోషముతో నుప్పొంగి పోవుచుండెను. ఆమె తలుపుచాటున దాఁగియుండి యతని భంగిమమును బరికించుచుండెను. కుణాలుఁడు పొదరింటఁ బ్రవేశించి యచట నెవ్వరిని గానక తికమకపడుచుండ తిష్యరక్షా దేవి నవ్వుచు బయటికి వచ్చి "ఏమి, రాజకుమారా! ఆలోచించు చుంటివా;" యనెను. అప్పటి కామె యభినయ నేపథ్యము విడువలేదు. కుణాలుఁ డిట్లనెను: "అవును. పూలదొంగా!—"

"అట్లయిన నీనిర్జనప్రదేశమున నింతప్రొద్దు పోయినతరువాత దొంగచెంతకు రాఁదగునా?"

ఇంచుక గంభీరమైనస్వరముతో కుణాలుఁ డిట్లనెను:" కాంచనమాల పుష్పాలంకారములు నీ వేల హరించితివో తెలిసికొనవచ్చితిని."

"నిజము చెప్పు మందువా?"

"నిర్భయముగాఁ జెప్పుము."

"నీవు నాహృదయము నేల హరించితివి?"

"నీమాటలు నాకుఁ దెలియుట లేదు."

అప్పుడు తిష్యరక్ష తనమనసులోని యాశను వ్యక్తపఱిచెను; భర్తయెడఁ దనకుఁ గలవిరక్తిని స్పష్టముచేసెను." నీకుఁ బాపము చుట్టుకొనునని నే నెఱుఁగుదును. కాని యీలోకములో నత్యంతపరిశుద్ధ మగు ప్రణయ మెచ్చటను లేదు. నీహృదయము విశాలము. అందొక మూల నా కించుకతావిమ్ము! దారుణమైన నాపిపాస కింత నీరుపోయుము!"

"అమ్మా?"

"అట్లు సంబోధింప వద్దు. నీ నోటినుండి యట్టి సంబోధనము నాకు విషమువలె నుండును!"

"నీ వింక నిట్టిమాటలు రానీయ వలదు!"

"చూడు, కుణాలా! నన్ను నీచరణములపైఁ బడవేసికొనుము. నీకు నే నుపకారము చేసెదను. మహారాజునకు నేను ప్రాణము నని నీవెఱుఁగుదువు. ఈవిశాలమగధసామ్రాజ్యమునకు నిన్నుత్తరాధికారిని జేయించెదను. నీ కన్నదమ్ములనేకు లున్నారనునది తెలిసినవిషయమే. నీకే రాజ్యము వచ్చునను నాశ లేదు. రాజకీయోద్యోగులయందుఁ జాలమంది నీకు శత్రువులు. హిందువు లెల్లఱు నీకు వైరులు. నీప్రాణములు తీయుట కనేకులు సిద్ధముగా నున్నారు.

నీకు బంధువులు లేరు. నీవంటి గుణవంతునితో సాధుశీలుని తోఁ జుట్టములు కలియరు. కావున నీకు బంధువు కావలెనేని సామ్రాజ్యమునకు భవిష్యత్కాలమునఁ బ్రభువవు కాఁగోరెదవేని నాకు భిక్ష పెట్టుము! ఇంకను విచారించి చూడుము. మహారాజు ప్రాణములు నాపిడికిట నున్నవి. కోరితివేని నిన్ను ఱేపే యుత్తరాధికారిని జేసెదను.”

“ఇట్టి కఠినవాక్యములు నీ నోటవెంట రారాదు. త్రిరత్నములే నాకు సహాయులు, నాకు బంధువులు! ఉత్తరాధికారిత్వము నాకక్కఱ లేదు. నీవు పెట్టినయాశవలన వచ్చు నింద్రత్వ మయినను స్వీకరింపను. నే నింక నేమియు మాటలాడను. వెడలిపోవు చున్నాను.”

“మాటలాడవుగా? నీవు స్త్రీహత్య చేయుచున్నా వని తెలుసుకో! మాతృహత్య చేయుచున్నావని తెలుసుకో!”

“నేను నిర్దోషిని.”

“ఒకానొకనాఁడు నీవు దీనికిఁ బరితాపము నొందవలసి వచ్చును. తిష్యరక్షను మన్నించిన యెడల నా కీవిపత్తు వచ్చియుండ దని యొకప్పు డనుకొందువు!”

“ఎన్నఁడు ననుకో” ననుచు కుణాలుఁడు నికుంజమును విడిచి వేగముగాఁ జని కాంచనమాల నన్వేషింప దొరకొనెను.

## ౬

అంతట తిష్యరక్షహృదయములో సుమతికుమతులు ప్రవేశించి ద్వంద్వయుద్ధము చేయ నారంభించిరి.

"ఎట్లు? సవతికొడుకు పెద్దలకుఁ బోయినందులకుఁ దగిన శాస్తి యయినదనియా?" అని సుమతి పలికెను.

"ఒక్కనాఁటితోనే యాశ విడుతువా యేమి?" అని కుమతి.

"మరలఁ బోయెదవా యేమి?"

"పోవ నక్కఱ లేదా! నేఁడు కూడ నావద్దకు వచ్చినాఁడు. ఈసారి నే నతనికడకుఁ బోయెదను."

"ధన్యవు! మరల నట్లే యయినయెడల? ఈసారి మంచి యుపాయ మేదైన నాలోచింప లేదా?"

"లేదు."

"అట్లయిన నిం కెందులకు? వృథాశ్రమ మాఁను. ఆ యాశ వదలు కొనుము."

"చక్కని మాట! అట్లే చేసెదను! ఇంతటి యవమానము సహించెదను! ఇదంతయు వదలిపెట్టుటకే యను కొందువా?"

"పట్టుకొనుట చేతఁగానప్పుడేల వదలిపెట్టవు? వృథా ప్రయత్నము వలన నేల కష్టముపా లయ్యెదవు? అందుచేతనే చెప్పుచున్నాను. ఆయాశ విడిచి పెట్టు! కుణాలుఁడు మంచివాఁడు."

అంతట వారిరువురును గొంచె మాఁగి మరల సంభాషించిరి. సుమతి యిట్లనెను. "ఈయవమానమునకుఁ బ్రతిక్రియ చేయవా యేమి? ఏనమ్మకముతోఁ బోవుచున్నావో

యది యుక్తదే !"

"బాగున్నది. కొంచెము గర్వభంగము కావించినచో నతని నిచ్చుటకిఁ గొనివచ్చుట తేలిక."

"అట్లయిన నదియే మంచిది. పోయి రమ్ము."

సంభాషణము ముగించి యిరువురును నిష్క్రమించిరి. తిష్యరక్ష పొదరిల్లు విడిచి యెచటికో పోయెను.

---

## పరిచ్ఛేదము 3.

### ౧

కుణాలుఁ డత్యంత విచారముతో కాంచనమాలను వెదకఁ బోయెను. అతని కామె యంతఃపురమునఁ గనఁబడలేదు. అంతట నుద్యానమున వెదకెను. అచటను గనఁబడ లేదు. అతఁడు మిగుల నుద్విగ్నుఁ డయ్యెను. రంగస్థలమునకుఁ బోవునపు డామె నెచట విడిచిపోయెనో యచటఁ గొంచెముసేపు నిలుచుండి యాలోచించెను. అచటినుండి యతఁడు చెంత నున్న మతాయతనమునకుఁ బోయి చూచెను. అప్పటికిని దీపము వెలుఁగుచునే యున్నది. కాంచనమాల త్రిరత్న సేవకొఱకుఁ బ్రత్యహ మచటికిఁ జనుచుండెను; కాని యింతరాత్రివేళఁ బోవునది కాదు. ఇంతరాత్రివేళ నామె యెన్నడు కుణాలుని విడిచియుండినది కాదు. నేఁడు తన్ను విడిచి యెచ్చటికి వెళ్ళియుండునా యని కుణాలుఁడు తలపోయసా

గెను. ఒకసారి మఠమునకుఁ బోయి చూతునా యని యు
త్కంఠతచిత్తముతోఁ దొట్రుపాటుతో నచటికిఁ బోవసాగెను.

కుణాలుఁడు తన్ను విడిచిపోయినతరువాత కాంచనమాల
యసహాయురాలై భర్త యిఁక రానేరఁడని భయ మందఁ
జొచ్చెను. ఆమె యంతఃపురమునకుఁ బోవలేదు, రంగస్థల
మునకును బోలేదు. కొంతసేపు త్రిరత్నములను ధ్యానించి
"భగవానుఁడా, రక్షింపుము! నా కేయాపద తటస్థించినను
సరే ఆయనకు ముల్లుగూడ గుచ్చుకొనకుండఁ జూడుము!
అభినయాంతమున నా కాయనను జూపుము!" అని యామె
ప్రార్థించెను. క్రమముగా మఠమున సాయంపూజ ప్రారం
భమయ్యెను. కాంచనమాల యచటి కేగి స్వహస్తములతోఁ
బూజావిధిని నిర్వర్తించెను. పూజావసానమున "అర్హతుల"
యనుమతిఁ బొంది త్రిరత్నమూర్తి సమ్ముఖమునఁ గూర్చుం
డి నృత్య మారంభించెను. మఠనివాసు లనేకు లభినయము
చూడఁబోయిరి. అందుచే నామె కెట్టి యంతరాయము
కలుగ లేదు. కాంచనమాల విచారము నొకమూలకుఁ
ద్రోసి యేకాగ్రచిత్తముతో "ధర్మమా, సంఘమా, శ్రీబు
ద్ధదేవా, నాయుత్కంఠను దొలఁగింపుఁడు! భర్తకెట్టి యమం
గళము కలుగకుండఁ జూడుఁడు! స్వస్థశరీరముతో నాథుఁడు
నాచెంతకు వచ్చునట్లు ప్రసాదింపుఁడు! అని ప్రార్థించెను.

అట్టియెడ కుణాలుఁడు స్వయముగా త్రిరత్నమూర్తి స
న్నిధికి వచ్చి కంఠమునకు వస్త్రము చుట్టుకొని నమస్కార

ము చేసి యిట్లు ధ్యానించెను. "త్రిరత్నములారా, త్రిశరణములారా, నాకు విపత్పరంపర దాపరించినది. నాచిత్తమును సుస్థిరము చేయుడు. నేఁడు విన్నదానివలనను నా కింతవఱకుఁ దెలిసినదాని వలనను మనస్సు మిక్కిలి వ్యాకులితమయినది, ధైర్యము సడలినది. దేవా, నాకుఁ జిత్తస్థైర్యమిమ్ము. రాజ్యముగాని ధనముగాని నా కక్కఱ లేదు. సద్ధర్మపరిచారమే నాయభీష్టము. వేనివలన ధర్మపరిచార మగునో వాని నన్నిటిని నాకుఁ బ్రసాదింపుము. పాపమునుండి నన్నుఁ దొలఁగింపుము!"

ఇఱువురు నవనత మస్తకులై నిశ్శబ్దముగా గద్గదకంఠముతోఁ బ్రార్థనలు సలుపుచుండిరి. కుణాలుఁడు వచ్చినసంగతి కాంచనమాలకుఁ దెలియదు. అతఁడు భార్యధ్యానము భంగము చేయలేదు. కాని ప్రియుల హృదయములం దుద్వేగ ముద్భవించెనేని దద్బలమున వారు పరస్పరవృత్తాంతములను గొంతవఱకు గ్రహింతురు. విశేషించి వా రొక్కచోట నున్నప్పుడు మానసములందలి సుఖవృత్తాంత మెవ్వరో వచ్చి చెప్పినట్లు తెలియును.

ప్రచండ ఝంఝావాతము వీచిన తరువాత నాకాశము నిర్మల మయిన ట్లయ్యెను. దారుణమైన గ్రీష్మతాపము పొందిన తరువాత శీతలసుగంధమందానిలము వీచిన ట్లయ్యెను. అంతట దైవము ప్రసన్న మయ్యెనని యెంచి కాంచనమాల తలయెత్తి చూడఁ బార్శ్వముననే కుణాలుఁడు ధ్యానమగ్నుఁ

డై కొనఁబడెను. ధ్యానభంగము చేయుదునా యని సంశయించి తుదకు మెల్లగా నామె యతని ధ్యానభంగము కావించెను. ఉద్వేగ విచారముల తరువాతఁ బరస్పర సందర్శనము తరువాతఁ బరస్పరగాఢాలింగనము తరువాత కాంచనమాల యిట్లనెను: "నాథా, త్రిరత్నమూర్తి నాయెడఁ బ్రసన్నుఁ డయినాఁడు. మనకుఁ దటస్థించిన యమంగళము తుదకు శుభప్రద మగును. కాని నాథా, రాజసౌధమందలి సమస్తసుఖములును దుఃఖమయములే. వానివలన మాటి మాటికిని హృదయమున నుత్కంఠ జనించు చుండును. అడుగడుగునకును బాధలు కలుగుచుండును. రండు, నేఁడు మొదలుకొని యీవృథాభోగములను బరిత్యజించి సద్ధర్మప్రచారార్థము ప్రతిగ్రామమునకుఁ దీర్థమునకుఁ బోవుదము. మన కింక వియోగ మెన్నటికిని గలుగదు. పైగా నా కీవ్యాకులతో యేల కలిగెనో, గాని దీనివలన ఫలసిద్ధి యగును!"

కునాలుఁ డిట్లనెను: "కాంచనా, నీ వేమని తలఁచు చున్నావు? సుఖభోగములకై రాజసౌధమునకు వచ్చియుంటి ననియా? ధనలోభముచేఁ గాని కీర్తి నపేక్షించి కాని వచ్చితి ననుకొంటివా? ఎంతమాత్రము కాదు! ఇచట నున్న యెడల మహారాజునకుఁ బ్రియపుత్రుఁడ నగుటచే సద్ధర్మప్రచారమున కెక్కువ సౌకర్య ముండునను నాశతో వచ్చితిని. చూడు: నేను బ్రచారము చేసినను జేయకున్నాను. రాజపరివారములోఁ గొందఱుకొందఱు బౌద్ధమతము స్వీకరిం

చుచున్నారు. మహారాజు సద్ధర్మదీక్షితుఁ డయినాఁడు శ్రీ ఉపగుప్తుని సన్నిధిని మరల సత్యాగ్రహణము చేయుచున్నాఁడు. ఈసారి మహారాజు సద్ధర్మప్రచారార్థము విహిత విధానములు కావించును. ఈసారి నావలన ననేక కార్యములు నెరవేఱు నను నమ్మకము కలిగినది."

"నాథా, మీ కిట్టియుద్దేశ మున్నదని నే నెఱుఁగనా? ఎఱుఁగుదును. కాని నేఁడు నా దొక మనవి కలదు. ఈ పూర్ణిమారాత్రిము శుభలగ్నము. నేఁడు త్రిరత్నమూర్తి మనయెడఁ బ్రసన్నుఁడయి యున్నాఁడు; ఉండకున్న నంత విచారము కలిగిన పిమ్మట మిమ్ము నాచెంత కేల తీసికొని వచ్చును? అందుచే నీ నిశీథమున దేవసాన్నిధ్యమం దీశుభలగ్నమున సద్ధర్మప్రచారార్థము మన జీవనముల వినియోగింప నిష్ఠ పూనుద మని నా యభిలాష."

అని కాంచనమాల పలుక కుణాలుఁడు "చాలు బాగున్న" దని చేతులు జోడించి నమస్కరించెను. ఉభయులు నేకాగ్రచిత్తముతో నేకగ్రీవముగా నిట్లనిరి. "త్రిరత్నములారా, ధర్మమా, సంఘమా, బుద్ధదేవా, బోధిసత్త్వా, ప్రత్యేకబుద్ధా, శుద్ధబుద్ధా, జీవన్ముక్తగణమా, మీరందఱు సాక్షులు. దంపతుల మిఱువురము నేఁటి శుభలగ్నమున సద్ధర్మాభివృద్ధికి మా జీవితములు కైంకర్యము చేయుచున్నాము. సద్ధర్మౌన్నత్యమునకు భంగకరములును శ్రీబుద్ధదేవుని మహిమాప్రచారమునకు విరుద్ధమైనట్టియు కార్యము లెన్నఁడును

జేయుము. త్రిరత్నములారా, శ్రీబుద్ధదేవా, బోధిసత్వగణ
మా, మాకుఁ జిత్తస్థైర్యము ప్రసాదింపుఁడు!”
అప్పుడు మహాయతనములోని దీపము జాజ్వల్యమాన మ
య్యెను. త్రిరత్నమూర్తివదనమున మందహాసమావిర్భవిం
చెను. శీతలసుగంధమలయమారుతము వీచెను. ఆకాశమున
మంగళతూర్యధ్వని మ్రోగినట్లయ్యెను. ఈవిధముగాఁ దమ
జీవనములను కైంకర్యము చేసినపిమ్మట దీక్షానంతరము
అశోకమహారాజు నాశీర్వదించుటకై వారు దివ్యదంపతుల
వేషములు ధరింప నరిగిరి.

౨

భయస్నేహములు చూపి కునాలుని వశపఱచుకొనవలసినదే
కాని వేఱుపాయము లేదని తిష్యరక్ష నికుంజమునుండి యీ
వలకు వచ్చి భావించెను. కావున అశోకుని సంపూర్ణముగా
స్వాధీనపఱచుకొనుటయే యుక్తియుక్తమని యామె తలం
చెను. మహారాజును సంతోషపెట్టుట కొక్కటే మార్గము
కలదు. రాజభార్యలలోనెవ్వరు నింతవఱకు బౌద్ధధర్మమును
స్వీకరింపలేదు. కావునఁ దాను సద్ధర్మమును అశోకునితో
నారాత్రియే స్వీకరించిన యెడల మహారాజునకుఁ బ్రీతిపా
త్రము కావచ్చునని యోచించి యామె యనాయాసముగా నొక
మతమును విడిచి వేఱొకమతమును స్వీకరింప నిర్ధారణ చేసి
కొనెను. అంతట తిష్యరక్ష నిజమందిరమున కరిగి అశోకు

నిపేర రహస్యముగా జాబు వ్రాసెను. అందలి తాత్పర్య మిది:—

"కొన్ని మాసములనుండి శ్రీబుద్ధభగవానుఁడు నాకుస్వప్నములలోఁ గానఁబడి తనధర్మమును స్వీకరింప నన్ను శాసించుచున్నాఁడు. లోకు లేమైన ననుకొందు రేమో యనుభయమున దేవరవారి కీవిషయము విన్నవింప లేదు. కాని నేఁటియుత్సవసమయమున దేవరవారి కీవిషయము విన్నవింపకుండఁ జాలకున్నాను. ఈదాసురాలిప్రార్థన గ్రాహ్య మగునని విశ్వాసము."

ఈయుత్తరము నామె దాసిచేతి కిచ్చి ప్రశ్వాకాని సన్నిధికిఁ బంపెను. చాలకాలమునుండి యతఁడామెకు బహుకారణములచే నశవర్తి యగుటవలన శీఘ్రముగా జాబును సభలోనున్న మహారాజునకుఁ జేర్చెను. లేఖను జదివి అశోకుఁడు మహానందము నొంది తిష్యరక్ష రక్తాంబరము ధరించిరావచ్చునని యనుజ్ఞ నొసఁగెను. అంతట మహారాజు మహాదరముతో నుత్తరమును బార్శ్వవర్తులగు ననుచరులకుఁ జూపి తిష్యరక్షాదేవి యిప్పుడే బౌద్ధధర్మము స్వీకరించునని ప్రకటించెను.

## 3

గంభీరము నిష్కంపము నిస్తబ్ధము నగుసముద్రమువలె మహాత్ముఁ డగు ఉపగుప్తుఁడు బుద్ధవేషధారియై బోధిదుమ

మూలమున ధ్యానమగ్నుఁడై యుండెను. ఆయన సమస్త బాధలను సమస్తవిఘ్నములను నతిక్రమించెను. క్రమముగా నాయనవదనమున హర్షచిహ్నములు కానఁబడఁజొచ్చెను. నేత్రములు ముద్రితములై ముఖమున మందహాస మంకురింపఁ సాగెను. ఆహ్లాదముచే నాయన శరీరము కంపింపఁ దొడఁగెను. క్రమముగా నతఁడు కన్నులు తెఱచినాఁడు. త్రిశరణముల నామములు కంఠమునుండి వెలువడ సాగెను. స్వర్గమునుండి సిద్ధపురుషుఁడు క్రిందికిదిగి "భగవన్, తమతపస్సిద్ధికి తాత్పర్య మేమి" అని యడుగ "మగధసామ్రాజ్యము ధర్మభ్రష్టమై యున్నది. ఇచ్చట సద్ధర్మము వ్యాపింపఁ జేయవలెనని సంకల్పము" అని యతఁడు బదులు పలికెను. అంతట సిద్ధపురుషవేషధారి అశోకమహారాజుహస్తమును గ్రహించి ఉపగుప్తుని యెదుటికి గొనిపోయి "మహారాజు సద్ధర్మదీక్షితుఁడు కాఁగోరుచున్నాఁడు. ఈయనప్రియమహిషి తిష్యరక్షాదేవియు దీక్షవహింపవేడుచున్నది" అని విన్నవించెను.

అప్పుడు బుద్ధవేషధారి యగు ఉపగుప్తుఁడు రెండుచేతులతో నిరువురను బట్టుకొని యుచ్చైస్స్వరమున గాథలు పాడఁజొచ్చెను. సభలోనివా రెల్ల రాగంభీరధ్వని నేకాగ్రచిత్తులై గాథల నాకర్ణింపసాగిరి. కొంతసేపటికి దేవదంపతులు స్వర్గమునుండి యవతరించిరి. వారల శరీరములు నిరాభరణములయ్యెను దత్కాంతులచే సభాభవనమందలి దీపావళి నిస్తే.

జ మయ్యెను. వారు మహారాజు ని ఆశీర్వదించిరి:—

"ససాగరయు సద్వీపయు నగుపృథివి కధీశ్వరుఁడు సద్ధర్మము స్వీకరించుచున్నాఁడు. శీఘ్రముగా ససాగరయు సద్వీపయు నగుపృథివీమండలమున బౌద్ధధర్మమహిమ వ్యాపించును. అశోకునికీర్తి దిక్చక్రవాళము నాచ్ఛాదించును. ఇఁక మహారాజునకు జన్మము లేదు. ఇహలోకమునందే నిర్వాణము లభించును, కౌముదీ ప్రవాహము బ్రహ్మాండోదరము నిండునట్లు అశోకుని కీర్తిప్రవాహము దిగంతముల వ్యాపించుఁగాక!"

దేవదంపతులు వెడలిపోయిరి. రాజదంపతుల కేమేమో కానఁబడెను. ఉపగుప్తుఁడు శరీరములు స్పృశించునప్పటికి వారి యూహలు మర్త్యలోకమునకుఁ దిగినవి. ఉపగుప్తున కప్పుడు వారు ప్రణామము చేసిరి.

"కుణాలుఁడు కాంచనమాలయు నెచ్చట నున్నారు?" అని ఉపగుప్తుఁడు ప్రశ్న చేసెను. వారు పరమధార్మికులు, ధర్మముకొఱకు బహుక్లేశముల ననుభవించినారు. కావున వారి నాశీర్వదింపవలె నని ఉపగుప్తుని తలంపు.

ప్రియపుత్రుని ప్రశంస విని అశోకమహారా జుల్లాసము నొంది కుమారుని రప్పించుటకై భటుని బంపెను. కుణాలుఁడు పైభాగమునఁ గూర్చుండి తిష్యరక్షభావమును బరిశీలించుచుండెను. జరిగిన వెల్ల నతనికి జ్ఞప్తికి వచ్చెను. మంచిదానివలె నామె కూర్చుండి జపము చేయు కొంగవలె అశో

కుని పార్శ్వమున నుండి యాశీర్వచనము నొందుటఁ జూచి నతని కామె చాతుర్యపరమావధి సంస్ఫురించెను. ఇంతలోఁ దమకోసము తండ్రి భటుని బంపెనని కుణాలుఁడు తెలిసి కొని భార్యతోఁ గ్రిందికి దిగివచ్చి జనకునకు సమస్కారము చేసి యాతని యాశీర్వాదము నొంది ఉపగుప్తుని సన్నిధి కరిగెను. ఉపగుప్తుఁడు వారిమస్తకములపై హస్తము లుంచి గాథలు పాడుచు నాశీర్వచనము చేసెను. అప్పుడు కుణాలు నకుఁ జేతనమున శ్రీబుద్ధభగవానుఁడు సద్ధర్మము నుపదే శించుచున్నట్లును సిద్ధ చారణ కిన్నర దేవ మానవులాకర్ణిం చుచున్నట్లును శ్రీబుద్ధదేవుఁడు పూర్వజన్మములను వివరించి క్రమముగా దశభూముల నతిక్రమించి బుద్ధత్వము నెట్లు పొం దెనో వ్యాఖ్యానము చేయుచున్న ట్లుండెను. ఆ వాగమృత ము నాస్వాదించి యెల్లరు పులకితచిత్తు లయిరి. శరీరములు రోమాంచము నొందెను. ఇంతలో బుద్ధదేవుఁడు కుణాలుని దన పీఠముప్రక్కఁ గూర్చుండఁ బెట్టెను. "జయ. కుణాల జయ కుణాల!" యని జనసమూహము జయధ్వని చేసెను.

కాంచనమాల కిట్లు స్ఫురించెను. ఆమె బోధిద్రుమమూ లమున ధ్యానమగ్నయై యున్నదఁట. ఆమెకు నిర్వాణము సమీపించుచున్నదఁట. దశమభూమి నామె యించుమించు గా నతిక్రమించుచున్నదఁట. ఆ సమయమున బ్రహ్మాండ ములోని పశుపక్షులు కీటకములు దేవదానవులు సిద్ధచార ణులు నామెకు నల్వంకల నిలిచి "అమ్మా, మా కేమి గతి

చూపి పోవుచున్నావు?" అని రోదన మారంభించిరి. అప్పు డు కాంచనమాల యిట్లనెను: "అవలోకితేశ్వరునివలెఁ బ్రతిజ్ఞ చేయుచున్నాను! సమస్తబ్రహ్మాండములో నెల్లను ని ర్వాణ మొందె నొక్కప్రాణి నిర్వాణ మొందక నిలిచియున్నను నాకు నిర్వాణ మక్కఱ లేదు!"

ఈమాట లనుసప్పటికి సప్తస్వర్గ సప్తపాతాల పృథివీ నరకములనుండి జయధ్వనులు బయలుదేఱెను. భగవాన్ అవలోకితేశ్వరుఁడు తేజఃపుంజముతో నామె దేహమున లీన మయిన ట్లయ్యెను!

సల్వాంకల జయధ్వనులు వినవచ్చినవి. ఆశీర్వచనమయ్యెను. ఉపగుప్తుఁడు కాంచన కుణాలులను గాఢముగాఁ బరిష్వంగించి అశోకుని సంబోధించి "మహారాజా, నీకుమారునితోను కోడలితోను సమానులు లోకములో లేరు! సద్ధర్మప్రచారము కొఱకు వీరు జీవనములు కైంకర్యము చేసినారు" అని యుగ్గడించెను.

తనకు బౌద్ధధర్మమునెడ నభిమానము జన్మించినది మొదలుకొని అశోకునకు కాంచన కుణాలులమీఁద నత్యంతానురాగము కలిగెను. నేఁడు ఉపగుప్తునినోట వారి ప్రశంస విని మహారా జానందోన్మత్తుఁ డయ్యెను. నిర్భరప్రేమమున అశోకుఁడు వారిని గాఢముగాఁ గౌఁగిలించెను. అప్పుడు ధర్మమునకు జయ మగుగాక! ధర్మాశోకమహారాజునకు జయమగుగాక! కుణాలునకు జయ మగుఁగాక! కాంచనమాల

కు జయ మగుగాక! రాజమహిషి తిష్యరక్షాదేవికి జయమగుగాక!' అని జయధ్వానములు చెలరేగెను. అప్పటికి రాత్రి మూఁడు జాము లయ్యెను. ఎవరి నివాసములకు వారు వెడలిపోయిరి.

పరిచ్ఛేదము ౪

౧

ప్రాతఃకాలమున తిష్యరక్ష యేమి చేసెనో చెప్పుటకుముందుగా నామెపూర్వచరిత్ర తెలుపుట యవసరము. తిష్యరక్ష మంగలివానికూఁతురు. ఆమెతండ్రిస్థితిగతు లంత మంచివి కావు. నడవడినిబట్టికాని వంశమునుబట్టికాని వానికి ఖ్యాతి లేదు. తిష్యరక్ష రాణి యగునని యామె పుట్టగానే దైవజ్ఞుఁడు చెప్పినాఁడు. చిన్నతనమందే యీసంగతి తెలిసికొని యామె రాణి కావలెనని మిక్కిలి యభిలషించుచుండెను. తనతో సాటివాని కామె నిచ్చి పెండ్లి చేయవలెనని తండ్రి తలంచెను. కాని యామె "నేను రాణి నగుటకు వీలు లేనియెడల శూర్పణఖవలె గర్భాధానగృహమునందే వైధవ్యదీక్ష ప్రారంభించెదను!" అని పలికెను.

ఈసమయమున బిందుసారుని పుత్త్రుఁడు అశోకుఁడు మిగుల దుర్మార్గమునఁ బ్రవర్తించుచుండెను. రాణులు మంత్రులు ప్రజలు నతనివిషయమై యాకులపా టొందిరి. ఇట్టి కుపుత్రుని రాజధానినుండి వెడలనడచుతలంపుతో కీకటదేశపు

దక్షిణారణ్యమున నున్న పింగళవత్సుని సన్నిధికి శిక్షార్థము పంపివేసెను. పింగళవత్సుఁడొక్క జ్యోతిశ్శాస్త్రమునందే కాక సమస్తశాస్త్రములందును బ్రవీణుఁడు. ఆయన మహారణ్యమున నివసించుచున్నాఁడని తమదుస్సంతానమును శిక్షార్థము లోకు లాయనసన్నిధికిఁ బంపుచుండెడివారు.
అశోకుఁడచటికిఁ జనిన కొలఁదిరోజులకు తిష్యరక్ష దానికిఁ దాళలేక తండ్రి యామెను పింగళవత్సునికడకుఁ బంపెను. ఆయనయింట నివసించువారలకన్యోన్యసందర్శన మాయెను. అశోకున కప్పటికి రెండు వివాహము లయినవి. బిందుసారునిపుత్త్రిలలో అశోకుఁడే రాజగునని పింగళవత్సుఁడు గుణించి చెప్పెను. ఈసంగతి విన్నదిమొదలు అశోకుని మోహపెట్టుటే తిష్యరక్షకుఁ బ్రధానకార్యమయ్యెను. ఆమె గట్టిపట్టున; ఎట్లయినను అశోకుని వివాహమాడ సంకల్పించెను. పన్నాగములు పన్నుటలో నామె చిన్నప్పటినుండియు బృహస్పతి వంటిది. మొదటనుండియు నామె యతనిని వ్యామోహపెట్ట వివిధప్రయత్నములు చేయుచుండెను. సంగలివానిపుత్త్రిక యని యతని కామెయెడ నేహ్యభావ ముండుటచే వివాహముమాట యన్ననతఁడు మండిపడుచుండెను. ధర్మమును జరిత్యజించి యయినను అశోకుని గూడెద నని యామె ప్రతిజ్ఞ చేసికొనెను.
అశోకున కీసమయమునఁ బాపపుణ్యములనికాని ధర్మాధర్మము లనికాని మంచిచెడ్డ లనికాని వివేకము లేదు. కావున

తిష్యరక్ష ప్రతిజ్ఞ నెరవేఱుట కెక్కువ ప్రయాసము లేకపో యెను. శీఘ్రకాలములోనే యామె కోరిక తీరినది. ధర్మ మును విక్రయించి తిష్యరక్ష మొదట మహావిపత్తునకు లో నయ్యెను. ఈసంగతి బయలు పడినయెడల అశోకుఁ డామె ను శాశ్వతముగా విడిచిపెట్టును; గూఢముగా నున్నచో నామె రాణి యగుటకు వీలు లేదు. కావున నామె తండ్రికి రహస్యముగా జాబు వ్రాసెను. "ఇక్కడ దుర్మార్గు లనేకు లున్నారు. ఎక్కువరోజు లున్నచో దుష్టులబారిని బడవల సి వచ్చు" నని తండ్రికిఁ దెలిపినది.

ఉత్తరము చదివి యాధూర్తుఁడు సమస్తము గ్రహించి తో డనే పింగళవత్సుని యాశ్రమమునకుఁ బోయి స్థితిగతులాయ నకుఁ దెలిపెను; తెలిపి "మాజాతిని రక్షించుమార్గముచూఁ డు" డని ప్రార్థనచేసెను.

పింగళవత్సుఁడు కోపాంధుఁడై అశోకుని బిలిపించి బలవంత ముగా తిష్యరక్షకు నతనికిని వివాహము చేసెను. సక్రమ ముగా మహారాజునకు సమస్తవిషయములు వ్రాసి "ఇట్టి వానిని శిక్షించుట నాపని కాదు. తమరే తమపుత్రుని కోడలిని బిలిపించుకొనుఁ" డని లిఖించెను.

వారి నిరువురను బిందుసారుఁడు రాజధానికిఁ బిలిపించెను. కుమారుని తగినట్లు చీవాట్లు పెట్టి కోడలి నంతఃపురమున కుఁ బంపెను. దైన్యముతో నామె రాచనగరిలోఁ గాల యాపనము చేయుచుండెను.

కొలఁదిదినములలోనే రాజకుమారుని దుండగములవలన నాగరకులు మరల దల్లడిల్లిరి. కుమారుని రాజధానినుండి మరల నావలకుఁ బంపివేయవలెనని రాజు తలచుచుండుటనం తలో తక్షశిలలోని బ్రాహ్మణక్షత్రియులు విరుద్ధముగా లేచిరని వార్త వచ్చెను. ఈతరుణమున రాజు అశోకుని సేనాధిపతిగా నియమించి తక్షశిలాప్రదేశమునకుఁ బంపెను.

తిష్యరక్ష అశోకునిభార్యయై యంతఃపురమున నుండెను. కాని రాజభార్య యగుట కనకాశము చాల స్వల్పమని గ్రహించెను. అశోకున కగ్రజులు కలరు. వారిని వంచించిననే గాని తనభర్త ప్రభువు కానేరఁడు. కావున వారిని దూరీభూతులఁ జేయు నుపాయమునఁ బ్రవృత్తురా లయ్యెను. ప్రప్రథమమున నత్తగా రగు సుభద్రాంగికి సేవ చేయుచు తిష్యరక్ష యామె కిష్టురా లయ్యెను. కోడలు చాల సాధుశీల యని రాజునకుఁ దెలిసెను. కావున నప్పటినుండి యామె యెడ నాదర మతిశయింప నామె యాఁడిగమునకు సేవకురాండ్రను మహారాజు నియోగించెను. అంతఃపురములోని యితరస్త్రీలు తిష్యరక్షకు వైరు లయిరి. ఆమె మహారాజ్ఞీసన్నిధిని గూరుచుండి యితరులమీఁద నేరములు చెప్పుచుండును. మిగిలిన కోడండ్రవిషయమై మహారాజునకును నేరములు తెలియుచుండెను. అంతఃపురమున తిష్యరక్ష యేమి తలఁచుకొన్న నది యగునని త్వరలో నెల్లరు గ్రహించిరి.

ఆసమయమున రాధగుప్తుఁడు నూతనముగాఁ బ్రాసాద

మున నుద్యోగి యయ్యెను. అతఁడు చాణక్యుని శిష్యుఁడు. రహస్యాలోచనలందును రాజనీతియందును విషాదిప్రయోగములందును నించుమించుగా చాణక్యునితో సమానుఁడు. ఇంతవఱకును లోకు లామర్మము లెఱుఁగరు. ఏదైనఁ గోలాహలము సంభవింపని పక్షమున శీఘ్రముగా వృద్ధిలోనికి వచ్చుటకు వీలు లేదని యతఁడు గ్రహించెను. రాజ్యములో విప్లవముకోస మాతఁ డెదురు చూచుచుండెను. తిష్యరక్ష తనకు బహువిషయములలోఁ దోడ్పడు నని యతఁడు కని పట్టెను. రాధగుప్తునిఁ జేతఁ బట్టుకొన్నయెడలఁ దాను రాజమహిషి కావచ్చునని తిష్యరక్ష భావించెను. కావున మధ్యేమార్గమున వా రిద్దఱు కలిసిరి. ఉభయమనస్సు లేకీభవించినవి. వారు బహుకాలము నిరీక్షింప నక్కఱ లేకనే విప్లవము తలచూపెను. మహారాజు ప్రథమపుత్రుఁడే విప్లవమునకు హేతు వయ్యెను. ప్రభు వనేకవిషయములలో సుషీమునితో సంప్రతించుచుండును. కుమారుఁడును బుద్ధిమంతుఁడు విచక్షణుఁడు ధీరుఁడు బహువిద్యాపారంగతుఁడు, కాని విషయలంపటుఁడు. కావున రాధగుప్తునకును ప్రధానామాత్యునకును నతఁ డన్న సరిపడదు. ఒకానొక వణిజ్మహిళయెడల సుషీముఁ డవినయము సలుపుటచే లోకులు కుపితులై చెలరేగిరి. అతనిని వెడల నడవ వలసిన దని వారు మహారాజును బ్రార్థించిరి. ప్రధానామాత్యుఁడు రాధగుప్తుఁడు తిష్యరక్షయుః బ్రజలకోపమును బ్రజ్వరిల్లఁ జేయ యత్నిం

చిరి. తుదకు సుషీముఁడు ప్రాసాదమున నివసించుట కూడఁ గష్టమయ్యెను. వేఱుపాయము గానక మహారాజు సుషీముని తక్షశిలకుఁబంపి అశోకుని పాటలీపుత్రమునకుఁ బిలిపించెను. నెలరోజులలో అశోకుఁడు రాజధానికి వచ్చెను. అతఁడువచ్చిన రెండు మూఁడు రోజులలోనే మహారాజు ప్రధానామాత్యుఁడు నాకస్మికముగా మరణించిరి. మరణములకు హేతువు నిర్ధారణ కాలేదు. కొందఱు కొందఱు విషమని చెప్పుకొనిరి. కాని యెవరు పెట్టిరో యెవ్వరికిని తెలియలేదు. ఒకటిరెండుదినములలో నాగరకులు నూతనరాజాభిషేక మహోత్సవమత్తులై వెనుకటిసంగతులు మఱచిరి. రాధగుప్తుఁడు అశోకు నభిషేకించెను. అతఁడు మహామంత్రి యయ్యెను. అశోకుని ప్రధానభార్య పట్టమహిషియై యర్ధసింహాసనాధికారిణి యయ్యెను.

పట్టాభిషేక మహోత్సవాహ్లాదము వారమురోజులలో భయముగాఁ బరిణమించెను. సుషీముఁడు మహాసేనతో పాటలీపుత్రము నరికట్టెను. అన్నతో వివాదము పెట్టుకొనుటా మానుటా యని అశోకుని మానసము సంచరించుచుండెను. అతఁ డేమియు నిర్ధారణ చేయఁజాల కున్నసమయమున తిష్యరక్ష యరుదెంచి యతనితో సల్లాపము లారంభించి భర్త మనస్సు చంచలముగా నుండుట గ్రహించి, "మహారాజా, నేను దేవరవారి స్థితిలో నున్నయెడల నారామములోని సమస్తఫలవృక్షములనుగూడ ఖండించివేసి యుందు!" నని

పలికెను.

ఉత్తేజకములయిన యీ మెవాక్కులు వినునప్పటికి అశో కునకు దార్ఢ్యము కలిగినది. "ఇదిగో పోవుచున్నాను! ఉద్యా నములో నొక్కచెట్టు మిగిలినను కుఠారమును విడువను!" అని యతఁడు వక్కాణించెను.

అంత నతఁడు సశస్త్రముగా యుద్ధమునకుఁ జనెను. అశో కుఁడు వీరాగ్రిగణ్యుఁడు. అతని భుజబలముచే సుషీముఁడు పరాజితుఁడు నిహతుఁడు నయ్యెను. చంద్రగుప్తుని వంశము లోని గర్భస్థశిశువులనుగూడ సంహరించి అశోకుఁడు విస్తీర్ణ మగధసామ్రాజ్యమున కేకాధీశ్వరుఁ డయ్యెను. సుభద్రాంగి ప్రార్థించుటచేఁ గనిష్ఠసహోదరుఁ డగు వీతాశోకుని మాత్రము బ్రతుక నిచ్చెను. కాని వానిని ధర్మభ్రష్టుని జేసి బౌద్ధమఠమునందు బంధించవలసిన దని తిష్యరక్ష యాలో చన చెప్పెను. వీతాశోకుఁడు శాక్యభిక్షువై పౌండ్రవర్ధనన గరమున భిక్షమెత్తి జీవయాత్ర నడుపుచుండెను.

౨

అశోకుఁ డీవిధముగా రా జయ్యెను, తిష్యరక్ష రాజమహిషి యయ్యెను. ఆమె మంగలివాని పుత్రిక యగుటచేతను సం పూర్ణముగా వివాహిత కాకపోవుటచేతను బట్టమహిషి యగుటకు వీలు లే కుండెను. ఆమె మహారాజ్ఞి యగునని దైవ జ్ఞుఁడు చెప్పినాఁడు కాఁడా? కావున నామెకు మనోవ్యథ లే

ను. బాల్యమునుండియు నే యభిలాషము నెరవేఱుటకై ధర్మాధర్మములను బాపపుణ్యములను లెక్కసేయక సమస్త దుష్కార్యములు చేసెనో యాకోర్కి సఫల మాయినది. అశోకుఁడు రాజయ్యెను, తిష్యరక్ష రాణి యయ్యెను. ఇరువురు లోకములోని సర్వోచ్చపదవి నధిష్ఠించిరి. ఉద్దేశ్యములు సఫలము లైనయానందమునఁ గొన్ని దినములు గడచెను. రాజత్వము రాజ్ఞీత్వము క్రమముగాఁ బ్రాఁత వడెను. ఉభయులును బాగుగా యోజింపవలసిన యవసరము కలిగెను. "సమస్తము సంఘటిల్లినది. కాని నా కేమి వచ్చినది?" అని వారు ప్రత్యేకముగా భావించిరి. "ఇంత శ్రమపడి యిందఱు లోకులను సంహారించి యింద ఱాత్మీయులను వధించి యీ యుచ్చస్థానమునకు వచ్చినాను. ఇందువలన నాకు వచ్చిన దేమి?" అని యతఁడు తలపోసెను.

"నాకు వచ్చిన దేమి?" అని అశోకుఁడు భావించినది పారలౌకిక విషయము; తిష్యరక్ష తలపోసినది తన నారీజన్మసౌఖ్యము.

అశోకుని యాలోచనకు ఫలితములు బౌద్ధధర్మాశ్రయము, లోకమున "అహింసా పరమో ధర్మః" ప్రచురము.

తిష్యరక్షకు భర్తపై మనసు కలుగుట లేదు. అతఁడు పెద్దవాఁ డగుచుండెను. పైగా నతఁడు రాజకార్యతత్పరుఁడై బౌద్ధధర్మప్రచారము చేయుచుండెను. ఈభర్తవలనఁ దనకు నారీజన్మసౌఖ్యము సంఘటిల్ల దని యామె తెలిసికొని యా

మె పరపురుషసంగతిని సుఖాన్వేషణము చేయ జొచ్చెను. ఈసమయమున భువనమోహన విగ్రహుఁ డగు కుణాలుఁ డామె దృక్పథమునఁ బడెను. ఆతని స్నిగ్ధశ్యామల తరళనయనములను గాంచి తిష్యరక్ష ముగ్ధ యయ్యెను. ఆతనిపొందుకయి యామె బహువిధముల యత్నము చేయసాగెను. కాంచనమాల సౌఖ్య మామెకు విషప్రాయ మయ్యెను. ప్రచ్ఛన్నభావమున తిష్యరక్ష యతనిని సర్వదా వీక్షించుచుండును. కావున నేఁటి సంధ్యాసమయమునఁ గృతకాద్రిమీఁద నిలిచియుండి, కాంచనకుణాలులు పుష్పమాలికలు గ్రుచ్చుట చూచుచుండెను. తరువాత నామె కాంచనమాల దండలను హరించి మారువేషధారి యగు కుణాలునకుఁ బత్నీవేషము దాల్చి రంగస్థలమున నిలిచెను. పిమ్మట లతాకుంజమున నిర్లజ్జముగాఁ దన మనోగతమును కుణాలునకు విశదపఱుపఁ గలిగెను.

---

## పరిచ్ఛేదము ౫

### ౧

కుణాలుఁడు కాంచనమాలయు గృహాభిముఖులై పోవఁజొచ్చిరి. త్వరలో నాపద కలుగునని యిరువురిమనస్సులలోఁ గూడ భయంకరముగా సంశయము కలిగెను; కాని సద్ధర్మమునకు శుభమే పరిణామ మని యాశయుఁ గలిగెను. మార్గ

మువెంటఁ జని వారు కాంచనకుటీరద్వారము చేరిరి. తలుపు తెఱచినతోడనే పై నుండి భూర్జపత్ర మొకటి క్రిందఁ బడినది. అం దిట్లు వ్రాసియున్నది:—

“నేను నీతో నాకుఁ జాల పని యున్నది. నిష్యదకుంజములో న న్నొకసారి కలిసికొమ్ము. అభినయ మాయిన తరువాత నీకోస మచ్చట వేచియుందును.”

చూడగా నది పట్టపురాణి యగుపరిష్వరక్షితాదేవి హస్తాక్షరములు. అంత నతఁ డాలసింపక కాంచనమాలతో నిట్లనెను. “కాంచనా, మహారాణి నన్ను స్మరించుచున్నది. ఆమె దర్శనము చేసి, వచ్చెదను.”

“ఇంత రాత్రివేళ నా మెయేల రమ్మన్నదో?” యని కాంచనమాల పలికెను.

“రమ్మన్నప్పు డామె యాజ్ఞ శిరసావహించ వలసినదే” యని కుణాలుఁడు కుంజమువైపునకుఁ బోవసాగెను. అంతఃపురమునఁ గేవలము భయము విచ్ఛేదము నధర్మము నుండు నని కాంచనమాల భావించెను. అంతకన్న నడవిలో సంచరించుటయే మేలని తలఁచి యామె పడకటింటిలోఁ బ్రవేశించెను.

కుణాలుఁడును ద్వరితగమనమునఁ గుంజములోఁ బ్రవేశించి చూడ న దెవ్వరును గానరాలేదు. అచ్చెరువొంది యతఁ డామెకోస మెదురుచూచుచుండెను.

## ౨

నిజముగా తిష్యరక్షిత యనర్థములకు మూలకందము. పరిష్యరక్షితా దేవి సౌధమునుండి యామె భూర్జపత్రమును హరించినది. అది రహస్యలేఖ యగుటచే సందేశహారి పేరును లేదు. ఆమె యాపత్త్రమును కుణాలుని ద్వారబంధమున గ్రుచ్చిపోయెను. అభినయ మైనపిమ్మట నీయుపాయముచే మరల కుణాలుని కుంజమునకు రప్పింప వచ్చుననియు నాతరుణమునఁ దనయభీష్టము నెరవేఱు ననియు నామె భావించెను. అభినయాంతమున మహారాజామెను జూచి "ప్రేయసీ, నేఁడు నీవు పూని నాకెంతయు సంతసము సమకూర్చితివి. నీసౌధమున రాత్రి గడపెద" నని పలికెను.

ముఖమున మహానందము వెలిఁబుచ్చుచు తిష్యరక్ష భర్తతోఁ "మహారాజా, ఈసేవకురాలియెడ నింతకన్న నెక్కువ యనుగ్రహమే ముండు!" నని పలికెను; కాని లోలో మిక్కిలి విసిగికొనుచు నేయుపాయమున ముసలివానిని శీఘ్రముగా నిద్రపుచ్చి తనయభీష్టము నెరవేర్చుకొనుట కెప్పుడు పనుగత్తునా యని చింతింపఁ జొచ్చెను.

"నీసౌధమునకు వత్తుననగానే యన్యమనస్క వయితివే?" మని చక్రవర్తి యామె నడిగెను.

"దేవా, నేఁటిరాత్రి జాగరణము చేయవలెనని సంకల్పము. అసద్ధర్మముతో బహుకాలము గడచినది. ఎన్నడు బౌద్ధదేవాయతనము చూడలేదు. కావున దీక్షఁ బూని ప్రాసా

దమందలి మఠములను నగరమందలి మందిరములను సందర్శించి నమస్కరించి వత్తమని తలపోయుచున్నా" నని యా దుర్మార్గురాలు ప్రత్యుత్తర మిచ్చెను.

మహారా జత్యంతానందముతో, "ప్రేయసీ, నీసంకల్పము ప్రశంసనీయము. కావున నీమందిరమునకు రాను. నామేడ లోనికే పోయెద" ననెను.

అప్పు డు తిష్యరక్ష యడ్డము వచ్చి యిట్లనెను. "దేవా, దేవదర్శనముకంటెను దేవర పాదదర్శనమే వాంఛనీయము. కాఁబట్టి దేవరవారు నామందిరమున నుండు గేని నేను శీఘ్రముగా దేవదర్శనము చేసికొని వచ్చి తమపాదసన్నిధిఁ జేరుదును. అందువలన సమస్త పాపములు తొలఁగి పోవును. సద్ధర్మము స్వీకరించుట కధికారిణి నగుదును!"

మహారాజు మిక్కిలి సంతుష్టాంతరంగుఁడై యా ప్రస్తావనకు సమ్మతించి తిష్యరక్షను వేనోళ్ళఁ బొగడఁజొచ్చెను.

3

మహారాజు నెట్లో నిద్రపుచ్చి తిష్యరక్ష త్వరితగమనమునఁ గుంజమధ్యమునఁ బ్రవేశించెను. చాలసేపటినుండి కుణాలుఁడు విసుగుతో వేచియున్నట్లును వెడలిపోవ నుద్యమించుచున్నట్లు నామె కనుఁగొనెను.

అంత నామె యతని యెదుటికిఁ బోయి నిలిచెను. తిష్యరక్షను గాంచినంతనే యొడలెల్ల ముడుకొని పోవ నతఁడు

"నీవే పన్నాగము పన్ని నన్నిచ్చటికి రప్పించితివా?" యనెను.

మందహాసము చేయుచు నామె యిట్లనెను: "అవును, రప్పించినాను. తిష్యరక్షితాదేవి పత్రమును హరించి నీమందిరద్వారబంధమున గ్రుచ్చితిని. ఆరహస్యలేఖమీఁద నే విలాసము లేకపోవుట నా కెంతయుఁ దోడ్పడినది. అది యట్లుండ నిమ్ము. నీ కోసము నే నింతపని చేసితినని యైనను నీమనస్సు కొంచెము చలించుట లేదా? ముసలిభర్తను వంచించి నీసన్నిధిఁ జేరినాను. నీ వింత కఠినచిత్తుఁడ వేమి?"

తిరస్కారసూచకముగా మొగము చిట్లించుచు కునాలుఁ డచ్చటినుండి వెడలిపోవ నుద్యుక్తుఁ డయ్యెను. కాని తిష్యరక్షి యతని కడ్డముగా నిలిచి యిట్లనెను: "నీ వొక్కసారి నాకు లభ్యమైనప్పుడు నామాటలు కొంచె మాలకింపక తప్పదు. అట్లు కానియెడల నిన్ను విడిచిపెట్టను. [illegible]గా నిప్పుడే కేకలు వేసి మహారాజును లేపెదను!"

కునాలునకుఁ బెద్దచిక్కు వచ్చినది. ఆమెను నెట్టుకొని పోవుటకు వీలు లేదు. కోపముచే నవయవములు చలించుచుండ నతఁడు "చెప్పు! నన్నుమాత్రము తాకవల!" యనెను.

"మంచిది, వినుము. మహారాజుమీఁద నాప్రభావ మెట్టిదో తెలియునా! క్షణములో నంగీకరించును మహారాజునకుఁ బ్రియతమ నయితిని. నీ వేది కోరిన నది యిప్పించఁ గలను. నాప్రార్థనకు సమ్మతింపుము. సమ్మతింపవేని మహారాజును వశపఱచుకొని నిన్నును కాంచనమాలను నాశము చేయిం

చేసెను?”

“చేయించ దలంచినది చేయించుము. ఇప్పుడుమాత్రము నన్ను విడుము!”

“అట్లయిన నంతఃపురములో నీకు నేను బరమ శత్రువు నని యెంచుకో!”

“మంచిది. అందువలన నా కేమియు నష్టము లేదు. ఇంకే మయినను చెప్పవలసిన దున్నదా?”

“లేదు. కాని యొకానొకనాఁడు నీవు నాయెదుట నిలువఁబడవలసి వచ్చును!”

“అట్లుగ వలసిననాఁడే చూచుకొనెదను. ఇప్పుడు మాత్రము నన్నుఁ బోనిమ్ము.”

ఇంతలో దూరమున మనుష్యుల పాదధ్వని వినవచ్చెను. పరిష్యరక్షిత కొలనులోనికి వచ్చుచున్నదని గ్రహించి తిష్యరక్ష నాగరిలతాంతరమున దాఁగి, “నీవు పాపివి!” యని కుణాలునితోఁ జెప్పెను.

౪

పరిష్యరక్షిత అంతఃపురమునకు వచ్చి మహామాత్యుఁడగు బ్రాహ్మణునితో “నేఁ డేమి జరిగెను?” అనెను.

బ్రాహ్మణుఁడు మొదటినుండి తుదివఱకు నన్నియు సవిస్తరముగాఁ జెప్పెను. తిష్యరక్ష బౌద్ధధర్మము స్వీకరించినదని విని పట్టపుదేవి యులికిపడి “ఏమీ! ఇదివఱలో నామె

కుడిభుజమే నాకు!" అని యాశ్చర్యపడెను.

"ఆమెయభిప్రాయ మేమో గ్రహింపలే కున్నాను."

"అట్లయిన నెవ్వరిని విశ్వసింపరాదు. మనవ్యవహారము మిక్కిలి రహస్యముగా నుంచవలెను. మీసలహాయేమి?

"నిస్సంశయముగా నది రహస్యముగా నుండఁగలదు. కాని యీ విధర్మప్రవాహము నెట్లడ్డగింపఁగలము?"

"స్వయముగా దేవతలే రక్షింతురు! కాని మన మిప్పుడేమి చేసినచో లోకుల మనసు మరలింపఁ గలము?"

"బ్రాహ్మణులు ప్రబలులై యున్న తావులం దెల్లఁ దిరుగుబాటులు జరుగును."

"కాని మహారాజు నెదిరించి మనఁగ నిలువఁగలరు?

అందఱు నేకీభవించినచో నే మగునో చెప్పఁజాలము. కాని యందఱు నొక్కటగుదు రనునాశ లేదు. బ్రాహ్మణానా మనేకత్వమ్!"

"తిరుగఁబాటుతో మాకు సంబంధము లేదు. ఇంక నే యుపాయమైనఁ జెప్పఁగలరా?"

"ఒక్కయుపాయ మున్నది. మనము బోధివృక్షమును దాచిపెట్టుదము. మఱునాఁడు విధర్ములవృక్షమును దేవతలు నాశము చేసినా రని చాటింపింతము."

"అది యెట్లు చేయుదురు? అచ్చట రక్షకభటు లెందఱో యుందురే."

"ఆభారము నాది. వృక్ష మదృశ్య మయినప్పుడు లోకు

లు దేవతలమహాత్మ్యమునే కొనియాడుదురు. ధర్మేతరులనో
టి నమ్మ వలదు!"

ఇందులకుభయులు సమ్మతించిరి. వారు వెడలిపోవు న
ప్పటికిం బ్రొద్దెక్కువ లేదు. ఈసంగతు లెవరికిని వెలిబు
చ్చరా దనియు నవసర మైనపక్షమున నగరములోం గలక
లము చేయవలె ననియుం దమ కిరువురకుం దప్ప నావిషయ
ములు రెండవచెవిని బడరాదనియు వారు ప్రతిజ్ఞలు చేసిరి.

తిష్యరక్షిత తెరలచాటునం గూరుచుండి సర్వ మాకర్ణిం
చెను; ఆకర్ణించి చాలసే పూరకుండెను. ఇకం బనిలే దని
యొకమాఱును, అభీష్టసిద్ధి కానవచ్చుచు ప్రాణములతో నేమి
ప్రయోజన మని యింకొకమాఱు ననుకొని తిష్యరక్షిత కు
ణాలుని విషయమై తలపోయుచుండ పరిష్యరక్షితయు బ్రా
హ్మణుడును జెప్పుకొన్నమాటలు జ్ఞప్తికిరా నామె యిట్లు
భావించెను; "ఈపరిష్యరక్షితను వెడలఁగొట్టించి పట్టమహి
షి నగుట కెంతో యవకాశము లభించినది. పట్టపుదేవి నగు
దునేని యీమెకంటెను నాకెక్కువయధికారము లభించునుం
కుణాలుని వశపఱచుకొనుట కెక్కువ వీలుండును. మహారా
జ్ఞి నగుదునేని నేనే మహారాజును, నేనే మహామంత్రిని నేనే
సేనాధిపతి నగుదును. అప్పు డొకపర్యాయము చూచెదను!"

పరిష్య రక్షితను రూపు మాపి తానే పట్టమహిషి కావ
లె ననెడి సంకల్పము కలిగిన పిమ్మటం గొంతకాలము కుణా
లుని మఱచిపోవలెనని యామె నిర్ధారణ చేసికొనెను.

## ౫

కునాలుఁ డింటికిఁ జని చూచునప్పటికి కాంచనమాల "నాథా, యెచ్చట నుంటిరి! నాథా, యెచ్చట నుంటిరి!" అని ఘోషముతోఁ బలవరించెను.

కునాలుఁడు శయ్యప్రక్క నిలుచుండి వెన్నెలలో కాంచనమాలవంకఁ జూచుచుండెను. ఆమె యులికిపడినది. ఏదో దుస్స్వప్నము గాంచి భయవిహ్వలయు జ్ఞానశూన్యయు నగుచున్నట్లు కాంచనమాల పడియుండెను. కునాలుఁడు మెల్లమెల్లన శయ్యపైఁ గూర్చుండి మృదులముగ నామెమేను నిమురుచు "కాంచనా, యిదిగో వచ్చినాను!" అని యామె నూరడించెను.

కాంచనమాల రోదనము చేయుచు "అ దేమి! మీకుఁ జూపిన కనఁబడుట లేదా? అంధత్వము వచ్చినదా!" యనెను.

"ఏమి కాంచనా! నాకు దివ్యచక్షువు లున్నవా?" యని కునాలుఁ డనెను.

"లేవు లేవు! మీరు అంధు లయినారు. సంశయ మేల? నడువుఁడు. ఇక్కడఁ బని లేదు. ఇదిగో భగవంతుఁడు పిలుచుచున్నాఁడు. కట్టుపట్టుకొన్నాను: మీరు నావెంట మెల్లగా రండు. మెలమెల్లగా! కాకున్నఁ బడిపోదురు!" అని కాంచనమాల కలవరించెను.

ఆమె మిక్కిలి బాధపడుచున్నట్లు కునాలుఁడు గ్రహించెను. అనావృతమైన యామె శ్వేతవక్షము తరంగిత మగు

గంగాసలిలమువలె లేచుచుఁ బడుచుండెను. అతఁడు మెల్లమెల్లన నామెశరీరము చేతితో నిమురుచు నామెను శాంతపఱచుచుండెను. ఆమెను నిద్ర లేపుట కతనికి సాహసము కలుగలేదు. పగలంతయు నుత్కంఠముగా నుండుటచే నిద్రించుచున్నది. లేపనేల" యని యతఁడు భావించెను.

చాలసేపు శరీరము నిమురుచున్నను స్వప్నపీడ తొలఁగిపోలేదు. మాటిమాటికిని కాంచనమాల నిట్టూర్పులు విడుచుచుండెను. ఆమె వక్షఃస్థల మింకను లేచుచుఁ బడుచుండెను. అంత నతఁడు మెల్లమెల్లన నతిమృదుస్వరమున నామెను నిద్రలేపెను.

మెలఁకువ వచ్చినప్పటికి కాంచనమాల యించుక నేదదేఱినది; కాని యింకను రొప్పుచు "నాథా, యేమిచేసితిని? ఇది నాలుగవజాములో స్వప్నమా?" యని భర్తతో ననెను.

"కానిమ్ము. మరల నిద్రపొమ్ము." అని కుణాలుఁడు చెప్పెను. ఇరువురును శయనించిరి. మిగుల బడలియుండుటచే నతనికిఁ దేలికగా నిద్రపట్టినది. ఎంతయత్నించినను కాంచనమాలకుమాత్రము నిద్ర పట్టినది కాదు. ఆమెమనస్సు వికల మయ్యెను. మాటిమాటికి నామె ప్రాణనాథుని స్పృశించుచుండెను. భయోద్వేగములు మాత్రము తొలఁగిపోలేదు.

## పరిచ్ఛేదము ౬

### ౧

తెల్లవారుటకు పూర్వమే తిష్యరక్ష శయనసౌధమునకు మరలి వచ్చి చూడగ మహారాజింకను నిద్రించుచుండెను. ఆమె నిద్రపోవక అశోకుని పాదసన్నిధిని కూర్చుండి పాదము లొత్తుచు వీవనతో విసరుచుండెను. రాత్రి యంతయు మేల్కొనియుండుటచే నడుమనడుమ నిద్ర వచ్చుచున్నను నతికష్టమున నిరోధించుచు మహారాజు నిద్రలేచుటకై వేచి యుండెను. ఒకసారి యామె కొంగుపఱచుకొని యతని పాదప్రాంతమున శయనించెను.

కొంచెము సేపటికి లేచి యామె మరల నతనికి వీవన వేయఁ జొచ్చెను. సూర్యోదయమునకుఁ గొంచెము ముందు మహారాజు మేల్కొని చూచునప్పటికి నామె పాదము లొత్తుచుండెను. "నీ వింకను నిద్రపోలేదా?" యని యతఁడు లేచి యనెను.

"లేదు దేవా! నిద్రపోవుటకు వీలు లేకపోయినది."

"అది యేమి? దేవుని జూచివచ్చితివా?"

"లేదు దేవా! దేవుని జూడఁ బోలేదు."

"నీవు వెలుపలికిఁ బోవుట చూచినానే."

"వెళ్ళినానే కాని వెంటనే మరలి రా వలసి వచ్చినది."

"రావలసి వచ్చినదా? ఇచ్ఛాపూర్వకముగా రాలేదా?"

"లేదు. అ దంతయుఁ జెప్పి లాభము లేదు" అని తిష్య

రక్ష వేగముగా లేచి మహారాజునకు ముఖప్రక్షాళనార్థము పరిమళోదకము గొనివచ్చి యిచ్చెను.

మహారాజేదో స్వప్నము గాంచి మిగుల నుద్విగ్నుఁ డయ్యెను. తిష్యరక్షమాటలు వినుటచే నాతని మనస్సు మఱింత వ్యాకులమయ్యెను. అంత నతఁడు స్నానము చేయుచున్న పని యాఁపుమని "నీ వేల తిరిగి రా వలసివచ్చినదో చెప్పవా?" యనెను.

"ఏ మున్నది? భయము వేసినది."

"కాదు కాదు. నీవు దాచుచున్నావు. ఏమి జరిగినదో సరిగాఁ జెప్పు."

"ఏమియు లే" దని తిష్యరక్ష ముఖప్రక్షాళన ప్రయత్నములు చేయఁజొచ్చెను.

"నీవు చెప్పక తప్ప" దని మహారా జనెను.

"దేవా, నాకు నిజముగా భయము వేసినది!"

"ఎవరివలన?"

"దేవా, నేను సౌధమునుండి బయలుదేఱి యుద్యానము దాఁటితినో లేదో, నికుంజమధ్యమున నెవరో కూర్చుండి మాటలాడుచుండుట కనుఁగొంటిని. అప్పుడు నాకుఁ జాల భయము వేసినది. ఇద్దఱు ముగ్గురు రీసౌధమువైపు వచ్చుచుండిరి. దేవర వా రొంటిగా శయనించి యుండిరని నాకు భయము పుట్టినది. వేఱొక మార్గమున మరలి రా వలెనని యత్నించితిని. కాని ప్రతిమార్గమువెంట నొకరిద్దఱు మను

ష్యు లుండిరి. ఇంతలో నాకాలిక్రింద నెవరో కాలు నలిపి నవి. వానినపుడు జల్లనివస్తు వేదో తగిలినది. మెల్లగా నెత్తి చూచునప్పటి కది చుఱుకత్తి! అప్పుడు నాకు సంశయము విడిపోయినది. భయముచేఁ బ్రాణము పోవునట్లయ్యెను. మహారాజుగారు నామందిరమున నొంటరిగ శయనించి యున్నారేయని దిగులుపడితిని.”

“ఏకుఱ్ఱాకులనపుడు చుఱుకత్తియా ?”

“అది కనఁబడుటచే మఱింత భయము వేసినది. అంతట నాకుఁ దైర్యము పుట్టినది. మహారాజుగా రొంటరిగా శయనించి యున్నారు. కావున నే నెచ్చటికిని బోవుట తగదని నిశ్చయించుకొంటిని.”

“వారికి నామీఁదఁ గోప మున్నదని నీకుఁ దోఁచినదా?”

“ఎట్లు తెలియును దేవా? నే నాకత్తిసహాయమున సాహసించి యుద్యానమువైపునకుఁ బరుగెత్తుకొని వచ్చితిని. ఈమందిరమువైపు వచ్చుచున్నవారు నావెంటఁబడిరి. ఎగఊపిరితోఁ బరుగెత్తి వచ్చి ద్వారమును మూసి గడియవేసితిని. మీకాచప్పుడు వినఁబడలేదా?”

మహారాజు స్వప్నములో నేదోచప్పుడు వినియుండుటచే “ఝుణత్కారము విన్నాను. ఏదో డడడడమన్నట్లు వినఁబడిన” దనెను.

“అట్లయిన గడియ వేసినచప్పుడు మీరు విన్నారు.”

మహారా జన్యమనస్కుఁడై “కావచ్చు” ననెను. తిష్యరక్ష

మరల ముఖప్రక్షాళనార్థము యత్నించుచుండ మహారాజామె నడ్డగించి "ఎవ రెవరువచ్చినారో గుర్తింపఁగలవా?" అని ప్రశ్నచేసెను.

"గుర్తింప లేను దేవా!"

"వా రెట్టివేషములు ధరించియున్నారు?"

"మొదలే నాకు భయము వేసినది. పైన వెన్నెలలోనంతయు మిలమిలలాడినది."

"కొంద ఱిటునటు నుండఁ జూచితివిగదా, యెవ రేదిక్కునుండి వచ్చిరో జ్ఞప్తి యున్నదా?"

"ఒకరిద్దఱు మనుష్యులు కాంచనకుటీరమువైపునుండివచ్చిరి."

"కాంచనకుటీరమువైపునుండియా? సంగతి యేమియో తెలియుట లేదు. కానిమ్ము. నీవు నన్నుఁ బిలువలే దేమి?"

"తలుపు వేయగానే కొంతసేపటివఱకు మతిభ్రంశమైయునట్లయినది. తరువాత మిమ్ము లేపుదమనివచ్చిచూడ మీరు నిద్రించుచుంటిరి. సౌధములో నెట్టిశబ్దము వినరాలేదు. మిమ్ము నిద్ర లేపవలెనని యొకమాఱు తలఁచితిని, మేడ మీఁదికిఁ బోయి చూచివత్తమని యింకొకసారి తలఁచితిని. విశేష మేమైన నున్నయెడల దేవరవారిని నిద్రలేప నెంచితిని."

"మేడమీఁదికి వెళ్ళినావా? ఏమి కనఁబడినది?"

"ఏమియుఁ గనఁబడ లేదు."

"ఎంతమాత్రము కనఁబడలేదా? ఇందఱు మనుష్యు లె

చ్చటికిఁ బోయినారో ?"

"ఒక రిద్దఱు పట్టపుదేవి సౌధము ప్రక్కగాఁ బోయిరి.

"సౌధము ప్రక్కగా? బోయిరా? కాక సౌధము లోనికే పోయిరా?"

"సరిగాఁ జెప్పలేను. అంతవఱకు వెళ్ళినారు. తరువాత వారు నాకుఁ గనఁబడ లేదు."

"చాల సందేహము కలుగుచున్నది."

"సనియభిప్రాయము నాకు బోధపడ లేదు. రాత్రినాకు జాల భయము వేసినది!"

నిట్టూర్పు విడిచి "భయపడుటకుఁ దగినంత కారణము న్న"దని మహారాజు సత్వరముగా రాధగుప్తుని బిలిపించి యావిషయమును బరిశోధించి కనుఁగొనవలసిన దని యాజ్ఞాపించి ప్రాతఃకృత్యములు నిర్వర్తించుటకై లేవఁబోయెను.

ఆవిషయమై తనసౌధమునం దేమియుఁ జేయవలదని తిష్యరక్ష ప్రార్థించినను మహారాజామెమాట వినలేదు.

౨

మహారాజావలికిఁ బోవగనే రాధగుప్తుఁడు సైగచేసి రాణి నేకాంత ప్రదేశమునకుఁ గొనిపోయి "మరలఁ జమత్కారము చేయుచున్నారా యేమి?" యనియడిగెను.

"తెలియ లేదా?"

"ఎవరిని నాశనము చేయుటకు?"

"మొదట పరిష్యరక్షితను. తరువాతఁ జేత నయిన యెడల

కుణాలుని."

"పరిష్యరక్షిత చేసిన యపరాధ మేమి? పట్టపుదేవి యన్న మీకుఁ గిట్టదా?"

"కంటకమును లాగివేయుట మంచిది"

"కుణాలుని మీఁదఁ గోప మేల?"

"బౌద్ధధర్మ మవలంబించినది మొదలు మహారాజున కాతనిమీఁద మిక్కిలి భక్తి. అతని నెచ్చటికయినను బంపివేయుట యవసరము."

"తక్షశిలకుఁ గాదుగద?"

"బింబిసారుని వంశములో నేబిడ్డ తక్షశిలాజలము త్రాగలేదు?"

"తెలిసినది. అట్లయిన కుణాలుఁడు పరిష్యరక్షితను బట్టుకొని యున్నాఁడా?

"అంతే కాదు.

౩

రాధగుప్తుఁడు కొంతసేపటికి మరలి వచ్చి "ఏమియు సరిగాఁ జెప్పజాల కున్నా"నని మహారాజునకు విన్నవించెను.

మిగుల నౌత్సుక్యముతో నతని కోసము నిరీక్షించు చున్న మహారాజీమాటలు వినునప్పటికి కోపము చెంది "నావాకిటనే యెవరో గుమిగూడగా మీ రది యేమియుఁ గనిపెట్టలేకపోయినారు. మీవంటి మంత్రులతో రాజ్యముచేయుట కేవలము విడంబన!" మని పలికెను.

రాధగుప్తుఁ డవసతవదనుఁడై యిట్లనెను; నే నేమియుఁ గ
నుఁగొనలేకపోయినాను. కాని దేవరవారు శీఘ్రముగాఁ
గనుఁగొనఁగలరు. గుమిగూడినవారిలోఁ గొందఱు కాంచ
నకుటీరమువైపునకును గొందఱు మహారాజ్ఞి సౌధమువై
పునకు జనిరి. తమరు వారిలో నెవరినైనను బిలిపించి యడి
గినయెడల ననేకవిషయములు బయలుపడును. వీరి సేవకులను
కంచుకులను విడివిడిగా నడిగినాను. వా రేమియుఁ జెప్పినా
రు కారు."

"చెప్పలేదా! శిరశ్ఛేదము చేయించెదను.—కంచుకీ, నీవు
శీఘ్రముగాఁ జని మహారాజుగారు మిమ్ము స్మరించినారని
పరిష్యరక్షితాదేవితోడను కుణాలుని తోడను జెప్పుము."
కంచుకి తోడనే వెడలిపోయెను. మహారాజు మంత్రి తిష్య
రక్ష—ముగ్వురును గతరాత్రమున జరిగిన విషయమును జ
ర్చింపఁజొచ్చిరి. తిష్యరక్షయు మంత్రియు మహారాజుభయ
ము నౌత్సుక్యమును వృద్ధి చేయుచుండిరి.

## ౪

కంచుకి కాంచనకుటీరమును బ్రవేశించినంతనే బల్లి పలికె
ను. వామభాగమునఁ గాకి కాకా యని వికటముగా నఱచె
ను. చీఁకుగ్రద్ద నోటినుండి రక్తబిందువులు కాంచనమాల
యెదుట రాలెను. ఉత్కంఠతో నామె కుణాలునికొఱకు న
లువంకలఁ జూచెను. తొలుత గంచుకి కానఁబడినంతనే యా

మె కతఁడు యమభటునివలెఁ దోఁచెను. తత్తరపాటుతో నామె భర్తపార్శ్వమున కరిగి నిలిచెను. మహారాజు నాదేశము విను నప్పటి కామె కళవళపాటు వృద్ధినొందెను. కుణాలునకును గొంచెముత్కంఠ జనించినది. అతఁడు మహారాజసన్నిధికిఁ బోవుచుండ కాంచనమాల తదేకదృష్టితో నాతని మార్గమువెంటఁ జూచుచుండెను. భర్త చూపుమేర దాఁటిన నంతనే యామె చదికిలఁబడి యిఁక హృదయేశ్వరుని జూడనేమో యని భావించెను.

౫

కుణాలుఁడు మహారాజు సన్నిధిని నిలిచెను. అతనియుత్కంఠను మ్లానముఖమును నుపలక్షించి మహారాజుసైత మాశ్చర్యపడి భీతి నొంది కుమారునితో నిట్లనెను. ‘‘కడచినరాత్రి కొందఱు రహస్యముగా నేదోయభిప్రాయముతో నీసౌధోద్యానమున గుమిగూడిరి. వారి చేతులలో శస్త్రాదు లుండెను. కొందఱు నీ మందిరమువైపుగాఁ జనిరి. వా రెవరో నీకుఁ దెలియునా?’’

‘‘తెలియదు. తిష్యరక్షా దేవిగారి నికుంజమునకు వచ్చితిని.’’

‘‘నీవా!’’

‘‘చిత్తము.’’

‘‘సశస్త్రముగానా?’’

‘‘అభినయమునకుఁ బోయిన నేపథ్యముతో.

‘‘అట్లయిన నీ వభినయాంతమున నింటికిఁ బోలేదా?’’

‘‘వెళ్ళినాను. అచ్చట జాబు కనఁబడినది.

‘‘ఎవరు వ్రాసినది?’’

‘‘పరిష్యరక్షితా దేవి వ్రాసినవలె నుండెను.’’

‘‘పరిష్యరక్షితదా?’’

‘‘చిత్తము’’

‘‘నే ననుమానించినట్లే యయినది. మహారాజ్ఞికి సద్ధర్మమన్న ద్వేష’మని మంత్రి పలికెను.

ఇంతలోఁ బ్రతీహారి పరిష్యరక్షితా దేవియాగమనమును నివేదించెను. సముచితాదరముతో మహారాజామెను దన ప్రక్కఁ గూర్చుండఁ బెట్టుకొని ‘‘దేవీ, నీవు నిన్న కుణాలుని తిష్యరక్షాకుంజమునకు రమ్మంటివా’’ యని యడిగెను.

‘‘కుణాలునా? రమ్మన లేదు.’’

మహారాజు మంత్రివంకఁ జూచి కుణాలునితో ‘‘ఆయుత్తర మేది!’’ యనెను.

‘‘ఎచ్చటఁ బడవైచితినో గుర్తు లేదు.’’

‘‘ఇట్టిమాటలిచ్చటఁ బనికి రావు. నిజము చెప్పవలెను. మహారాజుగారి శయన గృహము దగ్గఱకు శస్త్రపాణులెవరో వచ్చిరి. అందులకు నిదర్శనము మీ జాబు! అని మంత్రి యనెను.

మహారాజిట్లనెను; ‘‘ఇదేమి కుణాలా! నీ తండ్రిని వధింప వచ్చిన వారిని నేఁడు విచారింతును. అందులకు నీవు పట్టుదలతో నిదర్శనములు సంగ్రహించుటకు పూటుగా వారిని

గమ్మి వేయఁ జూచుచున్నావే!''
"నేను దోషిని గాను. ఎవ్వరిని గమ్మఁ జూచుట లేదు. కాని తమరు నామాటలు సంపూర్ణముగా నవధరింపలేదు."
"ఈవిషయములో నీ కిం కేమిమాట లుండునో నాకుఁ దెలియకున్నది."
"జరిగినసంగతి యిది. వ్రాసిత పరిష్యరక్షితా దేవి దయినను జాబు పంపినది తిష్యరక్షా దేవి."
"అందులకుఁ బ్రమాణ మే?" మని మంత్రి యనెను.
"తిష్యరక్ష కుంజగృహములో నిన్న నాతో నన్నది."
"అట్లయిన తిష్యరక్షను నికుంజగృహములోఁ జూచితివా ?"
"అవును."
మహారా జసహ్యాభావముతో తిష్యరక్షవంకఁ జూచెను. ఆ మెవదనము వివర్ణ మయ్యెను. పిమ్మట నామె "దేవా, భయముచేఁ దమ కంతయుఁ జెప్పనైతిని. నేను బౌద్ధదేవాయతనములను సందర్శించుటకుఁ గుమారుని వెంటఁ బెట్టుకొని పోవ నెంచి రమ్మని జాబుపంపితిని," అని విన్నవించెను.
"పరిష్యరక్షిత యక్షరములు నీ కెక్కడనుండి వచ్చిన?" వని మహారాజు ప్రశ్న చేసెను.
అమ్లానముఖముతో నామె " పరిష్యరక్షితా దేవి చేవ్రాలు చేయక చిరునామా వ్రాయక యిట్టియుత్తరము లనేక మిత్రులకుఁ బంపుచుండు'' ననెను.
ఇక సహింపఁ జాలక పరిష్యరక్షిత యిట్లనెను. "మహారా

జా, ఇఁక నే నిచ్చట నుండఁజాలను. తమరు బౌద్ధధర్మము స్వీకరించినప్పటినుండియు నాపై నిష్టములేనట్లు కనఁబడు చున్నారు. దుర్మార్గు లీతరుణమున నాకుఁ గీడు చేయ యత్నించినారు. దేవా, మీరు ప్రభువులు. బాగుగా విచారింపుఁడు. నే నిఁక నిచ్చట నుండి లాభము లేదు." ఇట్లు చెప్పి యామె తొట్రుపాటుతో నచ్చటినుండి వెడలిపోయెను.

కుణాలునకుఁ గొంతసేపటి వఱకు నోట మాట రాలేదు. మహారాజు మంత్రి తిష్యరక్షయు నించుకసేపు పరస్పరము ముఖములు చూచుకొనిరి. "ఇంకను విచారింపవలసినది కల" దని రాణి పలికెను.

పరిష్యరక్షితయే తన ప్రాణనాశమునకై ప్రయత్నించిన దని మహారాజు సంపూర్ణముగా నమ్మెను. ఈయభిప్రాయ మతఁడు వెలిఁబుచ్చుటకుఁ బూర్వమే నగరమున విప్లవము ప్రతిల్లెను. అందఱును దొట్రుపడుచు మేడపై కెక్కి చూచుసరికి కుక్కుటారామము భస్మీభూత మగుచుండెను. మహారాజు భార్యవంకఁ జూచి "అది వారిపని కాదా?" యనెను.

"విచారణలోఁ దేలినట్లు చేయుఁడు. నామాటలతోఁ బని లేదు!" అని యామె బదులు చెప్పెను.

మహారాజు క్రోధాంధుఁడై మంత్రివంకఁ జూచి పరిష్యరక్షితా మందిర మరికట్ట వలసినదని యాజ్ఞాపించి విప్లవము నణచుటకై నగరాభిముఖముగాఁ జనెను.

౬

ఇట్టి మహా కోలాహల సమయమున తిష్యరక్ష యూరకుండలేదు. ఆమె పురుషవేషము ధరించి పది పదునిద్దఱు సైనికులను వెంటఁ గొని కలకలము జరుగు చోటికి సూటిగాఁ బోయి యందుండి తప్పించుకొని మహామాత్య బ్రాహ్మణు నియిల్లు చేరెను. అమాత్యుఁడు కల్లోలమును జూచి యేమియు నెఱుఁగనట్లు నిశ్చింతముగా గృహములోఁ గూర్చుండి యుండెను. తిష్యరక్ష జనసంఘమును భేదించుకొని పోయి యాకస్మికముగా నాతనియింటఁ జొచ్చెను. మహామాత్యుఁడు నిర్ఘాంత పోవ నామె యిట్లనెను. "పురుషవేషముతో నున్నాను, గాని నేను బురుషుఁడను గాను. నాపేరు తిష్యరక్ష. నానికుంజమునఁ గూర్చుండి మీరు పట్టమహిషియుఁ జేసిన యాలోచనము విన్నాను. మీరే యీకల్లోలమునకుఁ గారకు లని మహారాజునకు విన్నవించితిని. మీరు జీవింపఁ దలఁచితిరేని వృక్ష మెచ్చట నున్నదో చూపుఁడు. చూపినపక్షమున మిమ్ము నిరాతంకముగా నగరము వెలుపలకుఁ బంపెదను. అట్లు కాకున్న నిప్పుడే మహారాజుగారిసన్నిధికిఁ గొంపోయెదను. మీకుఁ బ్రాణదండనము విధింపఁజేసెదను. బౌద్ధ పరిభువు రాజ్యములో బ్రాహ్మణు లేక నవధ్యులు కారని తెలిసికొండు!"

బ్రాహ్మణుఁడు భయముతో ననుమానముతో మతి గోల్పోయి, యొక్క మాటయుఁ బలుకలేక యామెకు సురంగము

ఖము చూపెను. తిష్యరక్ష యతనిని వెంటఁగొని నగరము వెలుపలి కరిగెను. అచట బ్రాహ్మణుఁడు నోరు తెఱచెను. పరిష్యరక్షిత కెట్టిగతి పట్టునో యతని కామె తెలియఁ జెప్పెను. అతఁడు చేతులు జోడించి నానావిధముల నామెను స్తుతించుచు బతిమాలుకొని తన కృతజ్ఞతను వెల్లడిచేసెను. తిష్యరక్ష యతనిని గంగాతీరమునకుఁ గొనిపోయి "నేఁటి నుండి నేను జెప్పినప్రకారము చేయునట్లు ప్రమాణము చేయు" మని నిర్బంధించెను.

ప్రమాణము చేయించినతరువాత తిష్యరక్ష మరల నిట్లనెను "కుంజరకర్ణా, మీరు, తక్షశిలకుఁ బొండు. మీతో నాకుఁ జాల పని యున్నది. నాప్రాణము లిచ్చి యైనను మీకు మేలు చేసెదను."

కుంజరకర్ణుఁడు నమస్కారము చేసి వెడలిపోయెను. తిష్యరక్ష తనసౌధమున కరిగెను.

## ౨

అశోక కుణాలుల పరాక్రమముచే విప్లవము వెంటనే శమించెను. కుక్కుటారామమున నగ్ని నిర్వాపిత మయ్యెను. కాని బౌద్ధధర్మమున కెట్టి యపయశము వాటిల్లినది! బ్రాహ్మణుల దేవతలు జాగరూకులై యున్నారా యేమి? నాస్తికుల వటివృక్షమును దేవతలు హరించినారా! మఱి వృక్షము దొరకనది కాదు. అశోకుఁడు కుణాలుఁడు ఉపగుప్తుఁడు మొదలగు

బౌద్ధప్రముఖులెల్ల విషణ్ణవదనులై భోజనము చేయకుండ వృక్షముకొఱకు విచారించుచుండిరి. ఇచట తిష్యరక్ష మహారాజువృత్తాంతము దెలిసికొన మాటిమాటికిని సేవకుల నంపు చుండెను. మహారాజు రాలేదు. తిష్యరక్ష అశోకుని దర్శింపవలెనని ప్రార్థనము దెలిపెను. అతఁడు సమ్మతించి బోధి మంటపమునకుఁ బోయి యచట నున్నవారివలెఁ దానునైత ము విచారపడుచుండెను. కొంతసేపటికి తిష్యరక్ష యిట్లనెను: "దేవా, భగవంతుఁడగు అనలోకితేశ్వరుఁడు మనయెడఁ బ్రసన్నుఁడయినాఁడు. బుద్ధిబలముచే నే నిప్పుడే యా బోధివృక్షమును దెప్పించఁగలను. తమరు కొంతసేపు మహాయతనమున కేచ్చటికైనను బోయి ధ్యానము చేయుచుండుఁడు." తిష్యరక్ష బోధివృక్ష మున్నచోటఁ గూర్చుండి తీవ్రముగా ధ్యానము చేయఁజొచ్చెను. క్రమక్రమముగా బోధి వృక్షము పైకి లేవఁదొడఁగెను. భూమిని బ్రద్దలుచేసికొని యాబోధిద్రుమము తల పైకిఁజూపసాగెను. తిష్యరక్షకు జయ మగుఁగాక యని నలువంకలనుండి ధ్వనులుప్పతిల్లెను. వృక్షము యథాస్థానమున సంస్థాపిత మయ్యెను. దేవతారాధకుల ముఖములు వాడిపోయెను. బౌద్ధులజయధ్వనులు మిన్నుముట్టెను.

అశోకమహారాజు మొదలగుబౌద్ధు లెల్లరు తిష్యరక్షచుట్టును నిలిచి జయధ్వనులు చేయసాగిరి. ఉపగుప్తుడాసభలోనే తిష్యరక్షను "అర్హాతను" జేయఁ బ్రస్తావించెను. ఆమెకు

"అర్హాతీ" దీక్ష నొసంగినపిమ్మట నతఁడు తనజీవితము ధన్య మయిన దెంచెను. అంతట మంత్రి సద్ధర్మవిద్వేషిణియుఁ బతిప్రాణ హరణోద్యోగినియుఁ గుటిలవర్తనయు నగు పరి ష్యరక్షితకు మాఱుగా బుద్ధిమతియుఁ బతిపరాయణయు ధర్మానురాగిణియు రమణీకుల లలామయు నగు తిష్యరక్ష ను మహారాజ్ఞిగాఁ జేయుప్రస్తావన తెచ్చెను. తత్క్షణమే యామెను బట్టమహిషిని జేయ స్థిరమయ్యెను. అంతే కాక పరిష్యరక్షితను పౌండ్రవర్ధనదుర్గములో బందిగమునం దుంచ వలెనని తీర్మానము జరిగెను.

౨

ఈవిజయోల్లాసములో తిష్యరక్ష మాటిమాటికిని కుణాలుని పై దృష్టి సారించుచుండెను. కుణాలునిముఖమున నాజుగు వ్వసయే యాయనాదరభావమే యావిరక్తియే యామెకు గోచ రించుచుండెను.

౩

తరువాత నాలుగైదు దినముల కామె కభిషేకము జరిగెను. తక్కినరాణులవలె తిష్యరక్ష యంతఃపురమునకు మాత్రము యజమానురాలు కాదు; సామ్రాజ్యమున కధీశ్వరి యయిన ది. ఏయాజ్ఞయయినను అశోకతిష్యరక్షులపేర నడచుచుండె ను. ఆలోచనాసభయందుఁగూడ నామె మహారాజున కెడ మప్రక్కఁ గూరుచుండును. ద్రోహ మేమియు జరుగకుం

డుటకై అశోకుఁడు తిష్యరక్షాదేవి మందిరమున నివసించుచుండెను. కాఁబట్టి యప్పటినుండియు తిష్యరక్షయే మగధ సామ్రాజ్యమున కధీశ్వరి యయినది. అంతఃపురజనులును మంత్రులును సభాసదులును నామె యాజ్ఞానువర్తులై మెలఁగుచుండిరి. ఇంత యేల! అశోకమహారాజు సయితమామె మాటచొప్పున నడచుచుండెను. "నాయభీష్టమెల్ల సంసిద్ధి నొందు" నని తిష్యరక్ష నిరంతరము తలపోయుచుండెను.

---

## పరిచ్ఛేదము ౭

### ౧

తిష్యరక్షకు రాజ్యాభిషేక మయినది మొదలుకొని బౌద్ధధర్మము మిక్కిలి వృద్ధి నొందఁజొచ్చెను. ప్రాసాదమున ధర్మసభ నొకదానిని స్థాపించిరి. భగవాన్ ఉపగుప్తుఁడు తత్సభాపతి. అశోకమహారాజు కుణాలుఁడు తిష్యరక్ష రాధగుప్తుఁడు నందలి ప్రధానసభ్యులు, బోధివృక్ష మలౌకికముగా నావిర్భవించినదాదిగా బౌద్ధులు తిష్యరక్షను బుద్ధిమతి యనిపిలుచుచుండిరి. ఆసభలో మహారాజు ఉపగుప్తుఁడును దమతమ యుపాసనలనుగూర్చి సమీక్షచేయుచుందురు. రాజకార్యములనుగురించి మంత్రి కళవళపడుచుండును. కావున బౌద్ధధర్మప్రచారభారము తిష్యరక్షమీఁదను కుణాలునిమీఁదను బడినది. రాజకార్యములం దామె యతనికిఁ దోడ్పడుచు

మహారాజుతోఁగాని ఉపగుప్తునితోఁగాని యతని కభిప్రాయ ము కలిగినయెడల నతనిపక్షము సమర్థించుచుండును. దేని చే సద్ధర్మవృద్ధి యగునో దేనిచే దేశ దేశాంతరములకు "అర్హతులు" ప్రేరితు లగుదురో దేనిచే భిక్షుకులసంఖ్య హెచ్చునో దేనిచే శ్రమణులవిద్య యున్నతిఁ గాంచునో దేనిచే శ్రావకులసంఖ్య పెంపు చెందునో దేనిచే మఠము లెక్కువగాస్థాపింపఁబడునో యెద్దానిచే చైత్యములు ప్రతిష్ఠి తము లగునో బుద్ధదేవుని విహారభూమి యెల్లరును దగినట్లు సన్మానింతురో వాత్సరిక విజ్ఞానసభ జయప్రద మగునో మానవచికిత్సాలయములు పశుచికిత్సాలయములు సంస్థాపిం పఁబడునో బుద్ధదేవుని నఖకేశాదులు సురక్షితము లగునో "దంతయాత్రా" ద్యుత్సవములు పెంపొందునో "త్రిశరణ ముల" యెడ లోకులమనస్సు లాకృష్టము లగునో యాయా విషయములం దెల్ల నామె ప్రయత్నపూర్వకముగా కునాలు నకుఁ దోడ్పడుచుండును. తనయెడ నతనికి గౌరవము జనిం చువిషయములం దెంతమాత్ర మామె లోపము చేయుట లేదు.

## ౨

కాంచనమాల యాసభకు వచ్చి కునాలునితో తిష్యరక్షతో ఉపగుప్తునితో సంప్రతించుచుండును. ఆమె యంతఃపురము లో నెక్కువగా నివసింపక రేయుంబవళ్ళు నగరమున సా మాన్యుల యొద్దఁ బరిభ్రమించుచు భిక్షుకులకు భిక్షములి

చ్చుచు బాలకులతోను బాలికలతోను గలిసి సద్ధర్మము వై
పునకు వారిమనస్సు లాకర్షించుచుండెను. ఉపగుప్తుఁడు కు
క్కుటారామమునఁ గూరుచుండి బౌద్ధమండలి కుపదేశము
లొసఁగునాఁడు కాంచనమాల యవహితచిత్తయై భక్తితో
నాయుపదేశము లాకర్షించుచు మఱునాఁడు ప్రతిపేటయం
దు గృహమునందు గోష్ఠమునందు నాయుపదేశవాక్యముల
ను వెదఁ జల్లుచుండును. సద్ధర్మ విద్వేషు లగువారియెడ
నామె కెంతమాత్రము కోపము లేదు. వారికి శ్రమ కలిగిన
ను వ్యాధివచ్చినను నన్నము దొరక కున్నను జేత నయిన
ట్లామె వారికి సాయము చేయుచుండును. అనుదిన మామె
స్వహస్తములతో "సంఘమునకు" భోజనము పెట్టుచుండు
ను. శోకము వ్యాధి వైరము నుండు తావుల కామె చనుచుం
డును. ఎవ్వరినిగూడ నామె పరులనుగా భావింపదు. ఇతరు
లు సుఖపడుచున్న నామెకు సుఖము, ఇతరులు దుఃఖించుచు
న్న నామెకు దుఃఖము. ధర్మాలయములు చికిత్సాశాలలు
మఠాయతనములు మొదలగు ప్రదేశములందామె సంచ
రించుచుండును. వే యేల? ఇతరులకోసమై యామె యొక
విధముగాఁ దన్ను మఱచిపోయినది! మహారాజు కాంచన
మాల ధర్మప్రవర్తనమునకు మిక్కిలి సంతసించి యామె
యెప్పు డేది కోరిన నది నిరాటంకముగా నిచ్చుచుండ వల
సిన దని కోశాధ్యక్షుల కాజ్ఞాపించెను.

కాంచనమాల నడవడిని జూచి కుణాలుఁడు మహారాజు తొ

దకు తిష్యరక్షయు నగరమునఁ బరిభ్రమించుచు నాధివ్యాధి పీడితుల దుఃఖములను నివారించుచుండిరి. లోకులు కాంచనమాల దేవత యని భావించుచుండిరి. నూతనధర్మప్రచారమునకును నార్తుల దుఃఖనివారణము కొఱకును బౌమరజనులకు నిర్వాణదానమునకును భగవాన్ శ్రీ అవలోకితేశ్వరుఁడు రమణీరూపమున పాటలీపుత్రనగరమున విచరించుచున్నాఁడని జనులు చెప్పుకొనుచుండిరి.

3

ఈవిధముగా సంవత్సరము గడచిపోయినది. మగధమహాసామ్రాజ్యమున నెన్నో మార్పులు జరిగినవి. పాటలీపుత్రనగరమున సద్ధర్మ విరోధు లెవ్వరును లేరు. ఎల్లరు మార్పు చెందిరి గాని తిష్యరక్షాదేవి మనస్సుమాత్రము మాఱినది కాదు. కుణాలుని మోహపెట్టుటకై యామె యనేక ప్రయత్నములు చేసినది. అతఁడు చలింపలేదు. కావున నామె తనమనస్సులోనిమాట యతనియెదుట బహిరంగము చేయ సాహసింపలేదు. ఈవిధమున వత్సరము దాఁటిపోయినది. తిష్యరక్ష వివిధప్రకారముల నిభృతప్రదేశములం దతనిని గలిసికొన యత్నించుచుండెను. ఒకప్పుడు తనమందిరమునను వేఱొకప్పుడు కాంచనకుటీరమందును మఱియొకప్పుడు గంగాతీరమునను నొక్కసారి యుద్యాన మధ్యమునను నొక్కపర్యాయము కుంజవనమునను నతనితో సంభా

పింప యత్నించును గాని నోరు విప్పి యేమియుఁ జెప్పఁ గలుగునది కాదు. ఒకనాఁడుమాత్ర మేకాంతప్రదేశమున కుణాలుని జూచి తిష్యరక్ష జాగరూకతతో నలుదిక్కులు విలోకించి "కుణాలా, నీ కేమియు బోధపడుట లేదా? యనెను.

కాంచనమాల సమకూర్చు సంఘభోజనమునకుఁ దాను బోవలసియుండు నని కుణాలుఁ డచ్చటినుండి లేచి వెడలిపోయెను. అదిమొద లామెతో నిర్జనప్రదేశమున సంభాషించుట కతఁ డెన్నఁడు నమ్మతింపలేదు. ఒకవేళ నామె యొంటిగాఁ గనఁబడినచోఁ దోడనే యతఁడు వేఱొకమార్గమునఁ జనుచుండును.

## ౪

ఒకనాఁడు తిష్యరక్ష అశోకుని ప్రాచీనసౌధమున ననగాఁ గేళీగృహమునకుఁ జని యం దొకగది వివిధవిలాస సామగ్రులతో నలంకరించెను. పచ్చిశృంగారపుబొమ్మలు గోడలపై వ్రేలాడఁ దీసి వివిధవేష భూషలతో నామె యలంకరించుకొని బహిరంగమైన యాజ్ఞాపత్రికద్వారా కుణాలుని బిలువనంపెను. మహారాజునానతి నుల్లఘించుటకు వీలు లేదు, కావున నతఁ డచ్చటికిఁ బోవ బయలు దేఱెను.

కాంచనమాల యెచ్చటినుండియో యాకస్మికముగా వచ్చి త్రోవ కడ్డము నిలిచి "నేఁడు మీరెచ్చటికిని బోవల" దని

బలవంతపెట్టెను. ఆజ్ఞాపత్రిక నతఁడు చూపినను కాంచనమాల లక్ష్యము చేయలేదు. నేఁ డామె గట్టి పట్టు పట్టినది. ఏలనో యేమో యామె చెప్పలేదు. అంత యాందోలన మెందులకో యామెకే తెలియలేదు. అతఁడు వెడలిపోవుట కామె యేవిధముగను సమ్మతింపలేదు. కాంచనమాల నతఁడు బహువిధముల మఱసింపఁ జూచి తుద కిట్లనెను. "కాంచనా, కుక్కుటారామమునకుఁ బశ్చిమమున మామిడితోఁట నడుమనున్న పుష్కరిణీతీరమందు రోగగ్రస్తుఁడై యున్న బ్రాహ్మణబాలుఁ డీపాటికి మరణించి యుండును. అంతిమ దశలో వానిని జూచి వచ్చి చాలసే పయినది. నీవు పోయి వానితండ్రి నూఱడింపుము."

"సరే. మీ రెచ్చటఁ గూడ నెక్కువసే పుండక శీఘ్రముగా నచ్చటికి రండు!" అని కాంచనమాల బయలు వెడలెను.

౫

కుణాలుని శిరస్సు మీఁదుగాఁ గాకి కాకా యని యఱచెను. అతఁడు కొంచెము దూరము పోయెనో లేదో క్రూర సర్ప మాతనిత్రోవ కడ్డముగాఁ బ్రాకిపోయినది. దూరముగా నక్కకూఁతలు వినఁబడినవి. కుణాలుఁడు నిర్దిష్టస్థానము చేరి చూడగా నంతఃపురము విలాసద్రవ్య పూరితమై యుండెను.

గదినుండి గదికిఁ బోయి తుదకతఁడు శయ్యాగృహద్వార
ము చేరెను. అడుగడుగున కాంతనికి గోడలమీఁద జుగుప్సా
కరములగు చిత్రపటములే కానవచ్చుచుండెను. పడకటింటి
గోడలమీఁద నతి వ్రీడాకరము లగు పటములు వ్రేలు
చుండెను. నాల్గు గోడలకును బరస్పరాభిముఖముగా
నాల్గుపెద్దయద్దము లున్నవి. అర్థనగ్నయై విచిత్రాంగ
రాగవిభూషితయై తిష్యరక్ష గదిలో నడుమ శయ్యపై విరా
జిల్లుచున్నది. ఆయద్దములలో నామె ప్రతిబింబము లనంత
ములై యర్థనగ్నయగు తిష్యరక్షను బ్రదర్శించుచున్నవి.
కుణాలుఁడదిచూచి మరలెను. తోడనే తిష్యరక్ష యాస్థ
తిలోనే పరుగెత్తిపోయి యతని పాదసన్నిధిని వ్రాలెను;
వాలి తన యనాచ్ఛాదిత హృదయము నతని చరణముల
పై నుంచి పాదద్వంద్వము గట్టిగాఁ బట్టుకొనెను. సర్పము
కాలికిఁ జుట్టుకొన్నచో మనజుఁ డెట్లు పాదము విదలించు
నో యట్లే యతఁడు తిష్యరక్ష నావలికిఁ ద్రోసిపుచ్చి వెను
దిరిగి చూడక గంభీరగమనమున నచ్చటినుండి వెడలి పో
యెను.

## ౬

చాల సేపటికి తిష్యరక్షకుఁ దెలివి వచ్చినది. కాలభుజంగినివలె
లేచి నిలిచి యామె శిరోజములు సవరించుకొని కుణాలుఁడు
చన్నమార్గమువంకఁ దీవ్రముగాఁ జూచుచు "ఆకన్నులు!—"
అని నేలపైఁబడి దొరలెను.

"ఆకన్నులో కానొకనాఁడు ఈలాగున కాలిక్రింద నలఁగఁ ద్రొక్కఁబోయినయెడల తిష్యరక్షను గాను!" అని యామె తలపోసెను.

---

## పరిచ్ఛేదము. ౮

### ౧

తిష్యరక్ష మరల నెప్పటియట్లయ్యెను. ఎట్టి యాందోళనము జరుగనట్లే యామె ప్రవర్తించుచుండెను. పూర్వమువలెనే జరిగెడి ధర్మసభాధివేశనములలో నామె కుణాలుని పక్షము సమర్థించుచుండెను. బౌద్ధధర్మము కొఱ కామె యుత్సాహముతోఁ బని చేయుచుండెను. పైకి మృదువుగాఁ గానఁబడుచున్నను హృదయమునఁ బరాభవాగ్ని రవులుచునే యుండెను. ఈవిధముగాఁ గొన్నిమాసములు గడచినవి. ఒకనాఁడు తక్షశిలానగరమునుండి యశ్వారోహియగు దూతయొకఁడరుదెంచి యారాష్ట్రమున రాజద్రోహము చెలరేగిన దనియు కుంజరకర్ణుఁడు ద్రోహుల సేనానాయకుఁడనియు విన్నవించెను. ఉత్తర మందగానే మహారాజు మిక్కిలి వ్యాకులపడెను; పాటలీపుత్రనగరమున యుద్ధ ప్రయత్నములు జరుగఁ జొచ్చెను. కమ్మరదుకాణములలో రేయుంబవళ్ళు ఝణఝణ శబ్దములు వినవచ్చుచుండెను. లెక్కలేకుండ ఖడ్గ

ములు తయారయి యాయుధాగారము లందు గుప్తము లగుచుండెను. పెద్దపెద్ద వెదుళ్ళుకోసి ధనుస్సులు చేయుచుండిరి. మత్తేభములను బంపవలసినదని మణిపుర పౌండ్రవర్ధన అంగ ఓఢ్ర విదేహాసమతట ప్రభృతి ప్రదేశముల సామంతప్రభువులకు మహారాజాజ్ఞాపత్రికలు పంపినాఁడు. వేలకొలఁది గుఱ్ఱములతో నశ్వశాలలు నిండిపోవుచుండెను. వడ్రంగు లహర్నిశము రథములు చేయుచుండిరి. పాటలీపుత్రము రేవునకు వచ్చు నాహారపదార్థము లన్నియు యుద్ధముకొఱకుఁ గొనిరి. నానాదేశవీరులు, సైనికులుగను సేనాధికారులుగను నియోజితులగుచుండిరి. నగరోపకంఠమున భటు లెల్లరు సర్వదాయుద్ధాభ్యాసము చేయుచుండిరి. యుద్ధోపకరణములను గొనిపోవుటకై శకటములను నౌకలను గొనివచ్చుచుండిరి. దేశమునఁ గోలాహలము ప్రబలెను. ఇఁక తక్షశిలానగరమునుండి దూతపై దూత యరుదెంచుచుండెను. ఎవరినోట విన్నను నొకటే సంగతి. నేఁడీగ్రామము పోయినది. మఱునాఁడాగ్రామము పోయినది. ఈప్రాంతము రాజద్రోహులచేఁ జిక్కినది. బ్రాహ్మణులు క్షత్రియులు నిచ్చట సమావేశ మయినారు. బౌద్ధదేవాయతనముల నన్నిటి నున్మూలించి బ్రాహ్మణులు యజ్ఞములలో బౌద్ధులను బలియిచ్చుచుండిరి” అని తెలియవచ్చుచుండెను.

పాటలీపుత్రమున నంతయు సంసిద్ధమయినది. సేనానిని నిర్ణయించుటకై మహారాజు మంత్రులను బ్రధాన పారిషదుల

ను బిలిపించి సభ చేసెను. ప్రియపుత్రుఁడగు కుణాలుని బంపుటకు మహారాజు సమ్మతింప లేదు. మంత్రి చూపిన యుక్తులు మాత్రమెవ్వరును ఖండింపలేకపోయిరి. అతఁడుచెప్పినవి నాలుగు. ఒకటి: కుణాలుఁడు బౌద్ధధర్మావలంబి యగుటచే స్వధర్మమును బరిత్యజింపఁడు. రెండు: అతఁడు మహావీరుఁడు. మూఁడు: కష్టసహిష్ణువు; పైగా దేశమంతయు సంచరించినవాఁడు నాలుగు: వివిధజాతులనుండి సమావేశమైన సైనికులు కుణాలున కనుగతులు.

ఈకారణములచే కుణాలుని రాజద్రోహము నణచుటకై సేనానాయకునిగా నెన్నుకొనిరి. ఉపాయాంతరము లేకుండుటచే మహారాజుగూడఁ గుమారునకు సర్వసైన్యాధిపత్యమిచ్చెను. తన మన స్సెల భయోద్విగ్న మయ్యెనో అశోకుఁడు తెలిసికొన లేకపోయినాఁడు.

౨

సేనాధిపతియై కుణాలుఁడు మిక్కిలి సంతోషించెను. త్రిరత్నములకై జీవము లర్పించినను నష్టములేదని యతఁడు భావించెను. ఈయవకాశమునఁ బాపాత్మురాలగు తిష్యరక్షా కుతంత్రములనుండి కొంతకాలము తాను బరిత్రాణము నొందవచ్చుననియుఁ దలపోసెను. కాంచనమాల మాటు జ్ఞప్తికి రాగా నామెను విడిచి పోవలసి వచ్చెనే యని యతఁడు మనోవ్యథ నొందెను. “మహత్కార్యములకొఱకుఁ దనజీవిత

ము ధారపోయుచున్న కాంచన నన్ను నివారించుననితోఁచదు. నే నుండకపోవుటచే నామెకుఁ గష్టముగా నుండునని యే నాపను లన్నియు నామెపైఁ బెట్టి బోవుచున్నాను. తనకు మిగుల నిష్టమగు పనులు చేయుచున్నపక్షమున నామె నన్ను గొంతకాలము మఱవవచ్చు" నని కుణాలుఁడు తలపోసెను.

౩

భర్త సేనాధిపతి యయ్యె నని విన్నప్పుడు కాంచనమాలకు హర్షవిషాదములు కలిగెను. పశ్చిమ ప్రదేశమున నించుమించుగా నశించు చున్న సద్ధర్మమును దన భర్త యుద్ధరించునని తలఁచి యామె మిక్కిలి సంతసించెను. పుష్పములు పోయిన నాఁటిసంగతియును కంచుకి వచ్చిననాఁటి యనిమిత్తములను దలపోసి యేయమంగళము కలుగు నని భయపడుచుండెనో యా యమంగళ మీసారి తప్పక సంఘటిల్లు నని యామె విచారపడెను. కాని భర్త చేయుచున్న మహాత్కార్యము సడ్డగించుట కామె మన సొప్పలేదు. పో వలదని యొకసారియైన నామె యనఁజాలకుండెను. వీడుకోలు సమయమున కాంచనమాల యుత్సాహవాక్యములు చెప్పి శ్రీ బుద్ధభగవానుఁడు యశోధరాదేవిని విడిచిపోవు సమయమున పాడిన కీర్తన పాడి యిట్లనెను:—

"శ్రీభగవానుఁడు యశోధరాదేవిని విడిచిపోయి లోకహితము కొఱకుఁ గృతకృత్యుఁ డయినట్లే మీరును సద్ధర్మము

నుద్ధరించుపట్లఁ గృతకృత్యులు కంము ! నే నిట్లే యుందును. ఒక్కసారి గయాశీర్షపర్వతము మీఁదికిఁ బోయి నాయనగారి ని జూచివచ్చుటకు మాత్రము నాకనుజ్ఞ దయచేయవలెను." తనభార్యధైర్యస్థైర్యములకు కుణాలుఁ డాశ్చర్య మొంది మనఃపూర్వకముగా నంగీకరించినా నని పలికెను. మోమున మందహాసముతోను నేత్రములందు బాష్పములతోడను న తఁ డశ్వము నధిరోహించి సేనాముఖమునకుఁ జనెను. కాంచనమాల యతనివంకఁ జూడఁ జొచ్చెను. ఇంతలో నతఁడు నయనపథమునుండి దాఁటిపోవగా కాంచనమాల శీఘ్రగమనమున నాపర్వతశిఖర మారోహించెను.

యుద్ధనౌకలు కదలి చనుచుండెను. నావికులు సైనికులు నేకగ్రీవముగా సింహనాదములు చేయుచు అశోకుని యశోగీతములను బాడుచుండిరి. వారల జయధ్వనితో నౌకాదండములధ్వని సమ్మిశ్రమై యొకానొకవిధమైన ప్రశాంతగంభీరశబ్దము బయలువెడలుచుండెను. ఆనినాదము నాకర్ణించినప్పుడు భీరువులకుఁ గూడ సాహస ముదయించును. నౌకాస్తంభములపై శ్వేతనీల పీతహరిదాది వర్ణములు గల పతాకలనుకూల వాయుతాడితములై "వైరులారా, పాఱిపొండు. మమ్ముఁ బ్రతిఘటింపఁజాల !" రనుచుండెనో యన్నట్లు కదలుచుండెను.

కాంచనమాల మఱియొకవైపు వీక్షించెను. తక్షశిలానగరమునకుఁ బోవుమార్గమున నిండి సైనికులు నడచుచుండిరి.

పదాతులు భేరీ పటహాది రణవాద్యముల... మ్రోగించుచుఁ బోవుచుండిరి. ఒకచో మహామేఘఖండముల చాడ్పున మదేభములు ధూళిపటలావృతములై భూమ్యాకాశముల కైక్యము సంపాదించుచుండెను. నడుమ నడుమ నాశ్వికుల శాణితఖడ్గములు సాంద్రమేఘమున క్షీణవిద్యుల్లేఖలవలె సూర్యకాంతిలోఁ దళతళలాడుచుండెను. మఱియొకచో నశ్వములు నీలపీతాది పృష్ఠావరణములతో విలసిల్లుచుఁ జనుచుండెను. వానిపై మహాకాయు లగు వీరులు ఝణఝణధ్వానము చేయు కవచాదులు ధరించి "నేను ముందు పోయెద, నేను ముందుపోయెద"నని గుఱ్ఱముల పిఱుఁదులు చఱచుచుండిరి. ఆమె యింకొకవైపు చూచినది. రథములు దిఙ్మండలమువఱకు వ్యాపించినవి. రథ్యములు వాయువుకన్న నెక్కుడవేగముగాఁ బరుగెత్తుచున్నట్లుండెను. పతాక లెగురుచుండ సారథిచోదితములై దిగంతవ్యాప్తము లగు నారథములనడుమ నభ్రభేది యగుధ్వజముతోఁ జీనాంశుకపతాకతో మహారథ మొకటి కానవచ్చినది. ఆస్యందన స్వర్ణకింకిణులు సూర్యరశ్మిలోఁ బ్రతిఫలించుచుండెను. చూడగనే యది కుశాలునిరథ మని కాంచనమాల తెలిసికొనెను. అంతట నామె నల్వంకల విలోకించినది. వాయు వనుకూలముగను నాకాశము నిర్మేఘముగను నున్నది. బారులు దీర్చి బలాకలు నభోమండలమునఁ జనుచుండెను. చాతకములు మదభరమునఁ గూజితములు సేయుచుండెను. వీని యన్నిటినడుమ నొక్క

టిమాత్రే మామె కుత్కంఠ కలిగించెను. కుణాలుని రథధ్వజముమీఁద శకుని యొకటి తిరుగుచుండుట యామె కంట బడినది.

---

## పరిచ్ఛేదము. ౯

### ౧

కుణాలుని దండయాత్రావృత్తాంతము తక్షశిలానగరమునకుఁ దెలియవచ్చెను. ఆ కాలమున తక్షశిలా ప్రదేశ మించుమించుగా నేఁటి ఢిల్లీనగరమువఱకును వ్యాపించియుండెను. ఎదురు తిరిగిన బ్రాహ్మణులు క్షత్రియులును మహా కోలాహలము చేసి యుద్ధసన్నద్ధులు కాఁజొచ్చిరి. కుంజర కర్ణుఁడు బ్రాహ్మణుఁడు అతనికి బౌద్ధధర్మ మన్న మహాద్వేషము. కావున బౌద్ధద్వేషు లెల్లరు నతనికిఁ దోడ్పడసాగిరి. "మీరు తిరుగఁ దీసిన ప్రదేశమును రాజసైన్యములు చేరగానే ప్రజలు వారితోఁ గలియవచ్చును. కావున రాజుదేశమునందే యుద్ధ మారంభించుట యుక్త"మని వారతని కాలోచనము చెప్పిరి.

పిమ్మట రణదర్పులగు బ్రాహ్మణులు క్షత్రియులును లక్షమంది తక్షశిలాప్రదేశపు సరిహద్దు దాఁటి అశోకుని రాష్ట్రము లోనికిఁ బోయి కుణాలునికై యెదురు చూచుచుండిరి.

స్కంధావారమునకు సల్వంకలఁ గంటకములు త్రివ్వి సైన్యము వానినడుమ విడిసెను. అల్పసంఖ్యాకులు మహావీరులు నగు సైనికులతో కుణాలుఁడు వెనుకభాగమున శిబిరము స్థాపించెనని వారి కొకనాఁ డాకస్మికముగా వార్త వచ్చెను. కుణాలుఁడు చారులవలన శత్రువుల శిబిరవిశేషములు సవిస్తరముగాఁ దెలిసికొని శీఘ్రముగాఁ గొన్ని యశ్వములను గజములను నిజసైన్యమునుండి వేఱుపఱచి పంపివేసెను. వారు చాలదూరము చుట్టు తిరిగి శత్రుశిబిరమున కించుమించుగా నైదుక్రోశముల వెనుక నిర్విఘ్నముగా విడిసిరి. శత్రువుల వస్తు సామగ్రుల నడ్డగింప వలదని కుణాలుఁడు తన భటుల కాజ్ఞాపించెను. "ప్రజలు మనవారు కావున వారి కెట్టిక్లేశమును కలిగింప రాదు. నిరంతరము జాగరూకులై యుండుఁడు. మీ రెచ్చట నున్నదియు శత్రుల కేమాత్రము తెలియరాదు" అనియు బోధించెను.

యుద్ధమునకై వేగిరపడక యతఁ డాకసమును బరీక్షించుచు సేనాపతు లడిగినప్పుడు కొంచె మాగుదమని చెప్పుచుండెను. ఎవ్వరును మాఱుమాటాడుటకు సాహసింపలేదు. సైనికులు మాత్రము కాలవిలంబన మగుచున్న కొలఁది నధీరులు కాఁజొచ్చిరి. ఒకనాఁటియుదయమున నాకస్మికముగా నతఁడు "నేఁడే యుద్ధ"మని యాజ్ఞాపించెను. మహోత్సాహముతో సైనికులు రణరంగమునకు దిగిరి

౨

కుణాలుని సేనలో నెక్కువభాగము తమ కభిముఖముగా నున్నదని తెలిసికొని శత్రువులు సమ్ముఖయుద్ధము తప్పక జరుగునని యూహించిరి. కాని యాకస్మికముగా కుణాలుఁ డొకనాఁడు వెనుకవైపునుండి యాశ్విక పదాతిక సైన్యములతోఁ దమ్ము ముట్టడించుటచే వారించుక రిచ్చవడి తమ సేనను రెండుభాగములు చేసిరి. అం దొకభాగము కుణాలునితో యుద్ధము చేయఁబోయెను. రెండవభాగము శిబిరమున సిద్ధముగా నుండెను.

విద్రోహులు మించుమించుగా నెల్లరు బ్రాహ్మణులు క్షత్రియులు. వా రెన్నఁడు యుద్ధరంగము విడిచిపోయిన వారు కారు. వారు మహోత్సాహముతోఁ దాకినప్పుడు బౌద్ధబలము వికావిక యయిపోవఁ జొచ్చెను, కుణాలుఁడు రథమునుండి నిజసైన్యముల కుత్సాహము పురికొల్పుచు "ధర్మమే జయించును. బ్రాహ్మణు లెన్నఁడును జయింప" రని ధ్రువముగాఁ బలుకఁదొడఁగెను.

అయినను కుణాలుని సేన క్షత్రియులయెదుట నిలువ లేకపోయెను. వందల కొలఁది బౌద్ధులు యుద్ధమున నిహతు లగుచుండిరి. కొంతసేపటికి దైవము బౌద్ధులకుఁ దోడ్పడినది. ఆకస్మికముగాఁ బశ్చిమదిక్కున గాఢమగు చీఁకటి వ్యాపించినది. పడమటిగాలివలన ధూళి యాకసమున కెగసి నల్వంకలఁ జీకట్లను విస్తరిల్లఁ జేసెను. కుణాలుని సేన తూర్పుము

ఖముగా నుండుట చేతను బ్రాహ్మణసైన్యము పశ్చిమాభిముఖముగా నుండుటచేతను ధూళి బ్రాహ్మణసేన నంధీభూతము చేసెను. కుణాలుఁ డంతట నుచ్చైస్స్వరమున "సైనికులారా, బౌద్ధులారా, ధర్మము మనకనుకూలము! శ్రీబుద్ధభగవానుఁడు మన కనుకూలుఁడు! దుమారము తొలఁగిపోవులోఁగా ధర్మద్వేషులను ధ్వంసముచేయుఁ!" డని యుత్సాహవాక్యములు పలికెను.

చండమారుతముతోఁ ఖడ్గఝణాత్కారము వైరిసైన్యములకు భయోత్పాతము గావించెను. కన్నులు కనఁబడకపోవుటచే స్వపరభేదము లేక భ్రమవలన బ్రాహ్మణసైనికులు తమ్మఁదామే ఖండించుకొనఁ జొచ్చిరి. కుంజరకర్ణున కిది యేమియుఁ దెలియలేదు. కుణాలుఁడు మాత్రము బాగుగా గ్రహించి నేర్పుతోఁ దనసేనను భద్రముగా నుంచుకొనెను. దుమారము తగ్గిపోవుచున్న కొలఁదిని క్షత్రియులు తమభ్రాంతిని దెలిసికొనుచుండిరి. అప్పుడు బౌద్ధసేన సింహనాదము చేసి శత్రువులపైఁ బడెను. తనసైన్యము పలాయనోన్ముఖమయిన దనియు నిరోధించుట యసాధ్యమనియు కుంజరకర్ణుఁడు గ్రహించెను. అప్పుడు బ్రాహ్మణ శిబిరమున భయముచేఁ గలకలము పుట్టెను. ఈతరుణమునఁ బలాయనపరులగు శత్రుసైనికులకును వారిశిబిరమునకును నడుమఁ జొచ్చి కుణాలుఁ డశ్వికదళమును వారిని వెన్నాడఁ బంపెను.

ఎక్కువ ప్రాణినాశము లేకుండ జయము కలుగుటచే కుణా
లుని యుల్లాసమునకు మేర లేదు. కుణాలుని తరువాత సనే
కులు దుహూరముతో విజయములు గాంచిరి. కాని ప్రాణి
హింసను నివారించుటకై యొక్కఁడుకూడ దాని నాశ్రయిం
పలేదు. యవనులు ముసల్మానులు పడమటినుండి వచ్చి బ
హుపర్యాయములు జయము గాంచిరి. అయినను దుహూర
ము వారి కనుకూలముగను హిందువులకుఁ బ్రతికూలముగ
ను నున్న ట్లందఱకును దెలిసినదే. అట్లు కానిచో బుద్ధిబల
మునను భుజబలమునను బ్రాహ్మణులకును క్షత్రియులకును
సాటి వచ్చువా రెవరు ?

## ౩

క్రమముగాఁ జీఁకటి వ్యాపించినది. రెండువైపులను శత్రు
సైన్యము లుండఁ గతిపయసైనికులతో నున్న కుణాలునకు
భయము కలుగలేదు. రాత్రియంతయు మేల్కొని స్వయము
గా నతఁడు పహరా యిచ్చుచు "ధర్మము జయించును! స
త్యము జయించును! శ్రీ బుద్ధదేవునకు జయ!" మని వారల
కుత్సాహము పురికొల్పుచుండెను.

వెనుకటిరోజు కుణాలుఁడు పంపిన యాశ్వికసైన్యము శత్రు
సేనలోని ప్రధానపురుషులఁ గొందఱను జెఱపట్టి తెల్లవా
ఱగనే తీసికొని వచ్చెను. వారినడుమ విశ్వాసఘాతకుఁ
డగు కుంజరకర్ణుని గాంచి కుణాలుఁడేమో యడుగఁ దలఁచె

ను. కాని యతఁడు స్వతంత్రుఁడుగా నున్నట్లు ప్రవర్తించుటచేత కుణాలుఁ డతని నొకానొక సేనాధిపతి వశము చేసి మహారాజున కీయుద్ధవార్త నంపి కుంజర కర్ణుని విషయమై ప్రభువు నానతి కెదురు చూచుచుండెను.

౪

మఱునాఁ డుదయము ముందువెనుకలనుండి యాక్రాంతమై హిందూశిబిరము ఛిన్నభిన్నమై పోయెను. అంతట కుణాలుఁడు తక్షశిలారాష్ట్రాభిముఖముగాఁ బ్రస్థానభేరి మ్రోగించెను.

మరల నారాజ్యమున శాంతి సంస్థాపిత మయినది. భగ్నమఠముల నన్నిటి నుద్ధరించి యతఁడు అర్హతులను భిక్షుకులను శ్రమణులను శ్రావకులను మరల నిర్భయముగా బౌద్ధధర్మమును పాలింపఁజొచ్చెను. విజయము లభింపగనే కుణాలుఁడు శాత్రవుల శస్త్రాదులను లాగుకొని వారిని క్షమించెను. యుద్ధమును గూర్చి కాంచనమాల కతఁడు లిఖించిన యుత్తరము నందుఁ దుదిభాగమున నిట్లుండెను. "యుద్ధములో నెందఱో హిందువులకు బౌద్ధులకు గాయములు తగిలినవి. వారికిఁ జాల కష్టము కలిగినది. రోగులకు శుశ్రూష చేయించుచున్నమాట సత్యమే. కాని సేవిచ్చుట నున్నపక్షమునఁ ద్వరలో వారల కారోగ్యము కలుగు నని తోఁచుచున్నది."

## పరిచ్ఛేదము ౧౦

### ౧

కుణాలుని లేఖ రాజధానికి సకాలమునఁ జేరెను. కాని అశోకుఁ డప్పుడు ప్రభువు కాఁడు. కుణాలుఁడు దండయాత్రకుఁ బోయినది మొదలు ప్రియపుత్రునితోడి వియోగమువలనను విచారమువలనను అశోకుని మానస మత్యంత వ్యాకుల మయ్యెను. కుమారున కేదియో యనిష్టము కలుగునని యతని మన సెల్లప్పుడు బాధపడుచుండెను. ఆబాధచే నతఁ డధీరుఁ డయ్యెను. స్వయముగా యుద్ధభూమికిఁ బోవలెనని యతని కొకసారి బుద్ధిపొడమినది. కాని తనయుద్దేశ్య మెవ్వరికి నాతఁడు వెలిఁబుచ్చ లేదు. మిక్కిలి యాలోచించుచుండుటచే నతని కతిమూత్రవ్యాధి జనించెను. ప్రథమావస్థయందు మిగుల భయంకరముగా నుండుట యీవ్యాధిలక్షణము. కుణాలుఁడు వెడలిపోయిన పది పండ్రెండుదినములకే అశోకున కిట్టి యవస్థ సంఘటిల్లినది.

పాటలీపుత్రనగరమందలి ప్రధానవైద్యు లుద్దండమైన వైద్యగ్రంథములు సంగ్రహించి రాజసౌధమున రాత్రిందివములు పీఠము వేసియుండిరి. పత్త్రములు లతలు ఫలములు మూలములు గుల్మములు అస్థులు మొదలగు వానితో రాజభవనమునం దొకగది నిండిపోయెను. పంచవార్షిక సభయం దేడెనిమిది పర్యాయములు పారితోషికములు గొన్న మహావై

ద్యులు స్వయముగా నౌషధములు తైలములు ఆసవములు వటికలు సిద్ధము చేయఁ జొచ్చిరి. పాటలీపుత్రమందలి ప్రధానబౌద్ధమఠములకుఁ బ్రత్యహ ముపహారాదులు పంపుచుండిరి. భగవాన్ ఉపగుప్తుఁడు ప్రాసాదమున కేతెంచి మహారాజున కైహికాముష్మిక సుఖములు కలుగుటకై సదా ధ్యానము చేయుచుండెను.

పరిచర్యలో నేమాత్రము లోపము జరిగినను మహారాజు ప్రాణరక్షణము దుస్సాధ్య మగునని యెల్లరుఁ దలఁచుచుండిరి. ఔషధసేవనము పథ్యప్రదానము నిద్రాభంగము శయ్యాగృహపరిష్కారము మొదలగు వానియం దెట్టిలోపము జరిగినను బరిత్రాణ ముండదు. తగిన పరిచారిక యంతఃపురమున దొరకుట దుర్లభము. ఇంచుమించుగా అశోకుని భార్య లందఱకును బ్రాహ్మణపక్షపాతము; కావున వారిని నమ్ముటకు వీలులేదు. బౌద్ధమతావలంబినులయినవారికి శుశ్రూష తెలియదు. కాంచనమాల రోగులకుఁ దల్లివలె నుపచారము చేయఁగలదు. కాని కోడలికన్న భార్య శుశ్రూష చేసిన మేలు. కావున నాభారము తిష్యరక్షపైఁ బడెను. పవ లనక రేయి యనక యాహారము లేక విశ్రాంతి లేక తిష్యరక్ష మహారాజునకు సేవ చేయఁ జొచ్చెను. రెండుమూఁడుదినములలో అశోకుఁడు లేచుటకుఁగూడ నోపిక లేనంత దుర్బలుఁ డయ్యెను. అప్పుడు తిష్యరక్షయే యతనికిఁ గాలుసేతు లయినది. ఆమె చేయు సేవకు విరామము లేదు. కొం

చెము విశ్రాంతి యుండునేని యామె భర్తసన్నిధిని గూర్చుండి వివిధకథలు చెప్పుచుండును. ఒక్కసారి మైన వెలుపలికిఁ జనక నతని కొడలు పట్టుచు విసరుచుండును. దాసీజనము నామె దగ్గఱకు రా నిచ్చుట లేదు. అశోకుఁడు నిద్రించునప్పు డతనిప్రక్కఁ గూరుచుండి మక్షికాదులను దోలుచు నిద్రాభంగము కాకుండఁ జూచుచుండును. తాను మాత్రము కన్ను మూయదు. లోనికిఁ బోయినచో వెలుపలికి రా బుద్ధి పొడమకుండునట్లు గ్రీష్మసమయమున నామె సౌధమును సుశీతలముగా నుంచుచుండెను.

౨

ఇట్లు నిరంతరసపర్యలచే అశోకుని శరీరము స్వస్థము కాఁ జొచ్చెను. అన్నపానములు వేళకు లే కుండుటచేఁ గృశించినను తిష్యరక్ష శుశ్రూషయందు విరతిఁ జెందుట లేదు. క్రమముగా నామె కొకవిధమగు శిరోవేదన జన్మించెను. అప్పుడప్పుడామె యొక్కొకజాము తెలియక పడియుండును. ఆరోగ్య మొంది తిష్యరక్షయవస్థ చూచి మహారాజు మిక్కిలి బెగడొంది యామె కుపచారములు చేయించి స్వాస్థ్యము చేకూర్చెను. తరువాత నతఁడామెను వర మడుగుమనెను. స్వతంత్రముగా మగధసామ్రాజ్యము నొక్క సంవత్సరము తాను బరిపాలించున ట్లనుగ్రహింప నామె వరము వేడెను. అశోకుఁడు సమ్మతించెను. తిష్యరక్షాదేవి మ

హారాజ్ఞిగా సంవత్సరము పరిపాలించునని సల్వాంకలఁ జాటిం
చిరి. ఆసంవత్సరకాలము తిష్యరక్షా దేవి యాజ్ఞానువర్తులై
యుండుఁ డని సామంత గ్రామిక సేనాపతి మహామాత్యుల
కాజ్ఞాపత్రము లంపఁ బడెను. ఆవత్సరము సామాన్యునివలె
అశోకుఁడు నివసించునుఁట.

## 3

నూతన ప్రభుత్వము ప్రారంభమయిన రెండవనాఁడు కుణా
లుని దూత వచ్చి యతనికి జయము కలిగిన దనియు కుంజ
రకర్ణుఁడు బందీ యయ్యెననియు మహారాజ్ఞికి విన్నవించెను.
తిష్యరక్షా దేవి జయవార్త నగరమునఁ బ్రకటించి యుత్సవ
ము చేయ నాజ్ఞాపించెను. రాత్రివేళ నగరమంతయు దీప
మాలాలంకృత మయ్యెను. బౌద్ధమందిరములందు నేఁడు మ
హోత్సవము ! అశోకుఁ డీ వార్త విని తన సౌధమును దీపశ్రే
ణితో స్వయముగా నలంకరించెను.

తిష్యరక్ష యస్వస్థముగా నున్నప్పుడు అశోకుఁడు కాంచన
మాలయు నగరములోనికిఁ బోవుచు నచటి దీనులకు దరిద్రు
లకును గలుగు కష్టములు తొలఁగించుచుండిరి. ఈయుత్సవ
దినమున కాంచనమాల కాంచనకుటీరమును దీపమాలల
తో నలంకరించెను.

అప్పుడు యుద్ధభూమినుండి వచ్చినదూత యామెకు జాబి
చ్చెను. ఉత్తరములోని చివరసంగతులు చదువుకొని యామె

మిక్కిలి క్లేశము చెందెను. తక్షశిలా నగరమునకుఁ జనుట కనుమతి కీ యామె తిష్యరక్షను బ్రార్థించెను. స్త్రీలు యుద్ధభూమికిఁ బోవుట యనుచితమను మిషపెట్టి తిష్యరక్ష యామె ప్రార్థనమును ద్రోసివేసెను. పోవుటకు వీలు లేక కాంచనమాల విషణ్ణచిత్త యయ్యెను. కొన్నిరోజులవఱకు నామెముఖమున నుల్లాసము కానరాలేదు. కుణాలుని కడ నుండి జయవార్తయు నిశ్చలప్రేమ వాక్యములును దెలియ వచ్చుటచే కాంచనమాల సంతోషించెను.

తిష్యరక్షాదేవి సింహాసన మధిష్ఠించినవార్త యథాకాలమున కుణాలునకుఁ దెలిసెను; తాను యుద్ధమున విజయమొందినందుల కామె మిక్కిలి యానందించినట్లు మఱునాఁడు తెలియవచ్చెను. కుంజరకర్ణుని విడువవలసినదని తరువాత నుత్తరువు వచ్చెను. "కుంజరకర్ణుఁడు నన్ను మాతగా నెంచును. కావున నతనిని తక్షశిలకుఁ బ్రభువుగా నియమించితిని. నీ వాతని యధీనమున నుండు" మని తిష్యరక్షాదేవి కుణాలున కాజ్ఞాపత్రిక నంపెను. ఈవృత్తాంతము తెలిసికొని యతని యధీనమందలి సేనాపతు లెల్లరు మిగుల నసంతుష్టిఁ జెంది నీచవంశోద్భవ యగు నామె యానతి నుల్లంఘింపుఁడని కుణాలునికిఁ జెప్పిరి. "ఏది యెట్లయినను నామె మహారాజ్ఞి. ఆమె యానతి శిరసావహింపవలసినదే" యని యతఁడు బదులుపలికెను. సేనాపతు లందఱు సమ్మతింపక తప్పినదికాదు. సైనికులు కోపముతోడను క్లేశముతోడను

నస్త్రిమిత్రులు కాఁజొచ్చిరి. "స్త్రీ రాజ్యము చేయుప్రదేశము నఁ బురుషులు నివసింపరాదు. ఎంత యన్యాయము! ద్రోహి విశ్వాసఘాతుకుఁడు పరాజితుఁడు నగువాఁడు ప్రభువయి నాఁడు! విజయి యగు రాజకుమారుఁడు వాని కధీనుఁడయి నాఁడు!" అని సైనికులు విచారింప సాగిరి.

ఈవిధముగా నాలుగురోజులు గడచెను. అయిదవనాఁడు కుంజరకర్ణుఁడు తోట్రుపాటుతో కుణాలుని సన్నిధి కేతెంచి "నేఁడు మీరు నావెంట తక్షశిలాదుర్గమునకు రావలెను. దేవిగారి యానతి" యని పలికెను. కుణాలుఁడు మహారాజ్ఞి యాజ్ఞను శిరసా వహించి మఱేమియు మాటలాడక కుంజర కర్ణుని వెంట నడువసాగెను. అతని వామాక్షి యదరెను. కాకులు గ్రద్దలు పై నెగురుచుండెను. కాంచనమాల నిఁకఁ జూడను గాఁబోలు నని కుణాలుఁడు చింతించెను. అయినను నంతరంగమునందలి యావేగ మేమాత్రము ముఖమునఁ గనఁబడలేదు. త్రిరత్నములను స్మరించుచు నతఁడు కుంజర కర్ణుని వెంటఁ జనెను.

కుంజరకర్ణుని వెంటఁ బోవలదని సైనికు లనేకులు కుణాలుని మిక్కిలి ప్రార్థించిరి. కాని యతఁడు చేసైఁగతో వారిని నివారించెను.

కొంతదూరము పోయిన తరువాత కుంజర కర్ణుఁడు "కుణాల కుమారా, మహారాజ్ఞి మీకుఁ గఠిన మగు నుత్తరువు పంపిన" దని చెప్పెను.

"అది యెట్టి దయినను శిరసా వహించ వలసిన దే."

"ఆమె యానతిని శిరసా వహింతురేని జీవనము మరణము సమాన మగును."

"కానిండు."

"మన మిరువురము కలిసి తక్షశిలయందు నూతన ప్రభుత్వ మేల స్థాపింప రాదు ?"

కుణాలుం డేమియు బదులు పలుకక కుంజర కర్ణుని హృదయము కంపించునట్లు లనాదర సూచక దృష్టితో నతనివంకం జూడసాగెను.

"అట్లయిన నేను మహారాజ్ఞి యానతిచొప్పున మనుష్యులను బంపెదను. మనస్సు దృఢ పఱచుకొనుండు!" అని కంపమాన కంఠముతో నని కుంజరకర్ణుడు వెడలిపోయెను.

౮

కుణాలుడు త్రిశరణములను స్తవము చేయసాగెను. ఏకాగ్ర చిత్తముతో నతడు శ్రీ బుద్ధదేవుని చరిత్రమును స్మరించుచు "ప్రాణులకు సుఖము కలుగుటకయి ప్రాణములను త్యజించుట శ్లాఘ్యమే. కాని నే నెవరి కొఱకుం బ్రాణములు విసర్జించుచున్నాను ? దుర్మార్గురాలి పాపవాంఛ నెఱవేఱుటకంటె వే తేదియు జరుగదు!" అని చింతించి మరల నిట్లు తలంచెను. "ఆమె యెట్టిదయినను ప్రకృతము మహారాజ్ఞి. ఆమె యానతి నుల్లంఘించుటకు వీలు లేదు. ఉల్లఘించిన

చో యుద్ధ హత్యలు ప్రారంభ మగును."

ఇంతలో కాంచనమాలసంగతి యతని కాకస్మికముగాఁ బొడకట్టెను. "జీవితేశ్వరీ, ఇఁక నీజన్మమున నన కన్యోన్యసందర్శనము తటస్థింపదు! సెలవు!" అని హృదయపూర్వకముగా నతఁ డనుకొనెను.

మహారాజ్ఞీయాజ్ఞాపత్రికను జేతఁ బట్టుకొని యప్పు డిరువురు చండాలు రాయింటిలోనికి వచ్చిరి. వారి నల్లని శరీరములం దంతటను నూనె చమిరియుండెను. నిరంతర మద్యపానముచే వారి విశాలనేత్రములు జపాకుసుమములవలె నెఱ్ఱవాఱియుండెను. నూనె కాఱువారి విశాలముఖములు నుంగరములు తిరిగిన గడ్డములును జడలు కట్టి చిక్కువడిన వెంట్రుకలును భయముఁ గొలుపుచుండెను. వారికి కంఠములందు జపాకుసుమమాలికలును హస్తములందు ధనుర్బాణములును గలవు. వచ్చినతోడనే వా రిట్లు ప్రసంగించిరి:—

"ఓరీ, యీరాజకుమారుని కన్నులు తీయఁ గలవా? ఇతని కన్ను లెంత పెద్దవి!"

"ఆజ్ఞాపత్రిక యీయనచేతి కియ్యరా!"

"చేతికిచ్చిన నేమగును? చూపించినచో నంతయుముగియును."

"అట్లయిన నీకఁ బని లేదు" అనుచు నిరువురును కుణాలుని నేత్రములకు గుఱిపెట్టి బాణములు సంధించిరి; మొదటి చండాలుఁ డెడమకంటికిని రెండవవాఁడు కుడికంటికిని గుఱి పెట్టిరి. కుణాలుఁడు లేచి నిలుచుండి "ముందుగా నాజ్ఞాపత్రిక

చూపి తరువాత మీయిష్టమువచ్చినట్లు చేయవచ్చు" ననెను. "చూపిన నేమి లాభము? పని కానీయఁగూడదా?" యని చండాలురు పలికిరి.

"పత్రిక చూడనిది మిమ్మేమియుఁ జేయనీయను" అని కుణాలుఁడు వారిచేతులు కంపించునట్లు తీక్ష్ణముగాఁ జూచెను. అంత నతఁడు వారిచేతులనుండి పత్రిక దీసికొని శిరముపై నుంచుకొని చదువుకొనెను. అం దతని కన్నులు తీయుట కాజ్ఞ యున్నది. తిష్యరక్ష చేవ్రాలు గూడ కలవు.

అంత నతఁడు చండాలురతో "మీ కాజ్ఞ యిచ్చినప్రకారము చేయుఁ" డనెను.

"ఇఁక నేత్రములు తీయవచ్చునా?" యని మొదటి చండాలుఁడు ధనుర్బాణము లెత్తెను; కాని కుణాలుని నయనములవంకఁ జూడలేకపోయెను.

పిమ్మట వాఁడు ధనుర్బాణములను గ్రిందఁ బెట్టి కుణాలుని వామనేత్రమున వ్రేలు దూర్చి కన్నూడఁబెఱికెను. కుణాలుఁ డప్పుడు

ధర్మం శరణం గచ్ఛామి
సంఘం శరణం గచ్ఛామి
బుద్ధం శరణం గచ్ఛామి

అని స్తుతింపసాగెను. మొదటివాఁడు కన్ను లాగి యున్మత్తప్రాయుఁడై రెండవకన్ను దీయ సిద్ధపడెను. అప్పుడు రెండవ చండాలుఁడు "ఆకన్ను నావంతు. నీవు తీయుటకు

"వీలు లేదు" అని పలుకుచు కుణాలుని కంటి కడ్డమువచ్చి నిలిచెను. మొదటి చండాలుఁడు వాని నొక్క తన్నుతో దూరముగాఁ బడఁద్రోసి రెండవ కన్ను లాగెను. పిదప రెండు గ్రుడ్లను జేత నుంచుకొని సింహనాదము చేయుచు వాఁడు రెండవవానిని మరలఁ దన్ని వెడలిపోయెను.

౫

రెండవచండాలుఁ డేమి యాలోచించు చుండెనో గాని యింతవఱకును నోరు విప్పలేదు. మొదటివాఁడు వెడలిపోయినతరువాత కుణాలునిఁ జూచి "మీ రికను ఆ మంత్రములే జపము చేయుచున్నారా ?" అని యడిగెను.

"అవును."

"మీకు బాధగా లేదా ?"

"కొంచెము."

"కన్నులు లాగినాఁడు కదా—బాధ కొంచెముగా నున్నదని యెట్లు చెప్పఁ గలిగితిరి ?"

"నాకు బాధ కొంచెమే. కొందఱు నాకంటె నెక్కువ బాధ పడుదురు."

"ఏ మాలోచించుచు మీ రంతస్థిరముగా నుండఁగలిగితిరి ?"

"మా ధర్మోపదేశమును."

"మీ ధర్మోపదేశ మేది ?"

"నీకష్టములను గమనింప వద్దు. పరుల కష్టములను గమనించి వానిని దొలఁగించుటకు యత్నింపవలెను అని."

"ఇది యేనా మీధర్మము ?"

"అవును."

"అట్లయిన నేను బోవుచున్నాను."

కుణాలున కేమియుఁ గనఁబడ లేదు. చండాలుఁ డతనికి సాష్టాంగ ప్రణామము చేసి ధనుర్బాణములను జపాకుసుమ మాలికను గొనిపోవుచు బోయెను.

౬

కొంతసేపటికి కుంజరకర్ణుఁడు వచ్చి "కుణాలకుమారా, మీరీయింటనేయుండవలెను. మహారాజ్ఞియానతి"యనిపలికెను.

"శిరసా వహించితిని" అని యతఁడు పలుక కుంజర కర్ణుఁడు స్వయముగా నానేల మాళిగ తలుపులు మూసి వెడలి పోయెను.

---

పరిచ్ఛేదము. ౧౧

౧

తిష్యరక్ష పాటలీపుత్రమున కేకాధీశ్వరి. మహామంత్రి రాధగుప్తుఁ డామెకు దక్షిణహస్తము. ఇరువురు సంప్రతించి

రాజ్యము పాలించుచుండిరి. ఒక్కొకప్పుడు అశోకుని యభి
ప్రాయముకూడ గ్రహించుచుండిరి. ఈవిధముగాఁ గొన్ని
మాసములు గడచెను. అయిదవమాసమున "కుంజరకర్ణుఁడు
తక్షశిలా కారాగారము నుండి పాఱిపోయె" నని వార్త వ
చ్చెను. తరువాతఁ గొలఁది రోజులకు "కుంజర కర్ణుఁడు కు
ణాలునితో మరల యుద్ధమున కుద్యమించినాఁ" డని యిం
కొక వార్త వచ్చెను. "కుణాలు నోడించి కుంజరకర్ణుఁ డత
నిని చెఱఁబెట్టినాఁ" డని తరువాత వేఱొక వార్త వచ్చెను.
యుద్ధక్షేత్రమునుండి వార్త వచ్చుటకు మాసము పట్టును.
కావున కుంజరకర్ణుఁ డీలోపల నేమి చేయుచున్నాఁడో యె
వ్వరికిని దెలియలేదు. నగరవాసులలో నాందోలనము మెం
డయ్యెను. కుంజరకర్ణుఁడు విజయియై సైన్యమును వెంటఁగొ
ని పాటలీపుత్రమునకు వచ్చుచున్నాఁ డని కొందఱనిరి.
బ్రాహ్మణులు బౌద్ధుల నందఱను వధించుచు వచ్చుచున్నా
రని మఱికొందఱనిరి. ఆఁడుదానికి రాజ్య మప్పగించిన
చో నంతయు నిరంకుశముగా జరుగునని వేఱొక కొందఱ
నిరి. ఈసంగతులు అశోకునకుఁ దెలియ నీయ లేదని
కొంద ఱనుకొనిరి.

కొందఱు పాటలీపుత్రమును విడిచి స్థానాంతరమునకుఁ దమ
పరివారమును బంపివేసిరి.

కుణాలుఁడు బంది యయ్యెననుమాట విని యుద్ధస్థలమునకుఁ
బోవఁదల కనుజ్ఞ నీయవలెనని కాంచనమాల తిష్యరక్షను

వేడుకొనెను. ఆమె వేడుకోలు నిష్ఫల మయ్యెను. మనోవ్యథ యపారమగుటచే నామె యీసారి యెవ్వరిమాటయు లక్ష్యపెట్టక రాత్రివేళ తక్షశిలా నగరమునకుఁ బ్రయాణ మయ్యెను. ఆమె యంతఃపురము విడిచిపోయిన దని నాగరకలోకమునఁ గలవరము పుట్టెను. రాజ్యలక్ష్మి అశోకుని విడిచిపోయిన దని యెల్లరు తలఁపసాగిరి.

తమ తల్లి వంటి కాంచనమాల వెడలి పోయినది మొదలుకొని దీనులు సర్వదా అశోకుని నిందింపఁ దొడఁగిరి. ఆమెను వెదకుటకై కొందఱు తక్షశిలా మార్గమునఁ జనిరి. కాని యామె జాడ దొరక లేదు. సైనికు లనేకులు ప్రేషితులయిరి. వారు కొంతదూరము పోయిరో లేదో కుంజరకర్ణుఁడు వచ్చుచున్నాఁ డన్నవార్త తెలియవచ్చెను. నగరవాసుల భయమునకుఁ బరిమితి లేదు. "శత్రువు వచ్చుచున్నాఁడు. నగరరక్షణమున కుపాయ మే ?" యని పౌరులు తిష్యరక్షా దేవి ప్రాసాదమును జుట్టు ముట్టి హాహాకారములు చేయఁ జొచ్చిరి.

తిష్యరక్ష వారిమాటలు లక్ష్యపెట్ట లేదు. వారందఱు నామెను నిందించుచు అశోకుని కొఱకుఁ జనిరి. నగరమునకుఁ జాలదూరములో నున్న వేణువనమున ఉపగుప్తునితో అశోకుఁడు నివసించుచుండెను. పౌరు లచ్చటికిఁ బోయి తమ విపత్తు నతనికిఁ దెలిపి స్వయముగా రాజ్యభారము వహింపవలసిన దని యతనిని వేడిరి. అశోకుఁ డప్పుడు తిష్యరక్షా

రాధగుప్తులమెడ నించుక యప్రసన్నుఁడై నగరములోని
కరిగెను.

౨

అశోకుఁడు బయలుదేఱి వచ్చుచు మార్గమున నగరవాసుల వలన సమస్తవిషయములను సమగ్రముగా గ్రహించెను. కుణాలునకు కాంచనమాలకు సంభవించిన దురవస్థ కతని హృదయము మహావ్యథ నొందెను. అతఁడు ప్రాసాదద్వారమునఁ బ్రజల నాదరించి పంపి సూటిగా తిష్యరక్షాదేవి మందిరమునకుఁ బోయెను. ఆమెయు రాధగుప్తుఁడు నేదియో యాలోచించుచుండిరి. అశోకుఁడు రాధగుప్తునిజూచి "కుంజరకర్ణుఁడు ససైన్యముగా వచ్చుచున్నాఁడా?" యనియడిగెను "కుంజరకర్ణుఁడు తక్షశిలను జయించినమాట నిజమే. కాని యతఁ డచ్చటినుండి వచ్చుచున్నాఁ డన్నవార్త నా కింకను దెలియరాలేదు."

"కుణాలుఁ డేమయినాఁడు? కాంచనమాల యెక్కడ నున్నది? మీ రింతకాలము సైన్యము నేల పంప లేదు? పంపిన సేననుగూర్చి యేమి తెలిసినది? ఈవిషయములు నా కింతవఱ కేమియుఁ దెలియవచ్చినవి కావు."

అశోకుఁడు ప్రశ్నముపైఁ బ్రశ్న మడుగుటవలన రాధగుప్తుఁడు ప్రత్యుత్తర మీయలేకపోయెను. అశోకుఁ డాసమయమున వచ్చునని యతఁ డూహింపలేదు; కావున నతఁడు సిద్ధ

ముగా నుండలేదు. తన ప్రశ్నములకు సమాధానము రాసం దున అశోకుఁడు వ్యగ్రుఁడై ప్రశ్నములవర్షము గురిపించెను. అప్పుడు కంచుకి వచ్చి తక్షశిలనుండి విజ్ఞానవిదుఁ డొకఁడు వచ్చినాఁడని తిష్యరక్షకు విన్నవించెను. వెంటనే దర్శన మిప్పింపుమని యామె యాజ్ఞ యిచ్చెను.

“తక్షశిలనుండియా?” యని అశోకుఁ డనెను. కంచుకి సాష్టాంగప్రణిపాతము చేసి “మహారాజునకు జయమగుఁగాక!” యనెను.

“జయము తరువాత నగును. అతఁడు వచ్చినది తక్షశిలనుండియేనా?”

“చిత్తము.”

“అతనిని వెంటనే ప్రవేశపెట్టు.”

అప్పుడు మంత్రి కంచుకిని వారించి “దూత కిప్పుడు దర్శన మిచ్చుటకు వీలులేదు. విశేషించి దేవిగారుబడలియున్నారు” అని పలికెను.

అశోకుఁడు రాధగుప్తునివంకఁ దీవ్రముగాఁ జూచి కంచుకితో “మహారాజునాజ్ఞ నిర్వర్తింపుము” అనెను. కంచుకి తొట్రుపాటుతో విజ్ఞానవిదుని దీసికొని రాఁబోయెను. మంత్రి యిట్లనెను: “దేవా, తమరు రాజ్యము స్వీకరించుటకుఁ గొలఁది దినముల వ్యవధి యున్నది.”

“ఈసంగతి జ్ఞప్తి యున్నది. ఇప్పు డీమాట జ్ఞాపకము చేయుటలో మీయభిప్రాయ మేమి?”

"ఈకొలఁదిదినములు నన్ను స్వేచ్ఛగా వ్యవహారములు నిర్వర్తింప నీయకున్నఁ దమ ప్రతిజ్ఞకు భంగము వచ్చును."

"ఈలోపల మగధసామ్రాజ్యము ధ్వంస మగును!"

అశోకుఁ డీమాట లనుచుండఁ గంచుకి విజ్ఞానవిదుని గొనివచ్చి మహారాజ్ఞి దర్శనము చేయించి వెడలిపోయెను.

విజ్ఞానవిదుఁడు తనయుత్తరీయము మడతలోనుండి చిన్నబరణి వెలుపలికిఁ దీసి రాణిచేతి కిచ్చెను.

"నీవు వచ్చినది తక్షశిలనుండియేనా?" అని అశోకుఁ డతని నడిగెను.

"చిత్తము" అని యతఁడు అశోకుని మాటలాడనీయక తిష్యరక్షతో నిట్లనెను: "దేవీ, ఈరెండు కన్నులు దెచ్చుట నా కెంత కష్ట మయినదో చెప్ప నలవి కాదు. రాజమార్గమున విశల్యకరణి దొరకినది కాదు. కావున నాకు—"

కన్నులమాట విన్నంతనే తిష్యరక్ష యదరిపడి బరణి తెఱచి నేత్రములు వెలుపలికిఁ దీసి చూచెను. అవి వెనుకటివలెనే ప్రకాశించుచుండెను. వెంటనే యామె వానిని క్రిందఁ బడవేసి కాలితో రాచి వ్యాకులభావముతో వెడలిపోయెను.

అశోకుఁడు విషణ్ణచిత్తుఁడై "ఈకన్ను లెవరివి? ఎచట లభించినవి?" అని యాతని నడిగెను. విజ్ఞాన విదుఁ డామాటలు చెవిఁ బెట్టక తనమార్గాయాసమును వర్ణింపఁ జొచ్చెను. "విశల్యకరణి వెదకుచు నొకసారి పామునోటఁ బడుటకు సిద్ధమయితిని; ఇంకొకమాఱు పులినోటఁ బడుటకు సిద్ధమయితిని.

కాకున్నచో నివి యిటులుండవు'' అని యాతఁడే మేమో
చెప్పుచుండెను.

తిష్యరక్షి వెడలిచన్న తరువాత రాధగుప్తుఁ డతనిని బిలిచి
"దేవిగారి కస్వస్థముగా నున్నట్లు తెలియలేదా? నీ వ్విస
మయమున రమ్మన్న దెవ?'' రని యడిగెను.

"నా కెట్లు తెలియును? ఒకానొకఁడు నాచేతికిఁ బాలధన మి
చ్చి యిది మహారాజ్ఞిగారి కిమ్మని చెప్పినాఁడు. దేవిగారికి
సమర్పించినచో బహుమానముకూడ దొరకు నన్నాఁడు.
నేను తెచ్చినాను.''

"ఎవఁ డతఁడు?'' అని అశోకుఁడు ప్రశ్నచేసెను.

"నాకుఁ దెలియదు. శాస్త్రపరీక్ష లెన్నో చేయవలెను. దా
నికి ద్రవ్యము కావలెను. అతఁడు నాచేతికి ధన మిచ్చి యిం
కను ధనము దొరకు నన్నాఁడు. నేను తెచ్చినాను.''

"అతఁ డెవరో గుర్తు పట్టఁగలవా?''

"పట్టలేను.''

"నీవు వచ్చిన దెక్కడ నుండి?''

"వాసుకిశిలమునుండి.''

"అది యెక్కడ?''

"తక్షశిల కెనిమిది కోసుల దూరమున.''

"అచ్చట శత్రువులసంగతి యేమైనఁ దెలిసినదా?''

"శత్రువు లెక్కడ?''

"తక్షశిలలో.''

"అవును. కొంచెము కొంచెము తెలిసినది. అయిదారుమాసములక్రిందట తెగినకాళ్లు బాగుచేసినాను. శత్రువులు వారి కాళ్ళు తెగఁగోసినారఁట."

అతనివలన వృత్తాంతము తెలియరా దని నిశ్చయించుకొని అశోకుఁడు "ఏమి పరీక్షించుటకు నీ కెంత ధనము కావలెను?" అని యతనిని బ్రశ్నించెను.

"అంధత్వము పోఁ గొట్టుటకు."

"అశోకుఁడు మరల సింహాసన మెక్కిన తరువాత రమ్ము. బహుమానము లభించును."

"మహారాజ్ఞ నా కెప్పుడు బహుమానము చేయును? అశోక మహారాజుగారి యభిషేకమువఱకుఁ గూరుచుందునా?"

"ఉన్నను నష్ట మేమి?"

"తప్పక లభించునని తెలిసిన యెడల నాలుగైదురోజు లుందును. రాజ్యము నితరులకు—విశేషించి స్త్రీకి—నొసంగిన వారికి మరల రాజ్యము వచ్చునా?"

మంత్రి యతనిని మందలించి "నీవు చాల మూర్ఖుఁడవు. ఎవరితో మాటలాడుచున్నావో తెలియునా?" యనెను.

"తెలిసినను దెలియకున్నను వాస్తవమైన విషయము యముని యెదుటఁగూడ ననఁగలను."

"ఇఁక నీ వతిథిశాలకుఁ బొమ్ము. మహారాజ్ఞికి విన్నవించి నీ బహుమానమునంగతి యేర్పాటు చేసెదను."

"కాని, నే నెక్కువరోజు లుండఁజాలను."

"నేఁడే యేర్పాటు చేసెద" నని మంత్రి యతనిని బంపి వేసెను.

3

విజ్ఞానవిదుఁడు వెడలి పోయినతరువాత అశోకుఁడు మంత్రిని జూచి "ఇది యంతయు నేమి?" యనెను.

మంత్రి అశోకుని పాదములపై వ్రాలి "దేవా, యీకొలఁదిదినములు న న్నేమియు నడుగ వలదు. తమ సేవకుఁడనైన నన్ను స్వయముగా నితరులచేతి కప్పగించితిరి! రాజకార్యములు దురూహ్యములని తమకుఁ దెలిసినదే. ఈకొలఁదిదినములు న న్నేమియు నడుగవలదు" అని విన్నవించెను.

"మంచిది. నగరవాసుల భయము నివారించుట కేమియుపాయ మాలోచించినారు?"

"అదియు మహారాజ్ఞిగారి యిచ్ఛాధీనము."

ఇంతలో తక్షశిలా నగరమునుండి దూత వచ్చి కుణాలుఁడు పట్టు పడినది మొదలతనిసైనికులు పెచ్చు పెరిగి కొందఱు శత్రుసైన్యములోఁ జేరిరనియుఁ గొందఱు ప్రజలను బాధించుచుండి రనియుఁ ద్వరలో సైన్యమును సేనానిని బంపనియెడల వేలకొలఁది ప్రజలు నశింతు రనియు మంత్రికి విన్నవించెను. ఈవార్త నాకర్ణించి వా రిరువురును సత్వరముగా మహారాజ్ఞి సన్నిధికిఁ జనిరి. అశోకుని యావేగ మప్పటి

కిని తగ్గలేదు. ఆమె చేతితో సైఁగ చేసి ప్రకోష్ఠశాలలో వేచియుండుఁడని చెప్పి త్వరలోనే యచటికి మరలి వచ్చి అశోకుని జూచి "దేవా, ఇఁక నాకుఁ బ్రభుత్వముతోఁ బని లేదు. ఆఁడు దానను. రాజ్యచింత నాకు దుర్భర" మని నివేదించెను.

అంతట మంత్రి మాటిమాటికిని మహారాజ్ఞి యస్వస్థతను గూర్చి హెచ్చరింపఁ జొచ్చెను.

"రాజ్య భారము వహింప" నని అశోకుఁడు చెప్పగా మంత్రి యడ్డువచ్చి "అట్లయినఁ బ్రధానామాత్యపదవి స్వీకరించి నాకు సెలవు దయచేయుఁ" డనెను.

"రాధగుప్తుఁ డుండగా నింకొక మంత్రి"—

"అట్లయిన నీవిప్లవసమయమున సేనాధిపత్యము స్వీకరింపుఁ" డని తిష్యరక్ష పలికెను.

"మంచిది. నేను నగరవాసులను శాంత పఱచి తక్షశిల కరిగెదను. నేను మరలి రానంతవఱకును మీరు వెనుకటి వలెనే ప్రభుత్వము నడుపుచుండుఁ" డని అశోకుఁడు పలికెను.

౧

తనభర్త బందియయినాఁడని తెలిసినప్పటినుండియు కాంచనమాల మనస్సు స్తిమితముగా లేదు. కేవల మభ్యాసవశమున నామె ప్రతిదినము చేయవలసిన పనులు చేయుచుండెనే కాని వానియం దామె కుత్సాహము లేదు. నిత్యమామె సంఘభోజనము పెట్టించుచుండెను, దరిద్రులకు వస్త్రము లిప్పించుచుండెను, రోగుల కౌషధము లిచ్చి వారల కుపచారములు చేయించుచుండెను. ఇవి యన్నియు నామె కేవల మభ్యాసవశముననే జరుపుచుండెను. తానాపనులు చక్కఁగాఁ జేయుట లేదని యామె తెలిసికొన్నది. ఒకనాఁ డామె సంఘభోజనము పెట్టఁబోయి ముందుగాఁ బాయసము వడ్డించినది. ఇంకొకనాఁడు రోగి కొకని కౌషధ మిచ్చి మఱునాఁడు పథ్యము పెట్టించవలసి యుండ సాయంకాలమువఱకు నామె కామాట జ్ఞప్తికి రాలేదు. జ్ఞప్తికి వచ్చినంతనే యామె త్వరితముగాఁ బోయి చూచునప్పటికి రోగి మృతప్రాయుఁడై యుండెను. మఱి యొకదినము దరిద్రబ్రాహ్మణునకన్నము గొనిపోవుచు నామె పుష్కరిణీతీరము చేరెను. కుణాలుఁడు తాను నచ్చటి కొకనాఁడు స్నానమునకు వచ్చిన సంగతి జ్ఞప్తికి రాఁగా గయాశీర్షమునందలి పులివేఁట మొదలుకొని జరిగిన సంగతులన్నియు నామె స్మృతికిఁ దగిలెను.

అచ్చట నిలుచుండి యామె చింతామగ్న యయ్యెను. అప్పు
డు గ్రద్ద యొకటి వచ్చి భోజనపదార్థములను డటాలునఁ ద
న్నుకొని పోయెను. మానసికస్థితి యిట్లుండ నింట నుండుట
యసంగత మని యామె భావించెను. ఉత్సాహము లేనిపని
చేయరాదు. మనస్సు నిలకడగా నుండనిచోట నిలువరాదు.
ఈరీతిగా నైదారు పర్యాయము లాలోచించి యామె యి
ల్లు విడిచిపెట్టెను. ఒకానొక నిశీథమున నంధకారము ప్రబ
లి యుండఁ దన భూషణములను గుటీరమున విసర్జించి భర్త
నన్వేషింప బయలుదేఱెను. ఆమె శాక్యభిక్షుకురాలివేషము
దాల్చినది. శరీరమున ధూళి చల్లుకొని తప్తకాంచన సన్ని
భమైన తనమేనిఛాయను మఱుఁగు పఱచి ధర్మసంఘబుద్ధు
లకు నమస్కరించి మెల్లమెల్లనఁ బ్రాసాదము విడిచి యొం
టిగా నంధకారసముద్రమున లీనమై పోయెను.

౨

పాటలీపుత్రమునకు తక్షశిల చాలదూరమున నున్నది. జాబు
వచ్చుటకు నెలరోజులు పట్టును. కాంచనమాల యొక్కతె
యంతదూర మెట్లు పోఁగలదు? కాని యామె ఋషికన్య.
ఆమె జన్మభూమి పర్వతము. రాచనగరునందలి సుఖములా
మెకుఁ గష్టముగాఁ దోఁచెడివి. రాజధానియందలి విహంగ
ములు మనసార సంగీతము పాడలేవు. పర్వతశిఖరమందుఁ
బ్రాణులకు హాయి నింపుమారుతము ప్రాసాదమున లభింప

దు. మనసువిప్పి మాటలాడువారు రాచనగరులం దుండరు. కావున కాంచనమాలకుఁ బ్రాసాద నివాసమే కష్ట మయ్యె నా. ఆమెకు మార్గాయాస మంతగా లేదు. అయినను జిం తాభారముచే నామెకుఁ బ్రయాణము కష్టముగా నుండెను. ఎంత త్వరితముగా నామె నడచినను హృదయభారము తగ్గ లేదు. రాజమార్గము చాలవంకరలు తిరిగిన చుట్టుత్రోవ యగుటచేతను మగధసామ్రాజ్యములోని పట్టణములు చాలవ లకు దానియందున నుండుటచేతను దన్మార్గమున నరిగినఁ జాల యాలస్య మగునని కాంచనమాల పల్లెలమీఁదుగాఁ బోవుచుండెను. మైదానములవెంటను గ్రామములగుండను విపినములలోను జనుచు నదులు దాఁటుచుఁ బతిగతప్రాణ యగుటచే నామె భర్త నన్వేషించుచుండెను. భర్తరూపము హృదయమున సంకీర్ణమై యుండుటచేతను మనస్సాతనియం దు లగ్నమై యుండుటచేతను మార్గశ్రమ మామెకుఁ దెలి య లేదనవచ్చును. సరయూ నదీతీరమున నొకనాఁ డనేకు లు గుమిగూడి యుండిరి. మధ్యాహ్న సూర్యకాంతిచే దేదీ ప్యమాన యగు దేవియో గంధర్వ భామినియో విద్యాధ రాంగనయో యన నొప్పు దివ్యమూర్తి వారందఱును జూ చుచుండ సరయూనదిలో దుమికెను. ఆసమయమున సర యూనది యుత్తాలతరంగమాలాలోలమై మృత్యుదేవతా కరాళదంష్ట్రావళివలె భయంకరముగా నుండెను. ఆజనస మూహములో హాహాకార ముప్పతిల్లెను. నావను దీసికొని

కొందఱామె వెంట నరుగ యత్నించిరి. కాని యా దివ్య మూర్తి హస్తముతో వారిని వారించుచు "ధర్మం శరణం గచ్ఛామి, సంఘం శరణం గచ్ఛామి, బుద్ధం శరణం గచ్ఛామి!" అని పలుకుచు వక్షోభరమునను నిరంతర సంచాలిత కరద్వయముతోను నదీతరంగములను భేదించుచు మార్గము పరిష్కరించుకొనుచుండెను. ఇంతలో నామె సరయూనది దాఁటి యావలియొడ్డు చేరి యార్ద్రవసనములతోనే ప్రయాణము చేయఁజొచ్చెను.

3

అహిచ్ఛత్రజను లొకానొక నిశీథమున నాకస్మికముగా మేల్కాంచిరి. భూమ్యాకాశములు నిండిపోవున ట్లెవరో గాథలు గానము చేయుచు రాజమార్గమునఁ బోవుచుండిరి. ఆమెను గాంచి పురాధిష్ఠాత్రియగు దేవత యని కొందఱును విద్యాధరాంగన యని కొందఱును భావించిరి.

ఒకనాఁటి సాయంకాలమున మదిపుర ప్రజలు పెద్దపుష్కరిణి చుట్టును గుమిగూడి కోలాహలము చేయుచుండిరి. బాలకుఁ డొకఁ డందు బడి మునిఁగిపోయెను. వాని నెవ్వరును బయటికిఁ దీయ లేకుండిరి. వాని తలిదండ్రులు గుండెలు బాదుకొనుచు విలపించుచుండిరి. కొందఱు వారి నోదార్చుచుండిరి, కొందఱు ఏడ్చుచుండిరి, కొందఱు ఈఁతగాండ్రను బిలుచుచుండిరి. అట్టిసమయమున జయధర్మ జయసంఘ జ

యబుద్ధ యనుచు రక్తాంబరధారిణి యగు దేవీమూర్తి య చటి కాకస్మికముగా నేతెంచెను. అచటివార లామెను గాంచి యాశ్చర్యాన్వితు లయిరి. ఆమూర్తి యెవ్వరితో నేమియు ననక పుష్కరిణిలో దుమికి మునింగిపోయెను. ఇంతలో జలము నిశ్చల మయ్యెను. జలగర్భమున నిరువురు ప్రాణులున్నారను చిహ్నములు కనంబడ లేదు. యక్షిణి యెవ్వతియో వచ్చి బాలకుని పాతాళలోకమునకుం గొనిపోయినదని యందఱు భావించిరి. ఆశ్చర్యము! ఆదివ్యమూర్తి బాలకుని బట్టుకొని యింతలో వెలుపలికి వచ్చెను. అచేతనావస్థయం దున్నవానిని దల్లిదండ్రులు హృదయమునకు హత్తుకొన వచ్చిరి. దేవీమూర్తి బాలకుని చరణములు పట్టుకొని గిఱ్ఱునం ద్రిప్పసాగెను. అచటివా రెల్లరు నాశ్చర్య మొందిరి. వ్యాకులభావముతో వాని జననీ జనకులు చేతులు పట్టుకొన యత్నించిరి. కాని దేవీ బలమును నిరోధింప మానవులకు సాధ్య మగునా? కొంతసేపటికి దేవి యాకుఱ్ఱవానిని జననిచేతి కందిచ్చెను. బాలకుండు తల్లిచంకను జేరి కిలకిల లాడెను. అచటివా రెల్లరు నాదంపతుల యదృష్టమునకాహ్లాద మొందిరి. ఇంతలో దేవి యంతర్హిత యయ్యెను.

## ౮

కాంచనమాల క్రమముగా మాణిక్యాలాపురమునకుం బోయెను. ఆపట్టణము దాటిన తరువాత శత్రుప్రదేశము వ

చ్చెను. ఆమె యాపురములోని ప్రధానమఠమున విడిసి మందిరము లన్నిటికిని బ్రదక్షిణము చేసి ప్రాతఃకాలమునఁ ద్రిరత్నములను స్మరించి నిర్భయముగా శత్రురాజ్యమునఁ బ్రవేశించెను. రెండుమూడు రోజులు నిర్విఘ్నముగా, గడచినవి. మూడవనాఁ డామె శత ద్రూనదిని దాఁటి నాలుగు కోసులదూరము చనునప్పటికి బహుసంఖ్యాకు లగుసైనికు లొకానొకచో నామెకుఁ గానవచ్చిరి. వారిని గాంచి కాంచనమాల వేఱొకమార్గమునఁ బోన నుద్యమించి కొంతదూరము చని సాలవనమునఁ బ్రవేశించెను. ఇంచుక దూరమే గనో లేదో యామెకు భయ మొదవెను. సూర్యరశ్మి ప్రవేశించుటకుఁ గష్ట మగునంత దట్టముగా నున్న సాలవృక్షము లామెకుఁ గానవచ్చినవి. కంబళము లొకచోఁ బడియుండెను. ఇంకొక చోట వృక్షశాఖలు విరిగియుండెను. వేఱొకచో భిన్నభాండములు కాష్ఠములు పడియుండెను. ఎచ్చటను మనుష్యునిజాడ లేదు. వెనుకవైపునుండి దూరమున నేమో వచ్చుచున్న ట్లామెకు వినఁ బడెను. మనుష్యులో జంతువులో నిర్ధారణ చేయలేక యామె శీఘ్రముగా నడువఁ జొచ్చెను. కొంతదూరము పోవునప్పటి కామెకు వికటధ్వని వినవచ్చినది. చప్పు డుప్పతిల్లిన వైపు పరికించి చూడ నశ్వారోహులు కొందఱు త్రాళ్ళు పట్టుకొని పశువులను దోలుకొని వచ్చుచుండిరి. వారిని జూడగనే యామె చెట్లమాటునఁ బోవసాగెను. ఇంతలో నరణ్యభూమి యదరునట్లు భీ

షణసింహనాద ముప్పతిల్లెను. ప్రతివృక్షమునుండి యిద్దఱు ముగ్గురు చొప్పున బహు సంఖ్యాకులు దిగి యడవి నిండిరి. ఏవంకఁ జూచినను యోధవేషు లామెకుఁ గానవచ్చిరి. వస్త్రములు ఛిన్నభిన్నములై, శరీరము లపరిష్కృతములై యున్న యీ బ్రాహ్మణసైనికులలోఁ గొందఱకు యజ్ఞోపవీతములున్నవి, కొందఱకు లేవు. వృక్షములనుండి క్రిందికి దిగినవా రెల్లరు నాశ్వికులవైపు పరుగెత్తిరి. రౌతులు వీరికోసము భోజనసామగ్రిలు తెచ్చి యుండ వచ్చును.

కాంచనమాల రక్తాంబరమును జక్కగాఁ గప్పుకొని యొకానొక చెట్టుపంగమీఁదఁ గూర్చుండెను. దుష్టస్వభావు లగు సైనికు లసామాన్యరూపవతి యొకతె నడవిలో నుండుట చెట్లపైనుండి చూచిరి. అప్పు డనేకుల కనేకవిధములగు భావము లుదయించినవి. కాని వా రేమి చేయుదురు? రౌతులు మరలివచ్చువఱకును వారు వృక్షములు దిగఁగూడ దని యాజ్ఞ. కావున నింతవఱకును వా రేమియుఁ జేయలేదు. ఇప్పు డాసుందరి యెందరిగినదో యని వారు వెదక నారంభించిరి. వృక్షమూలమున రక్తాంబరము కనఁబడగా నావైపున కేడెనిమిదిమంది సైనికులు పరుగెత్తిరి. ఇఁక దాగియుండుట నిష్ప్రయోజన మని తెలిసికొని కాంచనమాల చెట్టెక్కినది; ఎక్కి కొమ్మమీఁద నిలుచుండి యుచ్చైఃస్వరమున వారిని సంబోధించి, "భర్తను వెదకుటకై బహుదూరమునుండి వచ్చుచున్నాను. ఆయన తక్షశిలానగరమునఁ జెఱసాలయం

దున్నారు. నే నచటికిఁ బోవుచున్నాను. న న్నడ్డగింపకుఁ డు!” అని పలికెను.

ఒకానొకసైనికుఁడు పెద్దపెట్టున నవ్వి “అంతదూరము పో నక్కఱ లేదు. ఇచ్చటనే పతిలాభము కలుగు” ననెను. “పతినా, ఉపపతినా వెదకునది?” అని మఱియొకఁ డనెను. ఇద్దఱు ముగ్గురు వృక్షము నారోహింపఁ జొచ్చిరి. “చెట్టెక్క వలదు. ఒక్కతన్నుతోఁ గ్రిందఁ బడవైచెదను!” అని కాంచనమాల పలికెను.

అందఱును బెద్దపెట్టున నవ్విరి. చెట్టెక్కువారిలో నొకఁ డామెను సమీపింప నామె వానిని గట్టిగాఁ దన్నెను. దానితో వాఁడు నెత్తురు గక్కుకొని క్రిందఁ బడెను. మిగిలిన వారు భయపడి సత్వరముగా వృక్షము దిగిపోయిరి. చాల మంది వృక్షమూలము చుట్టును జేరిరి. అంత నెల్లరు నేమి చేయవలెనో యాలోచింపసాగిరి. ఒక్కఁడును జెట్టెక్క లేదు. ఆమె పిశాచాంగన యని కొందఱును దేవత యని కొందఱును బలుక సాగిరి. ఆమెను విడిచిపెట్టు డని కొందఱనిరి. “భర్తను వెదకుటకు వచ్చినది, కనుక నిద్దఱుముగ్గురు భర్తలను సమకూర్చి మఱి వెళ్ళవలె” నని కొందఱనిరి. వా రిట్లు మాటలాడుచుండ దూరమునఁ జేర్చియుంచిన కంబళి కాష్ఠాదులు మండఁ జొచ్చెను. అగ్ని జాజ్వల్యమానమై యరణ్యమును గ్రసింప నుద్యమించుచుండెను. ధూమరాశిచే నడవియంతయు నొక్కసారిగా నంధకారబంధుర

మయ్యెను. చూచుచుండ, నశ్వారోహులు సేకరించిన భో
జ్యపదార్థములను బానకజ్వాలలు చుట్టుముట్టెను. సేనాపతి
మాటిమాటికి దూర్యధ్వని చేయుచుండెను. సైనికులకుఁ
బ్రాణాధారమైన భోజనసామగ్రిలను వైశ్వానరుఁ డాహు
తిగా గ్రసింపనుండెను. అపుడు వృక్షమూలమునందున్నవా
రెల్లరు భోజనపదార్థములను రక్షించుకొనుటకై పరుగెత్తి
పోవలసి వచ్చెను. కాంచనమాలా పదాఘాతము తగిలిన
వాఁడు నింకొక వికృతాకారుఁడు మాత్రము వృక్షము మొ
దటఁ గూర్చుండి పెద్దమాత్రికులవంకఁ జూచుచుండిరి. వారి
యుద్దేశ్య మేమో తెలియదు; కాని మంచి దయినట్లు తోఁ
చదు. చెట్టు దిగవలె నని కాంచనమాల కొకసారి బుద్ధి పో
డమినది. కాని యట్టి దుర్మార్గులచేతఁ జిక్కుట మంచిదికా
దని యెంచి యామె యింకను వృక్షాగ్రమునకుఁ బోయెను.
అచటఁ గూర్చుండి యామె యాముష్టుల బారినుండి తప్పిం
చుకొను నుపాయ మాలోచింపఁ దొడఁగెను. భగవంతుఁడే
కాంచనమాల కుపాయము చూపినాఁడు! ఆమె వృక్షాగ్ర
మునుండి చూడ బహుసంఖ్యాకులగు సైనికులు మహారణ్య
మును జుట్టుముట్టి యశ్వములను వేగముగాఁ బరుగెత్తించు
చుండిరి. సూర్యకాంతిలో వారి కవచములు శిరస్త్రాణములు
ను ధగధగ లాడుచుండెను. తీక్ష్ణములగు వారి శూలఫలక
ములపై నపరాహ్ణసూర్యకిరణములు ప్రతిఫలించి శీర్ణవిశీర్ణ
ములై పోవుచుండెను. ఆశ్వికులు శీఘ్రముగా నరణ్యముఁ

జొచ్చి కాంచనమాల యధిష్ఠించిన వృక్షము వెనుకనుండి బ్రాహ్మణసేన నాక్రమించిరి. వారిలో నొకఁడు వృక్షమూలమం దున్న యోధవేషుల నిరువురను బల్లెముతోఁ బొడిచివైచెను. బ్రాహ్మణసైనికు లిద్దఱు సత్వరముగా నొరలనుండి ఖడ్గములు దూసి యుద్ధము చేయఁ బోయిరి; కాని యయిదాఱు బల్లెపుఁబోట్లతో క్షతవిక్షతదేహులై నేలఁ గూలిరి. ముందుఁ బ్రచండపావకజ్వాలలను వెనుక నాశ్వికశత్రుసైన్యమును గాంచి బ్రాహ్మణయోధు లాలోకించుక స్తబ్ధు లయిరి. బ్రాహ్మణులు మహావీరులు, యుద్ధమునఁ బరాఙ్ముఖులు కారు. ఋక్కులను బఠించుచు నమస్కారపూర్వకముగా నగ్నిదేవున కభిముఖులై వారు శాత్రవుల నెదుర్కొనిరి. అప్పుడు సంకులసమరము జరిగెను. కాంచనమాల వృక్షాగ్రమునుండి యిది యంతయుఁ బరికించుచుండెను; కాని, దట్టముగు పొగచే నామెకు సరిగాఁ గానరాలేదు. సకిలింతలతో గుఱ్ఱములు నేల కొఱగుచుండెను. వికటహుంకారములు చేయుచు సైనికులు భూతలమున వ్రాలుచుండిరి. అశ్వకళేబరములు మానవగాత్రములు నగ్నిహోత్రున కాహుతి యగుచుండెను. ఎవ్వరును బలాయనము చేయలేదు. కాంచనమాల యాఘోరయుద్ధమును జూడలేక దృష్టి మరల్చుకొనెను. ఎవరిభయమువలన నామె యింతవఱకును జెట్టు దిగివచ్చుటకు వీలు లేకపోయినదో వారు భూపతితులై యుండుట చూచి యామెహృదయము జాలిచేఁ గరగి పో

యెను. అంత నామె చెట్టు దిగి వచ్చి చూడ నిరువురును మరణోన్ముఖు లయి యుండిరి. బల్లెపుములుకులు వారిరొమ్ములనుండి వీఁపుల వెలుపలకు దూసుకొనిపోయినవి. వారికింకను గొంచెము తెలివియున్నది. కాంచనమాల సమీపమునకుఁ జనగా నం దొకఁడు క్షీణహస్తములను జోడించి హీనస్వరముతో "దేవీ, క్షమింపుము.!" అని పై నేమియుఁ జెప్పలేకపోయెను. కాంచనమాల వాని నించుక కదలించి చూడఁ బ్రాణవిహంగము వాని దేహపంజరమును వీడి యెగిరిపోయినది. అంతట నామె రెండవవాని కడకుఁ బోయి చూచి గ్రుచ్చుకొని యున్న బల్లెపు ములికిని లాగి వేయ రక్తము చిమ్మిన గొట్టమునుండి వచ్చునట్లు వెలుపలికి లేచెను. తన యెఱ్ఱకోక కొంగు చింపి కాంచనమాల వానివ్రణముఖమున కడ్డము వైచెను. చెంత జలము లేకుండుటచే నామె మెత్తని ధూళి గాయముపైఁ జల్లి సమీపమందలి యాకులు తీఁగెలును నలిపి యారసము దానికిఁ బూయఁబోవుచుండెను. ఇంతలో నుష్ట్రముల మీఁదను గార్దభముల మీఁదను సామానులుంచుకొని యాశ్వికులు కొంద ఱచటికి వచ్చుచుండిరి. ఆకారపరికారములను బట్టి యం దొకఁడు దళపతియని కాంచనమాల గ్రహించెను. దళాధిపతి వారినిఁ గాంచి దగ్గఱకు రమ్మని యాజ్ఞాపింప గుంపు సమీపమునకు వచ్చెను. కాంచనమాల గాయమునకు రసము పూయఁ బోవుచుండెను. నాయకుఁడు కంచరగాడిద మీఁది బరువు

దించి యేదో యౌషధమును దీసి రోగి శరీరమునకుఁ బూసె ను. క్రమముగా స్మృతి వచ్చినపిమ్మట రోగి కాంచనమా లను జూచి "నీవా!" యనెను. "ఇతఁడు నీ కే మగును!" అని దళనాయకుఁ డామె నడుగ, "నే నీమెకుఁ బ్రబలశ త్రువును" అని రోగి పలికెను. "శత్రువున కేల పరిచర్య చే యుచున్నావు?" అని నాయకుఁడు తన్నుఁ బ్రశ్నింపగా కాంచనమాల "ఇతని బాధ చూచి వైరము మఱచితిని" అని ప్రత్యుత్తర మిచ్చెను.

ఆమాటలు విని నాయకుఁడు నిట్టూర్పు విడిచి యాకాశము వంకఁ జూచుచు "గురుదేవా, గురుదేవా!" యనెను. "మీగురుదేవుఁ డెవరు?" అని కాంచనమాల యాతని నడిగెను. నాయకుఁ డిట్లు చెప్పెను. "ఆయన యెవరో నే నెఱుగను. నే నిదివఱకుఁ జండాలుఁడను, తక్షశిలా నగర మున శూలారోపకుఁడను. ఒకనాఁడు మాప్రభువు నన్ను నింకొక శూలారోపకుని యొకా నొక నేలమాళిగలోనికిఁ గొనిపోయి యొక ఋషి నేత్రములను దీయ నాజ్ఞాపించెను. నాసహచరుఁ డాయనకన్నులు పెకిలించినాఁడు. నయనము లూడఁదీయునపుడు ఋషికి బాధ కలిగినట్లు తోఁచలేదు. మీకు బాధగా లేదా యని నే నడుగ నీ వీమాట యను టచే బాధసంగతి జ్ఞప్తికి వచ్చిన దని యాయన పలికినాఁడు. తరువాతఁ జాలసారు లాయన కొఱకు వెదకితిని. దుర్మార్గు లగు బ్రాహ్మణు లాయన నెచ్చటనో దాచి పెట్టినారు.

ఎంత వెదకినను గనఁబడలేదు. తుద కాప్రయత్నము మాని యుద్ధమున గాయములు తగిలినవారికిఁ జికిత్సలు చేయుచుఁ దిరుగుచున్నాను. నావెంట నున్న యీ చండాలు రంకులు ను నా మతము నవలంబించినారు."

చండాలుఁడు మాటలాడుచున్నంతసేపు కాంచనమాల వ్యాకులభావముతో నుండెను. స్వప్న తుల్య మగు వెనుకటి రోజు లామెకు సదును సదును జ్ఞప్తికి వచ్చెను. ఆ బుద్ధి కు ణాలుఁడే యని యామెకుఁ దోఁచెను. చండాలుఁడు మా టలు ముగించీ ముగింపక ముందే యామె వ్యగ్రభావముతో "భద్రా, మీ గురుదేవు నా కొకసారి చూపఁగలవా?" యనెను. "ఆయన నాకుఁ గనఁ బడినయెడల వారి చరణస న్నిధానమున నాత్మసమర్పణము గావించుకొని యుందు" నని యతఁడు పలికెను.

కాంచనమాల యిట్లనెను. "మీరు నా దుఃఖమునకు విచా రపడుచున్నారు. కావునఁ జెప్పుచున్నాను. నాభర్త యీ యు ద్ధమున బంది యయినాఁడు. ఆయన అశోకమహారాజుగారి సేనాధిపతి. మీగురుదేవుని దర్శనము లభించెనేని నాభర్త వృత్తాంతము తెలియవచ్చును. మాటలను బట్టి, మీరు పా టలీపుత్రమునుండి వచ్చుచున్నారని తలఁచెదను."

ఇంతలో రోగి సీత్కారము చేసి యిట్లనెను." మీ యిరు వురు నాపాలిణము లిచ్చినారు. మీ కొకసంగతి చెప్పెదను చనిపోయిన యీచండాలుఁ డొకనాఁడు నాకు రెండునేత్ర

ము లిచ్చి వాసుకీశీలమునకుఁ బంపినాఁడు. నా కింతకన్న నే
మియుఁ దెలియదు. నేనెఱిఁగిన దింతే.''

అంతట బౌద్ధచండాలుఁడు హిందూచండాలుని సమీపము నకేగి " ఓహో, ఇతఁడే యతఁడు. అప్పుడు కన్నులు దీసినది యితఁడే'' యని పలుకుచుఁ జండాలుని కట్టుబట్ట తడవి చూచెను. సంకేతాక్షరములు గలముద్ర యొకటి మాత్రము దొరకినది. అంత నతఁడు కాంచనమాలతో "నమ్ముఁడు. గురుదేవుని దర్శనము చేయించెదను. కారాగృహమునఁ బ్రవేశించుట కుపాయము దొరకినది. నిశ్చయముగా గురుదేవుఁడు కారాగారములో నుండును'' అని పలికెను.

---

## పరిచ్ఛేదము. ౧౩

### ౧

మొహరు తీసికొని బౌద్ధచండాలుఁడు యుద్ధక్షేత్రమునకుఁ బోయి గాయములు తగిలి పడియున్న బ్రాహ్మణ బౌద్ధసైనికులకు శుశ్రూష చేయుభారము తనయనుచరులపై నిడి కాంచనమాలను వెంటఁ దీసికొని తక్షశిలానగరమునకు బయలు దేఱెను.

అప్పుడు తక్షశిల దురవస్థయందుండెను. అశోకుని ప్రభుత్వము బహుదినములనుండి లోపించిపోయినది. మాటిమాటి

కి యుద్ధములు జరుగుటవలన నగరములోని గొప్పగొప్పకు
టుంబములు వితంతువులతో నిండిపోయెను. రాచనగరునం
దును బరివారము స్వల్పముగ నుండెను. అశోకుఁడు సేనాపతి
కాఁబోవుచున్నాఁ డని విని శత్రుసైనికులు యుద్ధమునకై
సరిహద్దులకుఁ బోవుచుండిరి. నగరరక్షకులగు భటులలోఁ
గొందఱు యుద్ధమునకుఁ గొందఱు లూటీలకుఁ బోయిరి.
మిగిలినవారి యకార్యములను సహింపలేక నగరవాసులు
కొందఱు గ్రామాంతరములకుఁ బోయిరి. నగరములోని పె
ద్దలు పిన్నలను బాధింపఁ జొచ్చిరి. చిన్నవా రందఱు గుమి
గూడి పెద్దవారి యిండ్లను లూటీ గొట్ట నారంభించిరి. వారి
కెచ్చటను నిరోధము లేకుండెను.

కాంచనమాలయుఁ జండాలుఁడును బహుకష్టముమీఁదఁ గా
రాగారముఁ జేరిరి. చెఱసాల శత్రువులు కేర్పడినదయ్యును
పహరా యిచ్చువా రచ్చట నెక్కువమంది లేరు. అచట ను
న్న నలుగురైదుగురు కావలివాండ్రుకూడఁ జెఱసాలతలుపు
ల చెంత గదిలోఁ జేరి గోల చేయుచున్నట్లు తోఁచెను. ఏవో
భాగములు పంచుకొనుటలో వారికిఁ దగవు కలిగిన ట్లుండెను.
బౌద్ధచండాలుఁడు బ్రాహ్మణచండాలవేషము ధరించిపోయి
మోహరు చూపెను. ఒకఁడు బయటికి వచ్చి యేమి కావలె
ననెను.

"ప్రభువు నానతి నిర్వర్తింప వలెను."

"నేఁ డెవఁదరు ?"

"ముగ్గురు."

"అందఱ నొక్కసారిగాఁ దొలఁగింపవలెను."

"ప్రభువు నాజ్ఞ."

అంతట లోపలనుండి యొకానొకఁడు "ఏమిరా, బయట గ
డబిడ చేయుచున్నారు? ఇక్కడ పని సాగనియ్యరురా?"
యనెను.

"ఉండు, సర్కారుపని."

"ఇఁక నైదురోజులలో సర్కారుపని బయటఁ బడునులే? ఈ
లోపుగాఁ గొంచెము కూడఁ బెట్టుకో!"

అంతట పహరా జవాను తాళముచెవి తెచ్చి "మేము లో
పలికి వెళ్ళలేము. నీవు సర్కారునౌకరువు. తాళముచెవి మా
కిచ్చి పో," అని పలికెను.

అపరిచితునకు నిస్సంశయముగాఁ దాళపుఁజెవి యిచ్చి వాఁ
డు లూటీ సొమ్ము విభాగించుకొనఁ గూరుచుండెను. కాం
చనమాల వానితో లోనికిఁ బోయినసంగతి వారు గమనిం
చ లేదు. ఇరువురు లోనఁ బ్రవేశించిరి.

కాంచనమాల యదరిపడినది. లోపలఁ జీఁకటి. ఎలుకలు
పందికొక్కులు కిచకిచలాడుచున్నవి. గజముదూరములో ను
న్నవస్తువు కానవచ్చుట లేదు. త్రోవ కనఁబడకుండుటచేఁ
జేతితో వెదకుచుఁ దుదకు ద్వారమును గనుఁగొని చండా
లుఁడు దానిని దెఱచెను.

అగది మిగులఁ జిన్నది. కష్టముమీఁద నొక రం దుండ వ

చ్చెను. మనుష్యుఁ డొక డం దున్నాఁడు. పండుకొనుటకుఁ బక్క లేదు, త్రాగుటకు నీరు లేదు. లోటామాత్ర మొకటి కలదు. వారు లోనికిఁబోవగనే ఖైదీ యిట్లనెను. "నన్ను జంపివేయుఁడు! దప్పిచేఁ బ్రాణము పోవుచున్నది! నీటిబొట్టయినను దొరకదు! చంపఁ దలఁచిన యెడల నొక్కసారిగాఁ జంపివేయుఁడు? ఏల హింస పెట్టెదరు!"

"చెఱసాలలో నిట్టి కష్టము లుండునా?" యని కాంచనమాల చండాలు నడిగెను.

ఆమె కంఠస్వరము నాకర్ణించి ఖైదీ కొంచెము ధైర్యము చెందెను. "అన్నా, నీ శత్రువులము గాము, మిత్రులము. మేము బాధ్యులము. శీఘ్రముగా ని న్నుద్ధరించెదము. కుణాలుఁ డను పేరుగల రాజపుత్త్రుఁ డిచ్చట నున్నాఁడో చెప్పఁ గలవా?" యని చండాలుఁడు వానితో ననెను.

"కుణాలుఁ డెక్కడనొ? వారిని మొదట బందిగమునందుంచినారు. ఎచ్చట నెట్టియవస్థలో నున్నారో తెలియదు; అసలున్నారో లేరో కూడఁ దెలియదు."

"ఇచ్చట మీ రెవ రెవ రున్నారు?"

"ఎట్లు తెలియును? నే నీగదిలో నున్నసంగతిమాత్రము తెలియును. బాధ యెక్కువగా నున్నప్పుడు కేకలు వేయుదును. ప్రక్కగదిలోనుండి యప్పుడప్పుడు కేకలు వినఁబడును. ప్రాణము పోవుచున్నది!"

"మీ రేమి భుజింతురు?"

“మొదట వారు భోజనం పెట్టెడివారు; వారమురోజుల నుండి పెట్టుట మానినారు. ఎత్తుగా నున్న యొూచిన్న కిటికీ వెంట రెండు రొట్టెలు పడును. ఒకప్పుడు పగటివేళను వే ఱొకప్పుడు రాత్రివేళను వచ్చును. అవి తిందును. నీరు దొరకదు.

“అట్లయిన నతనికిఁ గొంచెము నీరు తెచ్చి యిచ్చెద” నని కాంచనమాల పలికెను.

“అమ్మా, మీ కీపని యెందుకు? నేనే చేసెద” నని చం డాలుఁ డామెతోఁ జెప్పెను.

“అమ్మా, యెవరు మీరు? పాటలీపుత్రములో నాకు జబ్బు గా నున్నప్పుడు దగ్గఱఁ గూర్చుండి పాలు త్రాగించినది మీరే యని కంఠస్వరమునుబట్టి తోఁచుచున్నది!” అని ఖైదీ పలికెను.

“నేనుగూడ నీవలె నాపదలో నున్నాను.”

“తెలిసినది. కుణాలప్రభునిసంగతి యడుగుటచేఁ దెలిసినది. మీరువచ్చినారు, కావున మాకుఁదప్పక విముక్తికలుగును.” అంతటఁ జండాలుఁడు జలము గొని వత్తు నని సూచించెను. కాని భటులు తన్ను మరల రానీయరేమో యనియు, సం గతి తెలిసిన నఱికి వేయుదురేమో యనియు సంశయించి, ఖైదీని జూచి “నీ కోపిక యున్నదా? మాకుఁ గొంచెము తోడ్పడఁగలవా?” యనెను.

“ఏడెనిమిది రోజు లన్నములేక యోపిక యుండునా? అయి

నను ముక్తి కలుగునన్న యాశచేఁ బది యేనుఁగులబలము వచ్చెను. ఇప్పు డేమి చేయవలెనో చెప్పు."

"చెఱసాలతలుపు లన్నియుఁ దెఱవవలెను."

"ఇప్పుడే!" అని బందీ సంతోషముతో జయధ్వని చేసెను. ప్రక్కగదులనుండి జయధ్వనులు వినవచ్చెను.

"ఖైదీలు చాల గోల చేయుచున్నారు" అని బ్రాహ్మణులు మరల దోపిడిడబ్బు లెక్కించుకొనఁ గూరుచుండిరి.

౨

క్రమముగా వా రేఁబదిమంది ఖైదీలను బయటికిఁ దీసిరి. పిమ్మటఁ దాళపుఁజెవులగుత్తి త్రెంచి తల కొక చెవి యిచ్చి కనఁబడిన తాళముల నెల్లఁ దెఱపించిరి. ఆచీఁకటికొట్లనుండి క్రమక్రమముగా నూటయేఁబదిమంది బౌద్ధవీరులు బయటికి వచ్చినారు. కాంచనమాల తమ్ముద్ధరించుటకు వచ్చిన దని తెలిసికొని వా రెల్లరు నానందమున జయధ్వనులు గావించినారు.

బ్రాహ్మణు లప్పటికి నేమో చేయుచుండిరి. ఈసారి జయధ్వనులు వినినంతనే వారు భయపడి వచ్చిచూడ, ఖైదీలు తలుపులు తెఱచుకొని జయధ్వనులు చేయుచు సింహద్వారమువైపునకు వచ్చుచుండుట కానవచ్చెను. అంతట వారు ప్రమాదము జరిగినదని గ్రహించి దొరకిన మార్గమువెంటఁ బలాయితు లయిరి. లూటీధనము లెక్కపెట్టుట కొంతవఱ

కు జరిగినది. కొంతడబ్బు తీసికొనిపోవుటకు వీలుపడినది, కొంత మిగిలిపోయినది. బ్రాహ్మణులు పాఱిపోయిరి.

అంతట కాంచనమాల ఖైదీల కాహారాదులు సమకూర్పఁ బ్రస్తావించెను. అందఱును బ్రాహ్మణుల భాండారమునుండి భోజనపదార్థములను గొనివచ్చిరి. కాంచనమాల స్వయముగా వంటచేసి వా రందఱకును భోజనము పెట్టెను.

భోజనానంతరము వారు విశ్రాంతి దీసికొనుచుండ కాంచనమాల కుణాలునివృత్తాంతము వారి నడిగెను. ఎవ్వరు నతని వార్త చెప్పలేకపోయిరి.

మహారాజ్ఞిగారి రహస్యాజ్ఞను దెలుపుటకై కుంజరకర్ణుఁడు కుణాలుని గొనిపోయినతరువాత నాతనివృత్తాంతము తెలియుటకు వీలు లేకపోయెను. కుణాలునిజాడ తెలియకపోవుటచే సైనికులు విభ్రాంతు లయిరి. అసంతుష్టు లయిన సేనాధికారులను కుంజరకర్ణుఁడు కౌశలమునఁ గారాగృహమున వేయించెను. కొందఱికి మహారాజ్ఞియాదేశము చెప్పినాఁడు, కొందఱను రాజసభ నుండి చెఱసాలకుఁ బంపినాఁడు, కొందఱిను యుద్ధమున జయించి ఖైదు చేసినాఁడు, కొందఱను సంహరించినాఁడు. మిగిలినవా రీచెఱసాలలో నుండిరి. వారిని కాంచనమాల విడిపించినది.

ఆమెకు భర్తజాడ తెలిసినది కాదు. పిమ్మట నామె వారిలో గట్టివానిపై వారి భారము నుంచి ''స్వామిని వెదకుట కిప్పుడే బయలుదేఱుచున్నాను. మీ రందఱు నేదోవిధముగా నా

త్మరక్షణము చేసికొనుఁడు" అని పలికెను.

అంతటఁ జండాలుని యాదేశానుసారముగా వా రెల్లరు నాలోచించి "ఇచ్చటి నుండి యాత్మరక్షణము చేసికొనుట కష్టము. మన మెల్లరము వైరుల నాక్రమింతము." అని నిర్ధారణ చేసికొనిరి.

కారాగారము రాజభవనమునకు సమీపమునం దున్నది. వా రెల్లరు తెల్లవాఱులోపల బంధనాలయమునుండి ప్రాసాదమునకు సొరంగము త్రవ్విరి. మఱునాఁ డుదయమున నేఁబదిమంది సొరంగమువెంట రాజసౌధమును జేరఁ బోయిరి. ఏఁబదిమంది ద్వారము నాక్రమించిరి. అచ్చట రక్షకు లెక్కువమంది లేకుండుటచే రాజభవనము శీఘ్రముగా స్వాధీనమయ్యెను. అంతట వారు ప్రాసాదమున నివసింపఁజొచ్చిరి. భాండారము వారిచేఁ జిక్కెను. అశోకునిపేర వారు ప్రభుత్వము సాగింపఁ జొచ్చిరి. విప్లవమునెడ విరక్తి చెందినవారందఱును వారితో నేకీభవించిరి. అచ్చటచ్చట లూటీలు చేసి జీవించు అశోకునిసైనికులు వచ్చి వారితోఁ గలిసిరి. ఇంకను ననేకులు తోడ్పడిరి. అశోకుఁడు కుంజరకర్ణుని జయించి ఖైదు చేసినాఁ డన్నవార్త కొలఁదిరోజులకు వారికిఁ దెలిసెను. తర్వాత కుంజరకర్ణుఁ డెచ్చటికో పాఱిపోయినాఁ డనియు నతనిని బట్టుటకు అశోకమహారాజు సైనికులను బంపెననియుఁ దెలిసినది. సేనాపతి లేకుండుటచే సైనికులు తక్షశిలానగరమునకు వచ్చిరి. దుర్గముమీఁదను రాజసౌధ

ముమీఁదను అశోకుని పతాక లెగురుచుండెను. ఉపాయాంతరము లేక శత్రువు లెక్కడివా రక్కడ యథాయథ లయిరి. విప్లవము శాంతించెను.

బౌద్ధులు బహుప్రదేశమునుండి తక్షశిలానగరమునకు వచ్చుచుండిరి. కుణాలుని జాడమాత్రము తెలియలేదు. ఎల్లెడ శాంతి నెలకొనెను. అశోకమహారాజు ససైన్యముగా తక్షశిలానగరమున కేతెంచునని వార్త తెలియవచ్చెను. కాంచనమాలకు శాంతి కలుగ లేదు. భర్తజాడ యామెకుఁ దెలిసినది కాదు. ఏ యేప్రదేశమునందుఁ దనభర్త బందిగా నుండవచ్చు నని యామె కనుమానము కలిగెనో యా యా స్థలమునకుఁ జండాలుని వెంటఁ బెట్టుకొని యామె కుణాలు నన్వేషించెను. కనఁబడిన గొప్ప బౌద్ధుల నిద్దఱను విడిపించెను. కాని భర్తజాడ యామె కెచ్చటను దొరకలేదు.

ఒకనాఁటి సాయంకాలము చండాలుని వెంటఁ బెట్టుకొని యామె యరణ్యమునఁ జనుచుండెను. కాంచనమాల వాని కనేకేతిహాసములు చెప్పుచు ననేక ధర్మము లుపదేశించుచుండెను. ఆ సమయమున నాకస్మికముగా కాంచనమాల స్తంభితయై నిలువఁబడెను. శ్రద్ధతో నామె యేమో వినుచున్నట్లుండెను.

“ఏ మది ?” యని చండాలుఁ డామె నడిగెను.

కాంచనమాల కుడి చేతితో వానిని వారించి “ఊరకుండు” మనెను.

చండాలుఁ డాశ్చర్యాన్వితుఁడై కాంచనమాల ముఖము వంకఁ జూచుచు నిలుచుండెను.
"కుణాల కుమారుఁ డిచట నున్నాఁ" డని కొంతసేపటికా మె పలికెను.
"ఉన్నారా? మీకెట్లు తెలిసినది.?"
"వినఁబడుట లేదా యాకంఠస్వరము? నేను బాగుగా గుర్తించితిని."
"ఎవరి కంఠస్వరము?"
"వినఁబడుట లేదా? నాచెవులకుఁ జక్కఁగా వినవచ్చుచున్నది. ఆకంఠధ్వని చక్కఁగా గుర్తించితిని. ఇంకను వినఁబడుట లేదా? నాశరీరము దుర్బల మగుచున్నది! నే నిఁక నిలువలేను. రమ్ము!" అని పలికి కాంచనమాల శీఘ్రగమనమున స్వరము వచ్చువైపునకు నడచెను. లతావితానములను ద్రెంచుచుఁ గంటకములను లక్ష్యముసేయక కూపసమీపమునకుఁ బోయి "నాథా, ఇదిగో వచ్చితిని!" అని యామె బావిలో దుమికెను.
చండాలుఁ డాశ్చర్యముతో నామె ననుసరించెను. కూపము సమీపమునకుఁ బోవు నప్పటికి "ధర్మం శరణం గచ్ఛామి! సంఘం శరణం గచ్ఛామి! బుద్ధం శరణం గచ్ఛామి!" అను వాక్యములు వానికి వినవచ్చెను.
కుణాలుఁడు సర్వధర్మ మమతా విపశ్చిన్నామక సమాధి బల మున బాహ్యజ్ఞాన శూన్యుఁడై యుండెను. కాంచన

మాలయు బావి యడుగున భర్త్రుహస్తమును బట్టుకొని మూర్ఛితవలె బాహ్యజ్ఞాన శూన్యయై యుండెను.

3

అంతటఁ జండాలుఁడు వారి నిరువురను భుజములపై వేసికొని బావిలోనుండి బయటికి వచ్చెను. ఇరువురకును బాహ్యజ్ఞానము లేదు. చాలసేపటికి కాంచనమాలకుఁ జైతన్యము వచ్చినది.; కుణాలునకు మాత్రము రాలేదు. రాత్రియంతయు నతఁ డాస్థితియందే యుండెను. అతని నోటినుండి త్రిశరణనామములు మాత్రము వెలువడుచుండెను. ప్రభాతమున నతనికి బాహ్య జ్ఞాన ముదయించినది. కాంచనమాలా శరీరస్పర్శ ననుభవించి యతఁడు "కాంచనా, నీ వింత దూర మెట్లు వచ్చితివి ? యనెను.

ప్రత్యుత్తర మిచ్చు శక్తి లేకుండుటచే కాంచనమాల యాతనిముఖము వంకఁ జూచెను. కుణాలుని నేత్రకోటరములలోఁ గనీనికలు కానరాకుండుటచే నామె "ఇది యేమి !" యనెను.

"కాంచనా, నేత్రములు లేకపోవుటచేత సమాధియందుండఁ గలిగితిని. నేత్రము లున్నయెడల నట్లు చేయలేనివాఁడనే," అని కుణాలుఁడు భార్యతో ననెను.

చండాలుఁడు కాంచనమాలను గాంచి "పట్టణమునకుఁ బోవుదమా ?" యనెను.

"ఇఁకఁ బట్టణముతో నేమి పని ? ఇచ్చటనే యుందును. న

మాధికి విఘ్నము కలుగదు." అని కుణాలుఁడు వచించెను. చండాలుఁ డంతట నల్వంకలఁ జూచెను. లతాప్రతానములచేఁ గూపము చుట్టు ప్రక్కల నున్నయడవియు సుందరముగా నుండెను. అచ్చట వెన్నెల పర్విన ట్లతనికిఁ దోఁచెను. చూడఁ జూడ నతని కాశ్చర్యము కలిగెను.

అంతటఁ జండాలుఁ డీ యద్భుత వృత్తాంతమును బ్రకటించుటకై పట్టణమునకు బయలు వెడలెను. భార్యాభర్త లిరువురు నేమేమో మాటలాడుకొనుచుండిరి.

౪

ఒక్కరొక్కరే వచ్చి యచ్చట గుమిగూడఁ జొచ్చిరి. క్రమముగా బౌద్ధు లనేకు లేతెంచిరి. అశోకుఁడు రాత్రివేళ తక్షశిలానగరమున కేగుదెంచి కోడలి గుణసంపదచే దేశమున శాంతి నెల కొన్నందులకు మిక్కిలి యానందించెను. నేఁడు పుత్రుని సమాధి సఫల మయ్యెనని యాకర్ణించి సపరివారముగా నతఁడు వనమున కరుదెంచెను. కుణాలుఁ డప్పుడు జనుల కుపదేశముచేయుచుండెను. శ్రీబుద్ధభగవానుని అవదానమాల నుండికథలు చెప్పుచు నతఁ డచ్చటిజనుల నానందవారిధి నోలలాడించు చుండెను.

అశోకుఁడు నిశ్శబ్దముగాఁ జాలసేపా సుధామయోక్తుల నాలకించి యానందము పట్టఁజాలక ప్రసంగము చేయుచుండగనే కుమారునిఁ గౌఁగిలించుకొనెను. కుణాలుఁడు తండ్రికి సా

ష్టాంగ నమస్కారము చేసెను. బహుకాలమునకు సమాగమ మగుటచే నిరువురు నానంద బాష్పముల విడువఁ జొచ్చిరి. కుణాలుఁ డంధుఁ డయ్యెనని అశోకుఁడు గ్రహించి "నాయనా, నీ కీదశ యెవరివలన సంప్రాప్తించినది?" యని కుమారు నడిగెను.

"కన్నులున్న యెడల సమాధి సంసిద్ధించి యుండదు" అని యతఁడు ప్రత్యుత్తర మిచ్చెను.

ఇంతలో కుంజర కర్ణుని బట్టుకొని కొందఱు సైనికు లామార్గము వెంటఁ బోవుచు అశోక మహారా జచ్చట నున్నట్లు విని ప్రభువు సన్నిధి కతనిని గొనివచ్చిరి. కాలుసేతులకు సంకెలలు వేసి నలుగురు సైనికు లాతనిని మహారాజు నెదుటకుఁ గొనివచ్చిరి.

తిష్యరక్ష కుణాలుని కన్నులు తీయించినప్పటి నుండియు నీ నేత్రము లెవరివో యెవరు పంపినారో యని మహారాజు మనస్సు మిక్కిలి శంకాస్పద మయ్యెను. నేఁడు సంగతి యంతయు స్ఫురింప నతఁడు మహాకోపముతో కుంజర కర్ణుని జూచి "నరాధమా, నాకుమారుని కన్నులు దీయించితివా?" యనెను.

కుంజర కర్ణుఁడు మందహాసము చేయుచు నిట్లనెను." అశోక సేనానీ, నన్ను రక్షింపు మని నిన్ను వేడను. నీవు స్వధర్మమునం దున్నంత కాలము నీకు సేవ చేసితిని. నీవు ధర్మము త్యజించిన తరువాత శత్రువు నైతిని. బౌద్ధులతో నే నెన్న

డు నొక్కసారియైనను సత్యము చెప్పలేదు. ఈనా తుదిరో జున నీతో మాత్రము సత్యము పలికెదను. ధర్మభయముచేఁ గాదు. ధర్మేతరులతో నసత్యము చెప్పినను దోషమేమి? నేఁడు నేను సత్యము చెప్పుటచే నీకు మనోవ్యథ కలుగును. ఎవతెను మిక్కిలి ప్రేమించుచుంటివో యెవతెను రాజరాజేశ్వరిని జేసితివో యాభ్రష్టురాలు నీకుమారుని కన్నులు దీయించినది! ఆమె బౌద్ధ మతావలంబిని కాదు—హిందువు! దీక్షాసమయమున జరిగిన తిరుగబాటులో నన్ను విడిపించిన దామెయే; కత్తిగట్ట నుత్సాహము పురికొల్పిన దామెయే. కుణాలునితో యుద్ధమున నోడి నేను బందీనైనపుడు నన్ను విడిపించి నా కధికార మిచ్చిన దామెయే. నేఁటికి నామెయే రాజేశ్వరి. నాసంకెలలు తీయించి నన్ను తక్షశిలానగరమున కధికారిని జేయు మని యామె కడనుండి నీపేర నాజ్ఞా పత్రము తెప్పింపఁ గలను; కాని యామె కిప్పుడు మతిభ్రంశము కలిగినది. నాపరివారము తిరిగి పోనియెడల నేను జిక్కువాఁడను గాను; ఇచ్చటినుండి పాటలీ పుత్రమునకుఁ బోవకుండ ని న్నరికట్టు వాఁడనే!”

ఈమాట లాలకించునప్పటికి మహారాజు నిర్వాక్కు నిశ్చేష్టుఁడు నయ్యెను.

“నాకు శిక్ష విధింతువా? యని కుంజరకర్ణు డనెను.

“తిష్యరక్ష కధికార మున్నంత కాలము నీవీస్థితియందే యుందువు.”

"నన్నుంచినట్లే! నేడు మూడవ యామమున నీదేహము పంచభూతములలోఁ గలిసిపోవును.!" అని పలికి రక్షక భటులనంకఁ జూచి కదలుఁడనెను.
మంత్ర ముగ్ధులవలె వా రతని నొకానొకవృక్షముక్రింద నిలువఁ బెట్టిరి. ఇష్టదేవతానామము జపించుచు కుంజరకర్ణుఁడు దేహము చాలించెను.

---

## పరిచ్ఛేదము ౧౪

### ౧

"నేఁటినుండి రాజ్యభారము స్వయముగా వహించితి" నని యౌవనమునుండియే అశోకుఁడు ప్రకటించెను. కుణాలుని కాంచనమాలను వెంటఁ బెట్టుకొని యతఁడు తక్షశిల కేఁతెంచెను సంసారభారము వహించుటకు కుణాలుఁడు సమ్మతింపలేదు.
"భగవన్, బోధిసత్త్వ, తమరు మాయాతిథ్యము స్వీకరించి సుభద్రాంగి నొకసారి కలిసికొనవలె" నని మహారాజు ప్రార్థింపగా కుణాలుఁ డంగీకరించెను. అంతట తక్షశిలా పరిపాలనమునకుఁ దగు నేర్పాటులు చేసి విశ్వాసపాత్రు లగుకొలఁదిమంది సైనికులను కుణాలుని కాంచనమాలను వెంటనిడుకొని మహారాజు త్వరితగామియగు రథ మెక్కి పాటలీపుత్రమునకు బయలుదేఱెను.

## ౨

పాటలీపుత్రము చేరినతోడనే తిష్యరక్షను న్యాయసభకుఁ గొని రా సేవకులకు మహారాజు ఆజ్ఞ ఇచ్చెను. ఆజ్ఞ నిర్వర్తిల్లుటకుఁ బూర్వమే తిష్యరక్ష యచ్చటికరుదెంచెను. ఆమె వేషము వికృతముగా నుండెను. కేశము లంటలు గట్టిపోయినవి. పరిధానము జీర్ణమై యున్నది. వచ్చి యామె మహారాజుతో "నాపీఠమునుండి గూర్చుండ వద్దు" అని పలికెను.

"దూరముగా నుండు దుర్మార్గురాలా!" యని మహారాజ అనెను. అప్పుడు కోపముతో నామె అశోకునిఁ గొట్టఁబోయెను. ఆమెను బట్టుకొండని యతఁడు సేవకుల కానతిచ్చెను, కాని వారామెను బట్టుకొన సాహసింప లేదు. అంతట కాంచనమాల లేచి యామెను బట్టుకొనెను. తిష్యరక్ష కాంచనమాల ముఖమువైపు తేఱిపాఱఁజూచుచు "అమ్మా, నమస్కారము! నీవు మాకుటుంబము నేల విడిచిపోయితివి? నీకోసము నేనెంతో వెదకినాను. ఎచ్చటికిఁ బోతివి?" అని కాంచనమాల శరీరము నిమిరెను.

పిమ్మట నచ్చటినుండి కదలి వచ్చి తిష్యరక్ష మహారాజును జూచి "నేను భ్రష్టురాలను గానియెడల నీ వెట్లు మహారాజ వయితివో! మఱి నిన్ను మోసగించి నేనుమాత్రమెట్లు మహారాజ్ఞి నగుదునో! నీ వెదురు తిరుగు. నీకు ధనమిచ్చెదను. చేత నయిన యెడల నీ పిరికి పందలను బాఱఁ

ద్రోహిలి బ్రాహ్మణధర్మము నెలకొల్పుదు.' నని కుంజరకర్ణు నితోఁ జెప్పినా" నని పలికెను.

"ఇఁక విన నక్కఱ లేదు. పాపిష్ఠురాలా, దంభతపస్వినీ, న న్ననుక్షణము మోసపుచ్చినావు. మొట్టమొదటనే నీవు బౌద్ధధర్మము స్వీకరించినావు కావా? పిమ్మట నాప్రియపు త్రుని కన్ను లూడఁ బెఱికించితివి. నీయుద్దేశ్యమేమో తెలి యదు. ఎట్లయినను నీకోర్కె చెడ్డదే కాని మంచిది కానేర దు. నిన్ను కుక్కలకు వేయించెదను! నాయెదుటినుండి దూ రముగాఁ బో!" అని మహారాజు కేక వేసెను.

"ఆహాహా! ఏమి పాడుచున్నావు! ఏదీ పాడు తిరుగ! నీకు సింహాసన మిచ్చి పోయెద" నని పలికి తిష్యరక్ష కుణాలుని దగ్గఱకుఁ జని యాతని గడ్డ మెత్తి "ఏమి, బాబూ,, నీమను లుకెంపు నేవి? ఏవి నీ నేత్రములు!" అని యాతని మేను నిము రఁ జొచ్చెను.

" ఓసి మంగలిదాన! కుంజరకర్ణున కేమి యానతిచ్చితివే!" అని మహారాజడిగెను.

"మంగలిదాననా? రాజరాజేశ్వరిని! రాజ్యము సమస్తము వ్రేలిమీఁదఁ ద్రిప్పి విడిచిపెట్టితిని నన్నా మంగలిదాన వ నుచున్నావు"

"కాదు. సావిత్రివి, ధన్యురాలవు!

" సావిత్రిని గాను. భ్రష్టురాలను!

అంతట కాంచనమాల అశోకునితో నిట్లనెను. "దేవా,

ఇప్పు డీమెకు వెఱ్ఱి యెత్తినది. తమ రీమె నేల నిందించెదరు? శాస్తి చేసినను లాభ ముండబోదు. నా దాక్షిణ్యమనవి కల దు. ఈమెను నా కప్పగింపుఁడు. నే నీమె యున్మాద ముపశ మింపఁ జేసి ధర్మ పథమున కీమె మనస్సు గొనివచ్చెదను.''

''నీచేతఁ గాదు!''

''ఆభారము నాది. ఈమె నుద్ధరించుమార్గము చూచెదను. నాచేతఁ గాని యెడలఁ ప్రభువుగా రున్నారు కదా!'':

"మంచిది. ఉన్మాదము తగ్గినపిమ్మట నీమెకుఁ బ్రాణదండ నము విధించెదను!"

"వలదు మహారాజా! దేవరవా రీమెను క్షమింపఁదగును."

"ఇట్టి పాపిష్ఠురాలిని క్షమించినయెడల మఱి యెవరికి శాస్తి చేయుదును?"

తిష్యరక్ష నృత్యము చేయుచు మహారాజుకడకు వచ్చి "గొం తున కురి పోసుకొని చచ్చెద!" నని యఱచెను.

కాంచనమాల యిట్లనెను. "అది యెట్లున్నను మహారాజా, యీమె నాభర్త నేత్రములు తీయించినది. ఆయన బోధిస త్త్వుఁ డయినాఁడు. అభియోగము తేలేదు. ఈమెను క్షమిం పుఁ డని నావిన్నపము. ధర్మమున్నయెడల నాభర్తకు మరల నేత్రములు వచ్చును!"

"నీ వెంత స్వాతంత్ర్యము వహించుచున్నావు. సరే, తీసికొని పొ మ్ము. ఈమె నీదాసిగా నుండును" అని మహారాజు పలుక గా కాంచనమాల తిష్యరక్షచేయి పట్టుకొనెను. మంత్రులు

ద్ధవలె నామె కాంచనమాల వెనువెంటనే చనెను.

3

తిష్యరక్ష వెడలిపోయిన తరువాత మహారాజు లేవఁబోవు చుండు నంతలోఁ బ్రతీహారి వచ్చి వాసుకీశీలమునుండి వైజ్ఞానవిదుఁ డేతెంచె నని విన్నవించెను. అతనిని దోడ్కొని రమ్మని తోడనే అశోకుఁ డానతిచ్చెను. ఆయన వచ్చినతరువాత "నీ వేల వచ్చినా?" వని మహారాజు ప్రశ్న చేసెను. "తమరు ప్రభువు లయినతరువాత నన్ను రమ్మని యాజ్ఞాపించినారు; బహుమానము లభించు నని సెలవిచ్చినారు. అందుకని వచ్చినాను. దేవరవారు లక్షముద్రలు దయచేయవలెను!" అని యతఁడు విన్నవించెను.

"ఇంతధన మేమి చేయుదువు?"

"కొంతభాగముతో మృతినొందినవారిని బ్రతికించుటకు యత్నింతును. కొంతధనముతో భార్యకు నగలు చేయించుకొందును."

"మంచిది. నీకు లక్ష యిచ్చినాను. అచేతనావస్థలో నున్న నాకుఁ జైతన్య మిచ్చినందులకు మఱియొకలక్ష యిచ్చినాను. నే న్నొకటి యడిగెదను. అంధత్వము పోఁగొట్టుటకై నీవు చేయుచున్న పరిశ్రమ సఫల మయినదా?"

"ఒకరికన్ను దీసి యింకొకరికిఁ బెట్టఁగలను. కన్నుమాత్ర మింక్రను జేయఁ జాలను."

"మంచిది. ఎవరి నేత్రమయినను దెచ్చి యీ యంధునకుఁ బెట్టుము."
నేత్ర మిచ్చుట కెవ్వరును సమ్మతి చూపలేదు. తుదకు బౌద్ధ చండాలుఁడు గురువుకొఱకుఁ దన నేత్రముల నూడఁబెఱికి యిచ్చెను. కుణాలుఁడు వారించినను వాఁడు వినలేదు. విజ్ఞానవిదుఁ డా నేత్రములను కుణాలుని నయనకోటరములలో స్థాపించెను. ఇంతలో కుణాలునకు వెనుకటివలెనే చూపువచ్చెను. ఎచ్చటినుండియో తిష్యరక్ష యరుదెంచి "ఓహో, మావానికిఁ గన్నులు వచ్చినవే!" యని వెడలి పోయెను. అప్పుడామె శాక్యభిక్షుకురాలి వేషము ధరించి యుండెను.
చూపు వచ్చిన మీఁదట కుణాలుఁడు చండాలుని బిలిచి "నీవు నాకు నేత్రము లిచ్చినావుగదా, నీ కెట్టికష్టము లేదా?" యని యడిగెను.
అప్పుడు చండాలుఁ డానుపూర్వికముగాఁ దనవృత్తాంత మతనికి విన్నవించెను. విని మహారాజు కన్నీరు విడిచెను.
"జ్ఞానచక్షువు లిచ్చినవారికిఁ జర్మచక్షువుల నిచ్చుటకు వెనుదీయుచో నావంటి పాపిష్ఠుఁ డింకొకఁ డుండునా?" అని చెప్పునప్పటికి వానికి యథాపూర్వకముగా నేత్రములువచ్చినవి!
కుణాలునకుఁ జూపు వచ్చినదని విని కాంచనమాల యచటికి రాఁగా మహారాజామెను జూచి "కాంచనా, నీవాక్కు ఫలించినది! అని పలికెను. కాంచనమాల లజ్జానతవదనయై యచ్చటినుండి కదలి చనెను.

౪

అంత మహారాజు కుమారుని జూచి "కుణాలా, నీవు బోధి సత్త్వుఁడవు. మావలన నీకుఁ గాఁదగిన దేదియుఁ గానరాదు. అయినను నావల్ల నెఱవేఱఁ దగిన యభీష్ట మున్న యెడలఁ జెప్పుము. వెంటనే నెఱవేర్చెద"నని పలికెను.

"దేవా, మీరు నన్ను వెడలఁగొట్టినను మరల దేనికై రాజకుటుంబములోనికి వచ్చితినో యాకార్యము నెఱవేర్పుఁడు."

"చెప్పుము. వెంటనే చేసెదను."

"నేఁటినుండి బౌద్ధధర్మమే యీవిశాల మగధ సామ్రాజ్యమునఁ బ్రచారమునం దుండు నని చాటింపుఁడు. సామ్రాజ్యమునకు వెలుపలఁగూడ బౌద్ధ ధర్మము ప్రచారము నందుండు ప్రదేశములను బందోబస్తు చేయింపుఁడు. తక్షశిలలో సద్ధర్మము వ్యాపించలేదు. నన్నచ్చట ధర్మాధ్యక్షునిగా నియోగింపుఁడు."

బౌద్ధధర్మమే మగధసామ్రాజ్యధర్మ మని అశోకుఁడు తోడనే చాటించెను. తన కుమారులలో నొకనిని సింహళమునకును మఱియొకరిని పారశీకమునకును బంపెను.

"నీవు పంచనదమునకు ధర్మాధ్యక్షుఁడవై శాసనకర్తగా నుండు" మని మహారాజు చెప్పగా "శాసకత్వము వేఱొకరికి దయచేయుఁ" డని కుణాలుఁడు విన్నవించెను.

"అట్లయిన, కాంచనమాలపై రాజ్యభారముండునుగాక! ఈసారి కాంచన తక్షశిలజయించినది" అని అశోకుఁడుపలికెను

"కాంచనకుఁ బ్రపంచక వ్యాపారములమీఁద నభిలాషము లే" దని కుణాలుఁడు చండాలునివైపు చూచెను.

"ప్రభూ, నాది నీచజాతి. గురువుగారి పాదసేవ చేసెదను. శాసకత్వము నాకుఁ దగదు. దయామయా! యని వాఁడు విన్నవించెను.

అంతట మహారాజు మఱియొకరిపై నాభారముపడవైచెను.

౫

ఆనాఁడు నిర్వర్తిల్లిన కార్యబలముచేఁ దరువాత వేయిసంవత్సరములవఱకు భరతవర్షము బౌద్ధ ధర్మావలంబి యయ్యెను. ఆనాఁటి కార్యబలముచే ఆసియాఖండ మంతయు బౌద్ధధర్మము నాశ్రయించెను.

౬

కాంచనమాల యనుగ్రహముచే శిష్యరక్షు బుద్ధమతి యను తననామము సార్థకము చేసికొన్నదఁట.

సమాప్తము

నమో తస్స భగవతో అరహతో సమ్మా సంబుద్ధస్స

## ఇందీవఱకు ప్రకటింపఁబడిన గ్రంథములు: చిత్రపటశోభితములు

**ప్రేమసుందరి** — నవరసపూరితమగు సాంఘికనవల క్యాలికోబయిండు 272 పుటలు వెల చందాదారులకు 1-0-0 ఇతరులకు రు1-8-0

**చోరశిఖామణి** — రోమహర్షకమగు డిటెక్టివునవల క్యాలికో బయిండు 197 పుటలు వెల చందాదారులకు రు1-0-0 ఇతరులకు రు 1-8-0

**లక్ష్మీప్రసాదము** — నవరసపూరితమగు సాంఘికనవల ఇందు మూఢాచారాంధ్రగు స్త్రీలవలన కుటుంబములందు సంభవించు కలహములును నాకలహములవలన గలుగు కష్టపరంపరలు చక్కగా వర్ణింపఁబడినవి. క్యాలికోబయిండు 846 పుటలు వెల చందాదారులకు రు1-0-0 ఇతరులకు రు1-8-0

**హత్యారహస్యము** — జటిలమగు ఇతివృత్తముగల డిటెక్టివు నవల. తుదివఱకు దోషులెవరో కనుగొనుటకు వీలులేకుండునటుల దుండగులు పన్నిన పన్నాగము లత్యంత భయంకరములు వెల చందాదారులకు రు 1-0-0 ఇతరులకు 1-8-0

**ఘోస్టు (ప్రథమభాగము)** — అధికారదుర్వినియోగము- అభేద్యములైనకోటలందు సురాచారుల దురంతరములు -మహాప్రళయము-రహస్యములవలన కలిగిన తీవ్రమనోవేదనము న్నగు విచిత్రకల్పనా చమత్కృతులుగల యీ సంపుటము నబ్రతిపుటయందు తక్షణము బాఠకమహాశయుల జిత్తరువులఁగావించుచుండును. వెల చందాదారులకు రు1-0-0 ఇతరులకురు 1-8-0

**ఘోస్టు (ద్వితీయభాగము)** — ఈశ్వర కృపాతిశయము, భక్తసంరక్షణము, భాగవతవిజయము విమల ప్రేమాభిరామములగు సాధుయువతీయువజనుల కల్యాణము మున్నగు నద్భుతఘట్టములు. వెల చందాదారులకు రు 1-0-0 ఇతరులకు రు 1_8-0

—:అను ములు:—

మార్కండేయ — 3 గంటలకాలము లో ప్రదర్శించుట వ్రాయబడిన భక్తిపూరితమగు 6 అంక టకము చక్రపాణిపాటలు గలవు. వెల దారులకు రు 0-8-0 ఇతరులకు రు 0-1

మృత్యురంగిణి — అనుబంధముగా ప్రకటింపఁబడు డిటె రమణీపిశాచియగు యొకానొకసుందరి భయంకరకథ. నరహత్య, నారీహత్య, ఆత్మహత్యలు పైహత్యలు వెల చందాదారులకు రు0-8-0లు ఇతరులకు రు0-12-0.

అభాగిని. — బాలవితంతువులు పడుకష్టములు, దుండగులు పన్ను కుట్రలు, సమాజరీతిని వర్ణింపఁబడిన నవరస భరితమగు సాంఘికనవల వెల చందాదారులకు రు0-8-0లు ఇతరులకు రు0-12-0లు.

ఛద్మవేషి. — ఇది చక్రపాణిపరిశోధకనవల వెల చందాదారులకు రు0-8-0లు ఇతరులకురు0-12-0లు.

ఇట్టివే చక్రపాణి నవలలు పలువురు కవులచే రచింపఁజేసి రెండుమాసముల కొకటిగా ప్రకటింపఁ బడుచుండును.

1924వ సం॥ నవంబరు నెలలో వెలువడు పదునెనిమిదవ గ్రంథము

కాప్రవరపు నరసింహాముచే

రచింపఁబడిన

చారిత్రిక నవల

చిన్నకోడలు."

సరస్వతీ గ్రంథమండలి,

రాజమహేంద్రవరము.